


శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



రాబోయే వారాల్లో భారత్ అమెరికా మధ్యంతర ఒప్పందం ఖరారు

జాతీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు 05

వెనిజులా ప్రతిపక్షనేత కిడ్నాప్



సంపుటి 09, సంచిక: 74 | బుధవారం | 11-02-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# నేడే పుర పోరు

- రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 41,773 మంది సిబ్బంది, 1,379 మంది రిటర్నింగ్ అధికారులు...
- 8,203 పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల పటిష్ట బందోబస్తు
- 1,302 అత్యంత సమస్యాత్మకమైనవి : డిజిపి శివధర్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు జరగనున్న పోలింగ్‌ను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం 41,773 మంది పోలింగ్ సిబ్బంది, 1,379 మంది రిటర్నింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ కోసం మొత్తం 8,191 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో పాటు డిజిటల్ నిఘా వ్యవస్థలను కూడా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు రూ. 2,67,49,019 విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా అన్ని పోలింగ్ ప్రాంతాల్లో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు. అలాగే 4,150 మందిని ముందస్తుగా బైండోవర్ చేయగా, 1,183 లైసెన్సలను ఆయుధాలను డిపాజిట్ చేయించుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారం ఫిబ్రవరి 9న సాయంత్రం 5 గంటలతో ముగిసిందని, ఆ తరువాత అన్ని రకాల ప్రచార కార్యక్రమాలు నిషేధమని కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లు తమ ఎపిక్ నెంబర్ ద్వారా 'టీ పోల్' ఆన్‌డ్రాయిడ్ యాప్ నుంచి ఓటర్ స్లిప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు, పోలింగ్ కేంద్ర వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 92400214 56ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి ఓటరు భయం లేకుండా, బాధ్యతాయుతంగా తరువాయి 2లో

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తన ఓటు హక్కు వినయోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 11.30 లకు కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల( బాలురు) లో ఓటు వేయనున్నారు. అనంతరం సిఎం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం ప్రత్యేక సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు జరుగుతున్న 116మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో విద్యాసంస్థలకు సెలవు ఇచ్చింది. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులందరికీ 'స్పెషల్ క్యాజువల్ లీవ్' (ప్రత్యేక సాధారణ సెలవు) మంజూరు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.




## ఓటుకు నోటు కేసు రికార్డులు ఎఫ్ఎస్ఎల్‌లో లేవు

- ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన నివేదికలు కూడా ఫార్వర్డింగ్ అథారిటీకి ఇప్పటికే పంపించాం
- కొన్ని కేసుల డేటా దెబ్బతిన్నదన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
- అగ్ని ప్రమాదంపై విచారణ కొనసాగుతున్నది
- డిజిపి బి.శివధర్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టేందుకు కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సిఎఫ్ఎస్ఎల్)తో పాటు నాగపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్‌కు చెందిన నిపుణుల బృందం హైదరాబాద్‌కు చేరుకుంది.ఈ నిపుణులు స్థానిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు తెలంగాణ డిజిపి బి.శివధర్ రెడ్డి తెలిపారు. విచారణ కొనసాగుతోంది. కొన్ని రోజుల్లో అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం తెలుస్తుంది అని ఆయన వెల్లడించారు.అగ్ని ప్రమాదంలో కేసులకు సంబంధించిన డేటా నష్టం జరిగిందన్న ప్రచారాన్ని డిజిపి ఖండించారు. కొన్ని కేసుల డేటా తరువాయి 2లో

# ఓం బిర్లాను తొలగించాలి



లోక్‌సభ స్పీకర్‌పై విపక్ష సభ్యుల అవిశ్వాస తీర్మానం

- 120 మంది ఎంపిల సంతకాలతో లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసును అందజేసిన ప్రతిపక్ష ఎంపిలు
- సభా వ్యవహారాలను కొనసాగించడంలో స్పీకర్ పక్షపాత వైఖరి చూపుతున్నారని ఆరోపణ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు మంగళవారం నోటీసు సమర్పించాయి. ఆయన సభా వ్యవహారాలను నిర్వహించడంలో స్పష్టంగా పక్షపాతంతో వ్యవహరించారని, ఆయన నిర్వహిస్తున్న రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేశారని ఆరోపించాయి. బిర్లాను లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష పార్టీలు నోటీసు ఇచ్చాయి. కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్ కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, చీఫ్ విప్ కె సురేష్, విప్ మొహమ్మద్ జావేద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ '94 సి' కింద కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకెతో సహా అనేక ప్రతిపక్ష పార్టీల తరపున లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసును సమర్పించారు. కాంగ్రెస్, డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, వామపక్ష పార్టీలు, ఆర్‌జెడి సహా ప్రతిపక్షానికి చెందిన దాదాపు 120 మంది ఎంపిలు ఈ నోటీసుపై సంతకం చేశారని వర్గాలు తెలిపాయి. శివసేన యుబిటి, ఎన్‌సిపి(ఎస్‌పి) కూడా నోటీసుపై సంతకం చేశాయి. అయితే టిఎంసి నోటీసుపై సంతకం చేయలేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా నోటీసుపై సంతకం చేయలేదని వర్గాలు తెలిపాయి. లోక్‌సభ కార్యకలాపాలను స్పష్టంగా పక్షపాతంతో నిర్వహిస్తున్నందున, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) నిబంధనల ప్రకారం, ఓం బిర్లాను స్పీకర్ పదవి నుండి తొలగించాలని తాము ఒక తీర్మానాన్ని నోటీసు ఇస్తున్నాము అని ప్రతిపక్షాలు నోటీసులో పేర్కొన్నట్లు వర్గాలు తెలిపాయి. అనేక సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీల నాయకులను మాట్లాడటానికి అనుమతించలేదు, ఇది పార్లమెంటులో వారి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని నోటీసులో ప్రతిపక్ష సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 2న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై తన ప్రసంగాన్ని పూర్తి చేయడానికి అనుమతించలేదని కూడా నోటీసులో ఉదహరించారు. ఇది ఒక వివిక్త ఉదాహరణ కాదు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి దాదాపు ఎల్లప్పుడూ అనుమతించరు అని అన్నారు. అదే విధంగా 3వ తేదీన ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిలను మొత్తం బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని, వారి ప్రజాస్వామ్య హక్కులను వినియోగించినందుకు మాత్రమే వారికి తరువాయి 2లో



## రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

- ఆధారాలు సేకరించే పనిలో ఉన్నాం
- బాధ్యులపై ఉక్కుపాదం మోపుతాం
- మంత్రి పొంగులేటి హెచ్చరిక
- సిపిఐ మిత్రపక్షమేనని స్పష్టీకరణ

ప్రజాపక్షం/ ఖమ్మం

రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని ఇందుకు బాధ్యులైన వారిపై ఉక్కుపాదం మోపక తప్పదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఆధారాలను సేకరించే పనిలో ఉన్నామని ఎక్కడెక్కడ పరికరాలు అమర్చారో ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. ఖమ్మంలో మంగళవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన ఫోన్ ట్యాపింగ్‌నే ఇప్పుడు కూడా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని ఇందుకు కారకులైన వారిని వదిలిపెట్టబోమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరువాయి 2లో



12న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా

# కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

- నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి
- డ్రాఫ్ట్ సీడ్ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- సమ్మెలో దాదాపు 30 కోట్ల మంది పాల్గొంటారని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్, బర్కత్‌పుర చౌరస్తా నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను ఎఐటియుసి జాతీయ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్ ప్రారంభించి, అనంతరం మాట్లాడుతూ నిరంకుశ మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయడం, డ్రాఫ్ట్ సీడ్ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవడం, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ కోసం ట్రేడ్ యూనియన్లు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సంఘటిత, ప్రైవేట్ రంగ సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు, అసంఘటిత కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వరంగ ఉద్యోగులు దేశ వ్యాప్తంగా దాదాపు 30 కోట్ల మంది సమ్మెలో పాల్గొంటారని, కార్మికులు, రైతులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఏం. నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, నేతలు బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, సిఐటియు నేతలు కుమార స్వామి, నరేష్, అజయ్ బాబు, ఐఎఫ్‌టియు నేతలు అనురాధ, అరుణ, శివబాబు, టియుసిఐ నేతలు ఎస్ఎల్ పద్మ, ప్రదీప్,హెచ్ఎంఎస్ నేత అంజాద్ ఖాన్, ఎఐయుటిసి నేత భరత్ తదితరులు పాల్గొన్నారు.


'పిల్లల మిస్సింగ్' వెనక

## దేశవ్యాప్త నెట్‌వర్క్ ఉందా?

నిర్ధారించాలని కేంద్రాన్ని కోరిన 'సుప్రీం'




**న్యూఢిల్లీ :** 'దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పిల్లలు తప్పిపోయిన సంఘటనల వెనక ఏదైనా నెట్‌వర్క్ ఉందా ? లేదా రాష్ట్ర నిర్దిష్ట సమూహం ఉందా?' అనే విషయాన్ని నిర్ధారించాలి అని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. ఈ సంఘటనల వెనక ఏదైనా నమూనా ఉందా లేదా తప్పిపోయిన సంఘటనలు యాదృచ్ఛికంగానే జరిగాయా? అని నిర్ధారించాల్సిన అవసరాన్ని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నొక్కిచెప్పింది.అన్ని రాష్ట్రాల నుండి డేటాను క్రోడీకరించాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు మాత్రమే తప్పిపోయిన పిల్లల డేటాను ప్రాసిక్యూషన్‌కు ఇచ్చారని, ఇంకా 12 రాష్ట్రాలు తమ డేటాను ఇవ్వలేదని ధర్మాసనానికి వివరించారు. కేంద్రం ప్రభుత్వం పూర్తి డేటాను పొందిన తర్వాతనే విశ్లేషణ చేయవచ్చని ఆమె సమర్పించారు. ఈ తప్పిపోయిన సంఘటనలు ఎలా జరిగాయనే విషయాన్ని తాము తెలుసుకోవాలనుకుంటున్నామని ఐశ్వర్యా భాటి ధర్మాసనానికి విన్నవించారు. రక్షించబడిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి ఆ సంఘటనలకు ఎవరు బాధ్యులనే విషయాన్ని తరువాయి 12లో




## రాష్ట్రపతి పరిశీలనలో బిసి కోటా బిల్లులు

- 42% పెంపు సంబంధించి రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి
- ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర సామాజిక న్యాయ శాఖమంత్రి బి.ఎల్.వర్మ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో వెనకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచే ప్రతిపాదనకు సంబంధించి రెండు బిల్లులు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ తెలిపారు. లోక్‌సభలో మంగళవారం మల్కాజిగిరి లోక్‌సభ నియోజవర్గం తరువాయి 2లో



## అసోం సిఎం వ్యాఖ్యలపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన సిపిఐ

నిష్పాక్షిక దర్యాప్తునకు 'సిట్' ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పదే పదే చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలపై భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తనపై తక్షణ న్యాయపరమైన జోక్యాన్ని కోరుతూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా ద్వారా సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసినట్లు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. న్యాయపరంగా కఠిన తరువాయి 12లో

# వసూలైంది రూ.1,33,208 కోట్లు... ఇచ్చింది రూ.51,725 కోట్లు...

- పార్లమెంట్ సాక్షిగా స్వయంగా కేంద్ర మంత్రే ప్రకటించారు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడి
- పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి వసూలైతే దక్షిణాదికి సగటున 30 పైసలను ఇస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వానికి 2024–25 సంవత్సరానికి గాను రూ.1,33,208 కోట్ల పన్నులు వసూలైతే, కేంద్రం నుండి తెలంగాణకు పన్నుల రూపంలో రూ.27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో రూ.7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో రూ. 16,762 కోట్లు మొత్తంగా రూ.51,725 కోట్లు మాత్రమే విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా స్వయంగా కేంద్ర మంత్రినే ప్రకటించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నులరూపంలో కేంద్రానికి



రూపాయి వసూలవుతే, తిరిగి దక్షిణాది రాష్ట్రాలకు సగటున 30 పైసలను ఇస్తున్నారని, కాని బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం ప్రతి ఒక రూపాయికి రూ.4ల చొప్పున తరువాయి 2లో

# ట్రంప్ ఆర్థిక యుద్ధం క్యూబాలో చమురు సంక్షోభం

స్తంభించిన విమానాలు, బస్సులు, విద్యాలయాలు




**హవానా:** చమురు రవాణాపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా క్యూబా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. ట్రంప్ వైఖరి ఇదేవిధంగా కొనసాగితే రాబోయే రోజుల్లో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి. క్యూబాపై ట్రంప్ ఆర్థిక ఆంక్షల యుద్ధాన్ని ఉధృతం చేయడంతో దేశంలో వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లన్నీ వాహనాల శబ్దం లేకుండా నిశ్శబ్దంగా ఉన్నాయి. విమానాల రాకపోకలను నిలిపివేశారు. చమురు సంక్షోభాన్ని తట్టుకునేందుకు, ఇంధనం ఆదా చేసేందుకు అనేక విద్యాలయాలను మూసివేశారు. క్యూ బాలో చమురు సంక్షోభం తలెత్తడంతో ఎయిర్ కెనడా కూడా ఆ దేశానికి విమానాలు నడపకుండా నిలిపివేసింది.దేశంలోకి చమురు వచ్చే అవకాశాలు లేకపోవడంతో అత్యవసరాలను తీర్చుకోవడంకోసం క్యూబా ప్రభుత్వం ఎమర్జెన్సీ చర్యలు తీసుకుంది. ఇంధనాన్ని ఆదా చేయడంకోసం విశ్వవిద్యాలయాలు సహా విద్యాలయాలను మూతవేశారు. గతనెల వరకూ వెనిజు లా తరువాయి 12లో



## తమ్ముడిపై విచారణకు బ్రిటన్ రాజు సమ్మతి

**లండన్:** జెఫ్రీ ఎప్‌స్టీన్ స్నేహంపట్టి ఆ మురికి అంటించుకున్న తన సోదరుడు, బ్రిటన్ రాజకుటుంబీకుడు, స్వయానా తన సోదరుడు ఆండ్రూ (66)పై దర్యాప్తు జరిపించేందుకు బ్రిటన్ రాజు ఛార్లెస్–3 సమ్మతించారు. ఈ విధంగా వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్ అవినీతికి సాక్ష్యాలుగా ఉన్న పత్రాలు, వీడియోలు, ఫొటోలపై ఆయన మొదటిసారి నోరు విప్పి స్పందించినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు తెలిపాయి. 'మిస్టర్ మౌంట్ బాటన్ విండ్సార్ ప్రవర్తనపై వెలుగులోకి వస్తున్న విషయాలపై రాజు తన తీవ్ర ఆందోళనను, మాటలు, అసాధారణ చర్యలద్వారా స్పందించారు, నిర్దిష్ట వాదనలను మౌంట్ బాటన్ విండ్సార్ పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, థేమ్స్‌వ్యాలీ పోలీసులు గనుక ఒకవేళ ఆయనను సంప్రదించినట్లయితే వారికి సహకరించాలి, అందుకు తాము అంగీకారంతో సిద్ధంగా ఉన్నాం' అని ఛార్లెస్ రాజు ప్రకటించినట్లు ఆయన అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు. అధికార నివాసం, అధికార కార్లాయాలలో మౌంట్ బాటెన్ విండ్సార్ అనుమానిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని రాచరిక వ్యతిరేక సమూహం రిపబ్లిక్‌కు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేయడానికి ఆధారాలున్నాయా?అని థేమ్స్‌వ్యాలీ పోలీసులు అంచనాలువేస్తున్నారు. బ్రిటన్ మాజీ రాణి క్వీన్ ఎలిజిబెత్ రెండో కుమారుడైన మాజీ ప్రిన్స్ ఆండ్రూ (ఆండ్రూ అల్బెర్ట్ క్రిస్టియన్ ఎడ్వర్డ్ మౌంట్‌బాటెన్–విండ్సార్) వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో దీర్ఘకాలం గాఢానుబంధం కొనసాగించారు. బ్రిటన్ సంఘంలో పెద్దమనిషిగా చెలామణీ అయిన మహిళ ఘిస్‌లైన్ మాక్స్‌వెల్, ఎప్‌స్టీన్ ఇద్దరూ ఆండ్రూ లైంగిక అవసరాలు తీర్చేందుకు మహిళలను సరఫరా చేశారన్న నిందలు ఎందుర్కొంటున్నారు. సింగపూర్, వియత్నాం, హాంగ్‌కాంగ్‌లలో పెట్టుబడుల అవకాశాలపై పర్యటించి ఆ వివరాలు రహస్యంగా దాచి ఉంచారు. వారిమధ్య నడిచిన ఈ–మెయిల్స్, రాజప్రాసాదానికి రావాల్సిందిగా ఎప్‌స్టీన్‌కు ఆండ్రూ పంపిన ఆహ్వానాలు, చివరకు తన భార్య, ఇద్దరు కుమార్తెల ఫోటోలను కూడా ఎప్‌స్టీన్‌కు పంపించిన గత చరిత్ర అంతా ఈనెలారంభంలో అమెరికా జస్టిస్ విభాగం విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్, వీడియోలు, చిత్రాల ద్వారా బహిర్గతమైంది. దీంతో ఆండ్రూ రాజప్రాసాదం వదిలి సాండ్రింఘామ్‌లోని ప్రైవేటు ఎస్టేట్‌కు నివాసాన్ని మార్చుకున్నారు. మరోవైపు ఈ కేసులో నిందితురాలు మాక్స్‌వెల్ కూడా అమెరికా హౌస్ కమిటీ ఎదుట సాక్ష్యం చెప్పేందుకు తిరస్కరిస్తున్నారు.

# వెస్ట్‌బ్యాంక్ దురాక్రమణపై ప్రపంచవ్యాప్త నిరసన

**జెరూసలెం:** వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాన్ని ఆక్రమించి కలిపేసుకోవాలని, విస్తరించాలన్న ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ప్రతిఘటించాయి. ఎనిమిది ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకించాయి. యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి సహా అనేక ప్రపంచదేశాలు ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను విమర్శించాయి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ ఆక్రమణలు చట్టవిరుద్ధమని, అక్కడి వెనక్కుతగ్గి వెళ్ళిపోవాలని బ్రిటన్ డిమాండ్ చేసింది. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెబ్రాన్ డిప్యూటీ మేయర్ అస్మా షరబతి హెచ్చరిక చేశారు. పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయెల్ తన పట్టును పెంచుకోవడంకోసం మరింతగా విస్తరించేందుకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెల్ వరుసగా అనేక చర్యలకు ఆమోదం తెలియజేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో భూముల రిజిస్ట్రేషన్లు, ఆస్తుల సేకరణకు సంబంధించిన నిబంధనలలో సెక్యూరిటీ క్యాబినెల్ ఆదివారంనాటి సమావేశంలో నాటకీయమైన మార్పులకు తీసుకువచ్చింది. ఈ మార్పులవల్ల దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌కు ఉన్న ఆటంకాలు తొలగిపోయాయి. 1967లో జరిగిన యుద్ధంలో గాజా, వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెం ప్రాంతాలను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఐతే పాలస్తీనియన్లు ఈ మూడు ప్రాంతాలను కలిపి భవిష్యత్ దేశంగా ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నారు. పాలస్తీనా అథారిటీ ఈ చర్యను ఖండించింది. తక్షణం ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్‌చేసింది. ఇజ్రాయెల్‌తో అరబ్, ముస్లిం దేశాలు సంబంధాలను రద్దు చేసుకోవాలని పాలస్తీనా అథారిటీ కోరింది.

ఈ పరిణామాలపై ట్రంప్ స్పందిస్తూ, వెస్ట్‌బ్యాంక్ దురాక్రమణకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాను మద్దతు ఇవ్వబోనన్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో స్థిరత్వం నెలకుంటే ఇజ్రాయెల్ కూడా స్థిరంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో శాంతి సాధన లక్ష్యం నెరవేరుతుందని వైట్‌హౌస్ యంత్రాంగం ఒక ప్రకటనలో తెలియజేసింది.



వెస్ట్‌బ్యాంక్‌లో జెరూసలెం తన పాలనాపరమైన అధికార నియంత్రణను విస్తరించడం ద్వారా ఓస్లో ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందని పేర్కొంది. బెత్లెహామ్‌లో, హెబ్రాన్‌లో ఉన్న రెండు ప్రధానమైన తమ ప్రదేశాలను కూడా తన అధీనంలోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ యంత్రాంగం నిర్ణయించింది. దీనికి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఈ పరిస్థితులమధ్య ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అమెరికా వెళ్ళారు. ట్రంప్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఇరాన్‌తో అణు చర్యలు జరిపే అవకాశం ఉంది.

**ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మృతి**
**రఫాలో మెరుగుపడిన రవాణా**

గాజా పశ్చిమ నగరం షిఫాలో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో ముగ్గురు మరణించారు. షిఫా ఆసుపత్రివర్గాలు ఇచ్చాన సమాచారం ప్రకారం, గడచిన అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత కూడా గాజాలో యుద్ధం కొనసాగుతోంది. కాల్పుల ఉల్లంఘనకు పాల్పడి దాడులు చేయడంతో తాము స్పందించామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. రఫాలోని లక్ష్యాలను దెబ్బతీసినట్లు తెలిపింది. ట్రంప్ 20 సూత్రాల ప్రణాళిక ప్రకారం, నేటికి నాలుగు నెలలుగా గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంది. వెస్ట్‌బ్యాంక్‌లో పరిణామాలపట్ల ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తన అధికార పరిధి విస్తరిస్తూ సెక్యూరిటీ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా వ్యతిరేకించారు. కాగా గాజా నుండి ఈజిప్టు వెళ్ళేందుకు ఉన్న ప్రధానమైన రఫా క్రాసింగ్‌ను తెరచిన కొద్దిరోజుల తర్వాత ఈనాటికి రవాణా కార్యకలాపాల పరిస్థితి మెరుగుపడింది. సోమవారం 88 మంది రోగులు గాజా నుండి ఈజిప్టుకు చికిత్సల నిమిత్తం వెళ్ళారు. దాదాపు 20,000 మంది పాలస్తీనియన్లు మెరుగైన వైద్యచికిత్సకోసం ఈజిప్టు వెళ్ళేందుకు ఎదురుచూస్తున్నారు.

## వైదొలగిన మరో సహాయకుడు
## రాజీనామాకు తిరస్కరించిన స్టార్‌మర్



**లండన్:** ఎప్‌స్టీన్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని దేశంలో ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొంటున్న బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్, ఇప్పటికే ఇద్దరు ముఖ్యసహాయకులను కోల్పోయారు. క్యాబినెట్ కార్యదర్శి క్రిస్‌వర్మల్డ్ కూడా రాజీనామా చేసే వాతావరణం కనిపిస్తున్న తరుణంలో, స్టార్‌మర్ తన పదవికి రాజీనామా చేసేందుకు తిరస్కరించారు. ఒక సరికొత్త బృందాన్ని ప్రభుత్వం నడిపించడంకోసం తాను సిద్ధం చేసుకుంటానని ఉద్ఘాటించారు. చుట్టుముడుతున్న వివాదంపై ఆయన మంత్రివర్గ సహచరులు గడచిన 24 గంటలుగా మౌనం వహించడంతో స్టార్‌మర్ మంగళవారం వారిని సమావేశపరిచారు. తన మంత్రివర్గాన్ని రద్దుచేయకూడదని నిర్ణయించుకున్నారు. స్టార్‌మర్ రాజీనామా చేయాలని స్కాటిష్ లేబర్ నాయకుడు అనాస్ సర్వర్ డిమాండ్ చేసిన తర్వాతీ సమావేశం జరిగింది. ''మనం విశ్వాసంతో ముందకు వెళదాం, దేశంలో మార్పు తెచ్చేందుకు కృషిని కొనసాగిద్దాం, ప్రభుత్వ విధులకు, ప్రజాసేవకు ఐక్యంగా కట్టుబడి ఉందాం'' అని మంత్రివర్గ సభ్యులతో ఆయన అన్నారు. లేబర్‌పార్టీకి ఎంతో సురక్షితమైన, సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న గోర్టన్–డెంటన్ స్థానానికి ఈనెల 26న ఉప ఎన్నిక జరుగుతున్న తరుణంలో స్టార్‌మర్ ఈ వివాదం ఎదుర్కొంటున్నారు. మాండెల్సన్‌ను అమెరికాలో దౌత్యవేత్తగా నియమించాలని సలహా ఇచ్చిన కీవ్ స్టార్‌మర్ సిబ్బంది ప్రధానాధిపతి మోర్గాన్ మెక్‌స్వీనా ఆదివారం తన పదవికి రాజీనామా తర్వాత తాజాగా టెన్ డౌనింగ్ స్ట్రీట్ కమ్యూనికేషన్స్ విభాగం ప్రధానాధిపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టిమ్ అల్లెన్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ''ప్రధానమంత్రి స్టార్‌మర్ ఒక కొత్త బృందాన్ని తయారు చేసుకోవడానికి వీలుగా నేను వైదొలగుతున్నాను, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను'' అని లిఖితపూర్వకంగా టిమ్ అల్లెన్ పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రభుత్వంలో ఆయనకు ప్రధాన సలహాదారుగా టిమ్ అల్లెన్ పనిచేశార. మెక్ స్వీనీ టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌ను వదలి వెళ్ళిపోవడంతో అక్కడి కార్యకలాపాలన్నీ స్తంభించాయి. కానీ వింధ్యా అలెక్సన్, జిల్ కత్‌బెర్ట్‌సన్‌లు ఆ బాధ్యతలు తీసుకున్నారు. స్టార్‌మర్ ప్రభుత్వంలో ఇద్దరు ముఖ్యులు వరుగా రాజీనామాలు చేయడంతో బ్రిటన్ ప్రభుత్వంలో సంక్షోభం మరింత ముదిరింది. ఐతే ప్రతిపక్షాలు కోరినవిధంగా రాజీనామా చేసేందుకు కీవ్ స్టార్‌మర్ తిరస్కరించారు. మాండల్సెన్ పదే పదే అబద్ధాలు వల్లెవేసి తనను తప్పుదోవ పట్టించారని, తన్న అబద్ధాలతో నమ్మించి మోసం చేశారని స్టార్‌మర్ వాదిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం ప్రధానమంత్రి ఆయనను, తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార నివాసం టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో సిబ్బందితో స్టార్‌మర్ మాట్లాడుతూ, మంచికోసం మనం ముందుకు వెళ్ళాలని, మంచి చేయడానికి రాజకీయాలు ఒక బలమైన శక్తిగా ఉంటాయని మనం నిరూపించాలని అన్నారు.

## అమెరికా–బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

**ఢాకా:** అమెరికా–బంగ్లాదేశ్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 15 సంవత్సరాలలో బంగ్లాదేశ్ 18.5 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను, ఇంధన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. అమెరికాకు ప్రయోజనం కలిగే రీతిలో ఈ ఒప్పందం జరిగింది. 3.5 బిలియన్ డాలర్లు విలువైన వ్యవసాయ ఉత్పత్తులను, మరో 15 బిలియన్ డాలర్లు విలువైన ఇంధన ఉత్పత్తులను ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.అదేవిధంగా అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులకు తన మార్కెట్‌లను బంగ్లాదేశ్ అందుబాటులో ఉంచాలి. ఒకవేళ బంగ్లాదేశ్ గనుక అమెరికా నుండి 14 బోయింగ్ జెట్స్‌ను కొనుగోలు చేస్తే ఈ వాణిజ్యం విలువ మరింతగా పెరుగుతుంది.35,000 కోట్ల టాకాలు విలువైన 14 బోయింగ్‌లను కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు యూనస్ తాత్కాలిక ప్రభుత్వం గతవారం ప్రకటించింది.

## బ్రిటన్ ప్రధానిగా ముస్లిం మహిళకు అవకాశం?



**లండన్:** ఒకవేళ కీర్‌స్టార్‌మర్ తన పదవికి రాజీనామా చేస్తే ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు తీసుకోవడానికి ఎవరున్నారనే విషయంపై ఊహాగానాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లేబర్‌పార్టీకి చెందిన హోంమంత్రి షబనా మహ్మద్ పేరు వినిపిస్తోంది. 45 ఏళ్ళు వయసుగల షబనా మహ్మద్ మితవాతపక్షంలో ఉన్నారు. న్యాయవాది, రాజకీయనాయకురాలు. స్టార్‌మర్ గనుక రాజీనామా చేస్తే ఎక్కువగా ప్రధానమంత్రి పదవికి ఆమెకే అవకాశాలు ఉన్నాయని అంచనాలు చక్కెర్లు కొడుతున్నాయి. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న మిర్‌పూర్ పట్టణ మూలాలుగల షబనా మహ్మద్ బర్మింగ్‌హామ్‌లో జన్మించారు. మంత్రి పదవి చేపట్టాక ఆమె ప్రధానంగా బ్రిటన్ సరిహద్దు భద్రతా వ్యవహారాలు చూస్తున్నారు. 2002 ఆక్స్‌ఫర్డ్ లింకన్ కాలేజీలో ఆమె డిగ్రీ పూర్తిచేశారు. హిందుస్థాన్ పత్రిక ఈ వార్త ప్రచురించింది.2010లో ఆమె మొదటి ముస్లిం ఎంపీగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఆమె పాలస్తీనియన్లకే పూర్తి మద్దతు ఇస్తున్నారు.

## ఎఫ్ఎస్ఎల్‌లో లేవు

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. అలాంటిదేమీ జరగలేదు అని స్పష్టం చేశారు. 'నోట్ ఫర్ ఓట్' కేసు విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలు, సాక్ష్యాలు 2021లోనే కోర్టుకు పంపించామని, ఆ కేసుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు ఒక్క శాతం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేవని డిజిపి స్పష్టం చేశారు. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన నివేదికలు కూడా ఫార్వార్డింగ్ అథారిటీకి ఇప్పటికే పంపించామని చెప్పారు. ఎఫ్ఎస్ఎల్ సర్వర్లలో ఉన్న డేటాను తిరిగి పొందేందుకు నిపుణులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అఖండ విజయం సాధిస్తుందని 80 శాతం స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిక స్థానాలు గెలవబోతుందనే విషయాన్ని తెలుసుకుని బిఆర్ఎస్ ఆక్రోశం వెల్లగక్కుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని నెలకు రూ.6,300 కోట్లు వడ్డీలకే చెల్లిస్తున్నామని ఆయన అన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పేరుతో మొండి గోడలు దర్శనమిచ్చాయని ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ సిపిఐ మా మిత్రపక్షమేనని ఆయన సమాధానం ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరి మధ్య పోటీ కేవలం స్నేహపూర్వక పోటీ మాత్రమేనన్నారు.

## బిసి కోటా బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయా?, వాటి ప్రస్తుత స్థితి ఏమిటి? అని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ సమాధానమిస్తూ వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచే ప్రతిపాదనకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు అందినట్లు చెప్పారు. ఈ బిల్లులు భారత రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం కోసం కేంద్రానికి పంపించారని, ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్రపతి ఆమోదం లభిస్తే, తెలంగాణ రాష్ట్రంలో విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచేందుకు చట్టపరమైన మార్గం సుగమం అవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి ప్రకటనతో బిసి రిజర్వేషన్‌ల అంశం మరో సారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చినట్లైంది.

## తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిమానా విధిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. ఇక 4వ తేదీన బిజెపికి చెందిన ఒక ఎంపి ఇద్దరు మాజీ ప్రధానులపై పూర్తిగా అభ్యంతరకరమైన, వ్యక్తిగతీకరించిన దాడులు చేయడానికి అనుమతించారని, సంప్రదాయాలు, సముచిత నియమాలను ఉల్లంఘించినందుకు ఒక్కసారి కూడా మందలించలేదని నిషికాంత్ దూబే వ్యాఖ్యలను ప్రతిపక్ష సభ్యులు నోటీసులో ప్రస్తావించారు. తాము విజ్ఞప్తి చేసినప్పటికీ ఈ ఎంపిపై ఎటువంటి చర్య తీసుకోలేదని గుర్తుచేశారు. చాలా మంది కాంగ్రెస్ సభ్యులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి ఏదో ఊహించని చర్య చేపట్టే అవకాశం ఉందని తనకు కచ్చితమైన సమాచారం ఉందని, దాని ఫలితంగా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి సభకు రావద్దని ఆయనను అభ్యర్థించారని బిర్లా చేసిన వ్యాఖ్యలను కూడా నోటీసులో ప్రతిపక్షం ప్రస్తావించింది. ఈ అంశంలో కాంగ్రెస్ సభ్యులపై తప్పుడు ఆరోపణలు చేశారని, ఇది అవమానకరమైన విషయమని, విధాన నియమాలు, పార్లమెంటరీ మర్యాద నియమాలకు సంరక్షకుడిగా ఉండాల్సిన స్పీకర్, అటువంటి ప్రకటనలు చేయడానికి సభలో అడుగుపెట్టారని, ఇది ఈ రాజ్యాంగ పదవి దుర్వినియోగానికి నిదర్శనం అని నోటీసులో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్‌ను వ్యక్తిగతంగా గౌరవిస్తున్నప్పటికీ, పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యులు చట్టబద్ధమైన ప్రజా ఆందోళన అంశాలను లేవనెత్తకుండా ఆయన నిరంతరం అడ్డుకున్న తీరు తమకు బాధ కలిగించిందన్నారు. కాగా, మంగళవారం ఉదయం మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో జరిగిన ఫ్లోర్ లీడర్ల సమావేశంలో ప్రతిపక్షం నోటీసు సమర్పించాలనే నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్షం ఇచ్చిన నోటీసును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బిర్లా లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారని, నిబంధనల ప్రకారం దీనిని పరిశీలించి ప్రాసెస్ చేస్తామని వర్గాలు తెలిపాయి.

## నేడే 'పుర పోరు'

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని స్థానిక పాలనను బలోపేతం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నేడు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే వేతనంతో కూడిన సెలవు ప్రకటించింది. పాఠశాలలకు కూడా సెలవు ఇచ్చారు.

**మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత**

రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డిజిపి శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మున్సిపల్ ఎన్నికల భద్రతపై తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు డిజిపి మహేష్‌భగవత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. హైదరాబాద్ మినహా అన్ని పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల్లో జనవరి 27 నుంచే ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ఇప్పటివరకు 1,183 లైసెన్సు ఆయుధాలు జమ చేయించామని, 4,318మందిని బైండోవర్ చేశామని డిజిపి వెల్లడించారు. అలాగే 398 నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బిడబ్ల్యూ) అమలు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాల మధ్య, జిల్లాలోపల మొత్తం 55 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల సందర్భంగా అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఇప్పటివరకు రూ.3.09 కోట్ల విలువైన నగదు, మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై 142 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో 1,302 హైపర్ సెన్సిటివ్, 1,926 సెన్సిటివ్, 4,975 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఇతర శాఖల నుంచి 3,000 మంది అదనపు బలగాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల లోపల 100 శాతం వెబ్‌కాస్టింగ్‌తో పాటు హైపర్ సెన్సిటివ్ కేంద్రాల బయట కూడా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు డిజిపి వెల్లడించారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిజిపి శివధర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్‌కెమెరాల తీరును పరిశీలించారు.

# తెలుగు మృత భాష కాదు.. అమృత భాష






**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు మృతభాష కాదని, అమృత భాష అని వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండవ రోజు ఆర్ట్స్ కళాశాలలలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూమ్ నెంబర్ 121లో మంగళవారం పద్మ విభూషణ్ సంజీవ నరసింహా అధ్యక్షతన ' దేశ విదేశాలలో తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి మార్గదర్శనం' అనే అంశంపై చర్చను నిర్వహించగా, రూమ్ నెంబర్ 133లో 'సోషల్ మీడియా లైక్స్, షేర్స్, వైరల్ సాహిత్యం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హాంకాంగ్‌లో తెలుగు ఫెస్టివల్ ను నిర్వహించడంతో పాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యం లను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా అమెరికాలో తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని, పద్యాలు, లలిత గీతాలు, నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింపచేశామని, ప్రస్తుతం 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరించారు. ప్రతి శనివారం రెండు గంటలపాటు ఆస్ట్రేలియాలో తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీలో సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు. పిల్లలకు బాల్యం నుంచే తెలుగు భాష పై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, తెలుగు లిటరరీ కాంగ్రెస్ డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.కాసిం, జయ పీసపాటి, గూడూరు శ్రీనివాస్, గణేష్ తొట్టిపూడి, ఆచార్య వై రెడ్డి శ్యామల, డాక్టర్ ఝాన్సీ ఉడుము, సిరికొండ నరసింహ రాజు, రెహమానుద్దీన్ షేక్, దాసరి కరుణ, రాజీ కన్నా, చరణ్ పరిమి, అమృత రాజ్, సాత్వికలు, వంశీ, శివ శంకర్, ఉదయ్, రాము వేర్ల వెంకటనారాయణ, విమల, దండ వెంకట రాములు, బాలు అగ్నివేష్, హాతి రామ్, ధరణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

**పిల్లలకు బాల్యం నుంచే తెలుగు భాషపై మక్కువ కల్పించాలి**
**ఒయు తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు హాజరైన విదేశీ తెలుగు ప్రతినిధులు**

## క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలలకు నిమ్స్‌లో చిత్రలేఖనం పోటీలు

**పాల్గొన్న ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుధా రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం (ఐసిసిడి) సందర్భంగా నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బాలలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సుధారెడ్డి పాల్గొని, మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు మానసిక ధైర్యాన్ని పెంచడంతో పాటు, వారి ఆత్మవిశ్వాసాన్ని బలపరుస్తాయని అన్నారు. క్యాన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులకు ధైర్యం, ఆనందం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప తెలిపారు. బాలలకు ప్రత్యేక పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డా. సదాశివుడు గుండేటి, విభాగ అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులు, నర్సులు , సిబ్బంది పాల్గొన్నారు.



# ఇచ్చింది రూ.51,725 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమాతుల్యతను పెంచడంతో పాటు ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని తుమ్మల హెచ్చరించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షిణాది రాష్ట్రాలు నేటి కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదని, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ విమర్శించారు. 2018 19 నుంచి 2022 23 సంవత్సరానికి ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అని, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధయన్నారు. ఎక్కువ పన్నులను చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందన్నారు.

**జిఎస్‌టితో తెలంగాణకు రూ. 8వేల కోట్ల నష్టం ..**

జిఎస్‌టి సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు. 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాల వారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కోత పెట్టడంతో తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితంగా బలమైన రాష్ట్రాలను బలహీనపర్చి ఆయా రాష్ట్రాలు ఆర్థికంగా ఆధారపడేలా చేయాలన్నదే కేంద్ర ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

**కేంద్ర మంత్రుల పతనానికి నాంది....**

తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో కాలంలో ఏనాడూ ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తీసుకొచ్చామని, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందన్నట్టుగా మాట్లాడటం వారి పతనానికి నాంది అని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ నిమ్మితం తెలంగాణ రాష్ట్రం ప్రతిపాదించిన ఏ ఒక్కటి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా కోసం కేంద్రంతో పోరాడేందుకు తమతో కలిసి రావాలని మంత్రి తుమ్మల బిజెపి ఎంపిలను,నాయకులను కోరారు.



సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీకి

## రూ.25వేలు విరాళం

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సిఆర్ ఫౌండేషన్‌లోని సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీకి తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.25 వేలు విరాళం చెక్కును అందించారు. కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్, నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రంలో ఉన్న సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీని తెలంగాణ స్టేట్ యూనియన్ బ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధానకార్యదర్శి సమద్ ఖాన్, కె. రవీంద్ర బాబు (ఆస్ట్రేలియా)లు సందర్శించారు. పరిశోధన కేంద్రం, లైబ్రరీ కార్యకలాపాల గురించి పరిశోధన కేంద్రం కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి. విజయ లక్ష్మి , కన్వీనర్ కంభంపాటి అజయ్ కుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి జి. రాజగోపాల్ రెడ్డి, కె. జ్యోత్స్నలు వారికి వివరించారు. లైబ్రరీకి మరిన్ని పుస్తకాలు అవసరమని, అందుకు వీలుగా తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ రూ.25 వేల చెక్కును అంజేశారని, అదే విధంగా ప్రముఖ అభ్యుదయ రచయిత ఏటుకూరి ప్రసాద్ కూడా పుస్తకాల కోసం రూ.40 వేలు విరాళంగా అందించారని విజయలక్ష్మి తెలిపారు. విరాళం అందజేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

రూ.1511 కోట్ల విలువైన

# ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

ఆక్రమణలపై నగరం నలువైపులా ఉక్కుపాదం

ఒకే రోజు నాలుగు భారీ ఆపరేషన్లు

చెరువులు, పార్కులను కాపాడిన హైడ్రా





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ఆక్రమణలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తీవ్రంగా కొరడా ఝులిపించింది. చెరువులు, పార్కులు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంది. మంగళవారం ఒక్కరోజే నగరం నలువైపులా నాలుగు చోట్ల భారీ ఆపరేషన్లు నిర్వహించి ఆక్రమణలను తొలగించిన హైడ్రా, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ.1511 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు ప్రాంతాల్లో మొత్తం 12 ఎకరాల చెరువు భూమిని (కొండాపూర్ జంగం కుంట 4 ఎకరాలు, అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాలు) రక్షించగా, మరో రెండు చోట్ల కలిపి 1100 చదరపు గజాల మేర పార్కు స్థలాలను కాపాడింది.

**కొండాపూర్‌లో జంగం కుంటను కాపాడిన హైడ్రా**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం, మదీనాగూడ రోడ్ మార్గంలోని కొండాపూర్‌లో ఉన్న జంగం కుంట (4 ఎకరాలు) ఆక్రమణలకు గురవ్వగా, హైడ్రా వెంటనే చర్యలు చేపట్టింది. చెరువును పూడ్చి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నించిన కబ్జాదారులపై ఉక్కుపాదం మోపింది. రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా సంయుక్త తనిఖీలు నిర్వహించి, ఇది జంగం కుంటేనని నిర్ధారించింది. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ భూమి విలువ సుమారు రూ.700 కోట్లుగా అంచనగా ఉందని అధికారులు చెప్పారు.

**అల్వాల్ కొత్త చెరువులో 8 ఎకరాల ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో జరిగిన 8 ఎకరాల ఆక్రమణలను హైడ్రా పూర్తిగా తొలగించింది. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు, తాత్కాలిక షెడ్ల కారణంగా చెరువు తీవ్రంగా కలుషితమవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు ఆక్రమణలు నిర్ధారించి, ఎఫ్‌టిఎల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లు, షట్టర్లను తొలగించారు.

**నగరంలో రెండు పార్కులను రక్షించిన హైడ్రా**

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం, సాహెబ్ నగర్ కలాన్ పరిధిలోని జక్కిడినగర్ కాలనీలో 650 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. 1982లో లేఅవుట్‌లో పార్కుగా కేటాయించిన భూమిని తరువాత ప్లాట్లుగా విక్రయించారని స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు చేపట్టింది. అక్రమంగా నిర్మించిన ప్రహరీ, షెడ్లను తొలగించి ఫెన్సింగ్ వేసి, పార్కు స్థలమని సూచించే బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్, రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో జిహెచ్‌ఎంసికి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన 450 చదరపు గజాల పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి విముక్తం చేసింది. అక్కడ నిర్మించిన ప్రహరీ, రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

## వన్యప్రాణి అక్రమ వ్యాపారం భగ్నం

పులి దంతాలు, గోర్లు స్వాధీనం – ఇద్దరు అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్: అక్రమ వన్యప్రాణి వ్యాపారంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) హైదరాబాద్ జోన్ అధికారులు ఉక్కుపాదం మోపారు. నాంపల్లి ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో పులి కేనైన్ దంతాలు 2, పులి గోర్లు 7ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.డిఆర్ఐ అధికారులు కొనుగోలుదారులుగా నటిస్తూ నిందితులను సంప్రదించారు. నాంపల్లి లోని హోటల్ ఏషియన్ ఇంటర్నేషనల్, గది నెం. 305లో లావాదేవీలు జరగనున్నాయన్న సమాచారంతో అక్కడికి చేరుకుని నిందితులను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వన్యప్రాణి అవశేషాలు మరియు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం హైదరాబాద్ సెంట్రల్ ఫారెస్ట్ రేంజ్ అధికారికి అప్పగించారు. విచారణలో నిందితులు ఈ వన్యప్రాణి అవశేషాలను కేరళ రాష్ట్రానికి చెందిన జకరియా అనే వ్యక్తి నుంచి పొందినట్లు ఒప్పుకున్నారు. అతడు ఇద్దరు నిందితులకు సన్నిహిత మిత్రుడని తెలిపారు. సోమవారం జిల్లా అటవీ అధికారి నిందితులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరు పరచగా, 15 రోజుల న్యాయ రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం కేరళ అటవీ శాఖకు పంపించగా, వన్యప్రాణి అవశేషాల మూలాన్ని గుర్తించేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## అరేపల్లి పరిసరాల్లో పులి కదలికలు

థర్మల్ డ్రోన్‌లతో 24 గంటల నిఘా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అరేపల్లి గ్రామం పరిసరాల్లో సంచరిస్తున్న పులి కదలికలను తెలంగాణ అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పులికి కూడా హాని జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పులి కదలికలను గమనించేందుకు థర్మల్ ఇమేజింగ్ డ్రోన్‌లను వినియోగంలోకి తీసుకుని 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్‌ల ద్వారా రియల్ టైమ్‌లో సమాచారం అందుకుంటూ, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇదే సమయంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తూ, అటవీ శాఖ సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని గ్రామస్థులకు సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. పరిస్థితిని సమర్థంగా నిర్వహించేందుకు పెట్రోలింగ్ బృందాలను రంగంలోకి దించడంతో పాటు, పుణే నుంచి వచ్చిన నిపుణుల రెస్క్యూ బృందం కూడా అప్రమత్తంగా ఉంది. పులి సహజంగా అటవీ ప్రాంతం వైపు వెళ్లేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అటవీ శాఖ వెల్లడించింది.

## బ్రాడ్‌బ్యాండ్ సేవలతో చివరి గ్రామం అనుసంధానం

సిఎస్ రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్రాడ్‌బ్యాండ్ సేవలతో చివరి గ్రామాన్ని కూడా అనుసంధానించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణతెలిపారు. సిఎస్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో 8వ రాష్ట్ర బ్రాడ్‌బ్యాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో బ్రాడ్‌బ్యాండ్, టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధి పురోగతిని సమీక్షించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడానికి 15 రోజుల్లో జిల్లా కలెక్టర్లు జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎంఎయుడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

**227 ఆవాసాల్లో రోడ్డు నిర్మాణం**

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన(పిఎంజిఎస్‌వై) నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటిలేని 227 ఆవాసాల్లో రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు తెలిపారు. ఇందుకు సంబంధించి 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పిఎంజిఎస్‌వై 4వ దశ పనుల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ పిఎంజిఎస్‌వై పథకం నాలుగవ దశ భాగంగా రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాల్సిందిగా సూచించారు. 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందనిపంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డిపిఆర్ లను పూర్తి చేస్తామని సిఎస్‌కు వివరించారు.



నకిలీని అరికట్టాలంటే

## మేలైన విత్తనాల ఉత్పత్తి పెంచాలి

వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ విత్తనాలను అరికట్టాలంటే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని మేలైన విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతులకు సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి సూచించారు. విత్తనోత్పత్తిని పెంచాలని,అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విత్తనోత్పత్తి క్షేత్రాలపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాలో 8 చోట్ల సీడ్ ఫార్మ్‌లు ఉన్నాయని, 1629 ఎకరాల్లో ఉన్న సీడ్ ఫార్మ్‌లో వివిధ రకాల విత్తనోత్పత్తి చేస్తున్నట్లు అధికారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వరి, పెసర, జనుము, కందులు విత్తనోత్పత్తి చేస్తున్నామని కమిషన్‌కు వివరించారు.ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి క్షేత్రాల భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులను ఏర్పాటు చేసి, ఆ చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా భూ సమస్యలు ఉంటే ఆ సమస్యలను వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయశాఖకు చెందిన భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ తో పాటు వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ సుచరిత, డిడిఎ నాగమల్లీశ్వరీ, ఎడిఎ ఉషారాణి, సీడ్ ఫార్మ్ కు చెందిన అగ్రికల్చర్ అధికారులు వైద్యనాథ్, సక్రియ నాయక్, ఇంద్రసేన్, అనిల్ కుమార్, వాసు పాల్గొన్నారు.

80 శాతం కృష్ణా నీటిని

## ఎపి వాడుకుంటే కేంద్రం ఏంచేస్తుంది?

తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన ఎందుకు మాట్లాడటం లేదు?

కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను నిలదీసిన హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నీటి పారుదల శాఖ కెఆర్‌ఎంబికి రాసిన లేఖ ప్రకారం ఎపి ప్రభుత్వం 664 టిఎంసిల కృష్ణా నీటిని ( 80 శాతం) వాడుకుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నారని బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సం జయ్ మాజీ సిఎం కెసిఆర్‌పైన పడి ఏడవడం తప్ప, నీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన ఎందుకు మాట్లాడడం లేదని, కెఆర్‌ఎంబిని ఎందుకు నిలదీయడం లేదని ఆయన నిలదీశారు. హైద రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మదుసూదనాచారి, ఎంఎల్‌సి దాసోజుశ్రవణ్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తక్షణమే స్పందించి ఎపి నీటి తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలం నీటిని ఆపి పెట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీస్తే తాము చూస్తూ ఊరుకోబోమని, త్వరలో కెఆర్‌ఎంబి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై కేంద్ర మంత్రిని కలుస్తామని, రాజ్యసభ్యలో కూడా ప్రస్తావిస్తామన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీటిని తరలిస్తుంటే ప్రభుత్వం కండ్లు మూసుకున్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. వేసవి నేపథ్యంలో పంటలకు, పారిశ్రామిక అవసరాలకు నీటి అవసరాలు ఉంటాయని, ఆ అవసరాలను పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఎపి రోజు1.5 టిఎ ంసిల నీటిని తీసుకుపోతుంటే తెలంగాణ పంటలు ఏం కావాలని ప్ర శ్నించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏమిటని, రాష్ట్రంలో సర్కారు నడుపుతున్నారా? లేదా సర్కస్ నడుపుతున్నరా? అని హరీశ్ రావు మండిపడ్డారు. జనవరి 28వ తేదీ నాటికి తాత్కాలిక ఒప్పందం 66:34 నిష్పత్తిని కూడా దాటి ఇప్పటికే 664 టిఎంసిలను ఎపి వాడుకున్నదని, వెంటనే బోర్డు మీటింగ్‌ను ఏర్పాటు చేసి, ఎపి పాల్పడుతున్న నీటి దోపిడిని ఆపాలని తెలంగాణ నీటిపారుదల శాఖ లేఖ రాసిందని హరీశ్‌రావు వివరించారు.

ఇఎన్‌సి రిటైర్డ్ అయిన వారం రోజుల వరకు ఆ పోస్టులో ఇతరులను నియమించలేదన్నారు. ఇండెంట్లు, బోర్డు అనుమతులు లేవని, ఎపి ఇష్టా రాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతుందని ఆరోపించారు. ఈ ఏడాది కృష్ణా నీటి వాడకం 20 శాతం కూడా దాటలేదని, ముఖ్యమంత్రి వైఫ్యల్యానికి ఇదే నిదర్శన మన్నారు. 664 టిఎంసిలను ఎపి ప్రభుత్వం తీసుకుపోయిందని తెలంగాణ ఇఎన్‌సి చెబుతుంటే, కెఆర్‌ఎంబి మాత్రం 555 టిఎంసిలే తీసుకుపోయిందని ప్రస్తావించిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చేతిలోనే కెఆర్ ఎంబి ఉన్నదని, తెలంగాణకు అన్యాయం జరిగినప్పటికీ బిజెపి మౌనంగా ఉందన్నారు. ఎపి ప్రభుత్వం అడ్డగోలుగా నీటిని తరలిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని, బిజెపి, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతును పిసుకుతారా? అని హరీశ్‌రావు మండిపడ్డారు.

## సమ్మెకు టిజెఎస్ మద్దతు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను, చట్టాలను బలహీన పరుస్తూ, కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.కోదండరామ్ అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. కార్మికుల హక్కు లు, ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఈ లేబర్ కోడ్లను తీసుకొచ్చినట్టుగా భావిస్తున్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటంలో తెలంగాణ జన సమితి క్రియాశీలకంగా పాల్గొంటుందన్నారు. దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కీలక రంగాల్లో కార్పొరేట్ ఆధిపత్యాన్ని పెంచే విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ జన సమితి తమ అనుబంధ సంఘాలతో కలిసి నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.



జాతీయ సార్వత్రిక సమ్మెకు

## ఆటో, మోటార్ డ్రైవర్స్ యూనియన్ మద్దతు

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ వెంకటేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, దేశ వ్యతిరేక విధానాల అమలును రద్దు చేయాలని, కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మెకు ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జెఎసి పూర్తి మద్దతు తెలుపుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ ఈ సమ్మెలో పాల్గొని రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల నడ్డి విరిచి, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకు, కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు నూతన మోటారు వాహన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. నూతన మోటారు వాహన చట్టం విధానాల ద్వారా చిన్న పాటి ప్రమాదాలకు కూడా డ్రైవర్లకు విధించే శిక్షను అనేక రెట్లు పెంచుతుందని, ఈఎంవి చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆర్టిఎ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వేదిస్తారని, కాబట్టి నూతన వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి కో కన్వీనర్లు పి. యాదగిరి (టిఎన్‌టియుసి), సత్తి రెడ్డి (టిఎడిఎస్), అమానుల్లా ఖాన్ (ఐఎల్‌డబ్ల్యూఎఫ్), ఏంఎ. సలీమ్ (తెలంగాణ జాగృతి), ఎఐటియుసి ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, నరసింహ, శ్రీనివాస్, కొంరెల్లి బాబు, ఏం. కృష్ణ, తిరుమలేశా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అభ్యర్థి ఆత్మహత్యను నిరసిస్తూ

## డిజిపి కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికల వేళ చోటుచేసుకున్న బిజెపి అభ్యర్థి మృతి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. మక్తల్ 6వ వార్డు బిజెపి అభ్యర్థి మహదేవప్ప మృతిపై ఆ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ నాయకులు చేసిన హత్యేనంటూ ఆరోపిస్తూ బిజెపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు న్యాయం చేయాలంటూ డిజిపి కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన బిజెపి కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య జరిగిన పెనుగులాటలో ఖైరతాబాద్ డిసిపి శిల్పవల్లి ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఆందోళనకారులను నిలువరించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని బిజెపి స్పష్టం చేసింది. పలువురు బిజెపి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండా కార్తీక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, బిజెపి నేతలు రవినాయక్, గణేష్ కుండే, గంధ మల్ల ఆనంద్ గౌడ్, ఉమామహేంద్రలతో పాటు వందకుపైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. తోపులాటలో నలుగురికి గాయాలయ్యాయి.

**ఫిర్యాదు మేరకు కేసు నమోదు: డిజిపి**

బిజెపి అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని డిజిపి శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏమైనా అనుమానాలు ఉంటే, కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి కలిసాయి!

కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు సర్దుబాట్లు చేసుకున్నాయని కల్వకుంట్ల కవిత ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి కలిశాయని, కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు సర్దుబాట్లు చేసుకున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఒవైసి బ్రదర్స్ పొద్దు తిరుగుడు పువ్వులని, వారు అధికారం ఎక్కడుంటే అక్కడే ఉంటారని ఎద్దేవా చేశారు. గుంపుమేస్త్రీ, గుంటనక్క స్నేహం కారణంగా సిద్ధిపేట్‌కు మాత్రమే పనుల మంజూరు జరుగుతున్నాయని, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ఏ ప్రభుత్వంలోనైనా ఆ గుంటనక్కకే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ ఓవైసి బ్రదర్స్ అధికారం చుట్టు తిరిగే సన్ ఫ్లవర్స్ లాంటివారని, తెలంగాణ ఉద్యమ సమయంలో వారు రాయల తెలంగాణ అని తెలంగాణను వ్యతిరేకించారన్నారు. ఓల్డ్ సిటీలో అసలు అభివృద్ధే లేదని, ఒవైసి సోదరులు ఓల్డ్ సిటీలో ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తున్నప్పటికీ సిఎం పట్టించుకోవడం లేదని, లేబర్ కోడ్, ఉపాధి హామీ అంశాలపై సిఎం స్పందించాలన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు తాము సంపూర్ణమద్దతునిస్తున్నామని ప్రకటించారు. ఈ నెల 12న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిస్తే, పెద్ద బూతల వర్షం ముగిసినట్టుగా అనిపించిందని,ఈ ఎన్నికల ప్రచారంలో ఎక్కడ కూడా ప్రజల సమస్యలపైన మాట్లాడలేదని ఆరోపించారు. రోడ్లపైన, డ్రైనేజీలు చెత్తతో గుట్టలు గుట్టలుగా పేరుకపోయాయని , వీటిని ఎంఎల్‌ఎలు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యక్తులు పరస్పరం తిట్టడానికే మున్సిపల్ ఎన్నికలు పరిమితమయ్యాయన్నారు. సింహం గుర్తుపైన పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను గెలిపించాలని కవిత విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రెవెన్యూ డిఫ్‌షిట్ రూ 9 వేల కోట్లుగా ఉందని, సంపద సృష్టి లేదని, అప్పులు మాత్రం 122 శాతం ఎక్కువగా ఉన్నదని, రానున్న బడ్జెట్‌లో బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు నిధులను కేటాయించాలని, 1.89 లక్షల ఉద్యోగాల భర్తీకి బడ్జెట్ లో ప్రొవిజన్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: శంషాబాద్ సర్కిల్-18
టెండర్ నోటీసు
Tender Notice NIT No. 02/EEC-18/SHBD/GHMC/2025-26, తేది: 10.02.2026
**పని పేరు:** 02 పనుల కొరకు, జిహెచ్ఎంసి, ఎస్‌హెచ్‌బిడి, శంషాబాద్ సర్కిల్-18, శంషాబాద్ వార్డులోని శంషాబాద్ జోనల్ ఆఫీస్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ ఏరియాలో గదుల నిర్మాణం........ జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్ లోని శంషాబాద్ జోనల్ ఆఫీస్ కార్యాలయ నిర్వహణ మరియు మరమ్మతులు. **అంచనా విలువ :** రూ.53.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 18.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్, సర్కిల్-18, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15183-PP/CL/ADVT/1/2025-26, Date: 10-02-2026



## పల్లె గోపాల్ రెడ్డికి సిపిఐ నివాళులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో పల్లె గోపాల్ రెడ్డి అకస్మిక మరణంపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవసాయ క్షేత్రంలో గోపాల్ రెడ్డి పార్థివ దేహంపై సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోపాల్ రెడ్డి గ్రామ సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేసేవారని, ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కురిమిద్దె శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చిలివేరు అంజయ్య, పట్టణ కార్యదర్శి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, పట్టణ సిపిఐ సహాయ కార్యదర్శులు సింగ పంగ మల్లయ్య పాల్గొన్నారు.

## మార్చి నాటికి లక్ష గృహ ప్రవేశాలు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి విపి గౌతమ్



**ప్రజాపక్షం/చిట్యాల:** మార్చి నెలాఖరు వరకు రాష్ట్రంలో 1 లక్ష ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయించి గృహ ప్రవేశాలను గావిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి విపి గౌతమ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేసిన రూ. 5 లక్షల వ్యయం లోపే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. స్థానిక మేస్త్రీల ద్వారా సాధ్యమైనంతమేర నిర్మాణ ఖర్చు తగ్గించి ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలని స్థానిక సర్పంచ్ కాటం వెంకటేశంకు సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మొత్తంతో పాటుగా ఉపాధి హామీ కింద మంజూరైన ఇండ్ల వివరాలను ఆయ అడిగి తెలుసుకున్నారు. స్లాబ్, రైప్ స్థాయికి వచ్చిన వెంటనే వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేయించాలని అధికారులకు గౌతమ్ సూచించారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వారి వెంట జిల్లా పిడి రాజ్‌కుమార్, ఎంపిడివో జయలక్ష్మి , ఏఈ ప్రీతి, సర్పంచ్ కాటం వెంకటేశం తదితరులున్నారు.

## నిష్పక్షపాతంగా మున్సిపల్ ఎన్నికలు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీ 48 వార్డుల్లో 144 పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ ఆఫీసర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో సమన్వయంతో పోలింగ్ ఎవరితోనూ వాగ్వివాదానికి దిగొద్దని ఆయన హితవు చేశా రు. ఎవరైనా ఏమైనా సృష్టించడానికి యత్నిస్తే చట్టపర చర్యలు తీసుకునేందుకు పోలీస్ యంత్రాంగం ఉంటుందని ఆయన అన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు 93,020 ఓటర్లకు 144 పోలింగ్ కేంద్రాలు, పీవోలు 144, ఏపీవోలు 144, అదర్ పోలింగ్ ఆఫీసర్లు 432 మంది, రిజర్వ్‌లో 58 మందిని నియమించామని కమీషనర్ జి.శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ, వంశీధర్, మాస్టర్ ట్రైనర్స్ బాలు, కోటయ్యలు ఉన్నారు.

## ఎన్నికల బందోబస్తు విధుల్లో సిబ్బంది అప్రమత్తం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బంది బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు విధుల నిర్వహణపై పోలీసు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలి, అనుమతి లేని వ్యక్తులను ఓటరు కాని వారిని పరిసరాల్లో రానివ్వొద్దు, 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తెస్తున్నారా అనేదానిపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్‌బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు, ఐఏఎస్, అదనపు కలెక్టర్ భాస్కర రావు ఐఏఎస్ మరియు భువనగిరి ఆర్డీఓలతో కలిసి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ రామ కృష్ణ మరియు ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ (ఎఫ్ఎల్‌సి) ఆర్‌బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల 2026 పోస్టర్లను విడుదల చేశారు.

## సూర్యాపేట జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల ముగుస్తుందని తెలిపారు. ఈనెల 11న ఎన్నికల జరుగనున్న సందర్భంగా పోలింగ్ బూతుల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చే సమయంలో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి అనగా ఓటర్ కార్డు, ఫోటోతో కూడిన పోస్టు ఆఫీసు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాసుపోర్టుతో జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు అలాగే అధికారిక గుర్తింపు కార్డులు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని సూచించారు. ఓటర్లు ఓటు హక్కును నూరు శాతం వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పాటును అందించాలన్నారు. జిల్లాలోని 5 మున్సిపాలిటిల్లో 141 వార్డుల్లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 446 పోలింగ్ అధికారులు, 446 ఏపిఓ, 1340 ఓపిఓలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సజావు నిర్వహణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు నియమించామన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు 10 ఎస్ఎస్‌టి, 15 ఎఫ్ఎస్‌టి, 7 వివిటి, ఏటి 7 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీదారుల వ్యయ నియంత్రణకు 5గురు ఏఇఓలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. 55 మంది మైక్రోఅబ్జర్వార్లను నియమించినట్లు అన్నారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుకు 46 బస్సులను సిద్ధం చేసినట్లు, పోలీసు ఎస్కార్టుతో బందోబస్తుకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు జనరల్ అబ్జర్వర్ పాండదాస్‌తో కలిసి ఎస్‌వి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వీరి వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ భద్రత

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్‌పి శరత్‌చంద్రపవార్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల డీఆర్‌సీ పోలీస్ అధికారుల, సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని మున్సిపల్ ఎన్నికల భద్రత ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో చట్టవ్యవస్థ పరిరక్షణే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని, ఉల్లంఘించిన వారిపై ఎలాంటి మినహాయిపు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగేలా పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అనుమానస్పద వ్యక్తులు, గుంపులపై కఠిన నిఘా పెట్టాలని, అక్రమ మద్యం, నగదు, ఇతర ప్రలోబాలకు సంబంధించిన చర్యలను అడ్డుకునేందుక ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారిలో విశ్వాసం కలిగించే విధంగా విదులు నిర్వహించాలన్నారు. ఎలాంటి చిన్న సంఘటన జరిగినా ఆలస్యం చేయకుండా వెంటనే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.రమేష్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, పీఎన్‌డీ.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో అత్యుత్తమ ఓటింగ్ శాతం నమోదుకు కృషి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** నేడు జిల్లాలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఓటింగ్ శాతం నమోదుకు ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు కోరారు. పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా పోలింగ్ సామాగ్రి పంపిణీ, ఎన్నికల అధికారుల కేటాయింపు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి పోలింగ్ సమయంలో అనుసరించాల్సిన విధులను ఆయన అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఆరు మున్సిపాలిటీలలో ఎలక్షన్ ప్రక్రియ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. దాదాపు 2000 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. గ్రామాలలో 100 శాతం ఓటింగ్ నమోదు దిశగా ఓటింగ్లో పాల్గొంటున్నారని పట్టణాలలో ఓటింగ్ శాతం నమోదు తక్కువగా ఉంటుందని నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఉ గం 7 నుంచి సా.5 గంటల వరకు ఓటింగ్ వేయవచ్చని వెల్లడించారు. ఓటింగ్ వేయడానికి వచ్చిన ఓటర్లకు సహాయం అందించడానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోకూడదని సూచించారు. ప్రజాస్వామ్యయుతంగా ఓటర్లు స్వేచ్ఛగా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోచంపల్లి మున్సిపాలిటీలో 13 వార్డులకు గాను 26 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోచంపల్లి మున్సిపాలిటీలో పురుషులు 7799 మంది, స్త్రీలు 8028 మంది మొత్తం 15827 ఓటర్లు ఓట్లు వేయనున్నట్లు తెలిపారు. పిఓ 26, ఏపిఓ 26, ఓపిఓస్ 52, మొత్తం104. అసిస్టెంట్ సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, రాపర్తి భాస్కర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఆయన వెంట ఉన్నారు.



## మత్తుకు బానిసలైతే జీవితం అంధకారం

మాదకద్రవ్యాల చట్టాలు అతి కఠినం: వి. మాధవిలత

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** విద్యార్థులు మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వి. మాధవిలత పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (యాదాద్రి భువనగిరి), జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, యాదాద్రి బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్య నిషేధ చట్టాలు చెడు ప్రభావాలు' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు శూన్యమవుతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిషేధ చట్టం (ఎన్‌డిపిఎస్ యాక్ట్) దేశంలో అత్యంత పగడ్బందీగా అమలు అవుతోందని, ఇందులో ప్రతి నేరం తీవ్రమైనదిగా పరిగణించబడుతుందని తెలిపారు. ఎక్సైజ్ ఎస్పీ విష్ణుమూర్తి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ మత్తు పదార్థాల వాడకం సమాజంలో చాపకింద నీరులా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. .బార్ అసోసియేషన్ యాదాద్రి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీహరి, పెంట రమేష్, మీడియేషన్ న్యాయవాది యం. రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అప్రమత్తంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. చెడు దారి పడితే తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయడమే కాకుండా భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని హితవు పలికారు.

డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొమ్మ వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన బాధితులందరికీ తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అవసరమైన వారు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులందరితో న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు రాధాకృష్ణ, దీపిక, వేణుకుమార్, ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి ఉపేందర్, లెక్చరర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో రూ. 4.50 లక్షలు చోరీ



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని చౌడంపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు తో పాటు బంగారంను దొంగతనం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌడంపల్లి గ్రామానికి చెందిన బొల్లు వెంకటరెడ్డి తన కుమారుని పెళ్లి ఖర్చులకై రూ.4.50 లక్షల నగదు ఇంట్లోని బీరువాలో పెట్టి కుటుంబ సభ్యులతో తాళం వేసి పని మీద బయటకు వెళ్లి,తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి చూడగా ఇంటి బయట మెయిన్ డోర్ తాళం ని ఇనుప రాడ్డు తో విరగొట్టి ఇంట్లోనే బీరువాలో గల నాలుగు లక్షల 50 వేల రూపాయలు, రెండు తులాల బంగారు నల్లపూసల గొలుసును గుర్తు తెలియని దొంగలు దొంగలించుకుని వెళ్ళినట్లు పోలీసులు తెలిపారు.భాధితుడు బొల్లు వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్ పల్లి ఎస్ ఇ విష్ణు మూర్తి తెలిపారు.దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని సీఐ కే.నాగరాజు,ఎస్ఐ విష్ణు మూర్తి లు పరిశీలించి క్లూస్ టీం తో ఆధారాలను సేకరిస్తున్నారు.

## ఎన్నికల సన్నాహాల పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో నేడు జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లను సమీంచేందుకు రాష్ట్ర పరిశీలకులు రమేష్ డీఆర్సీ కేంద్రాన్ని సందర్శించారు.ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు,ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను వారు పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. పోలింగ్ సిబ్బంది సమన్వయం,స్ట్రాంగ్ రూమ్ భద్రత,లాజిస్టిక్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత ఆయన భోజన ఏర్పాట్లను పరిశీలించి స్వయంగా ఏర్పాటను పరిశీలించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.ఎన్నికలు సజావుగా జరిగేలా పూర్తి స్థాయి సన్నద్ధతతో పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నల్లగొండ జిల్లాలో ఒక కార్పొరేషన్ ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు

473 పోలింగ్ కేంద్రాలలో 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు

ఎన్నికల నిర్వహణకు 2,855 మంది సిబ్బంది

హాలియాలో10 వ వార్డు ఎన్నిక ఏక్రగీవం మిగతా 161 వార్డుల్లో 649 మంది అభ్యర్థుల పోటీ

సమస్యాత్మకు 60 పోలింగ్ కేంద్రాలు






**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో నేటి ఉదయం నుంచి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుంది.జిల్లాలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మిర్యాలగూడ, నందికొండ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి.ఈఎన్నికలో మొత్తం 161 వార్డులకు గాను 649 మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ రాజకీయ భవితవ్యాన్ని ఓటర్ల చేతిలో ఉంచారు.ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది.అభ్యర్థుల వారీగా చూస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి 158 మంది,బిఆర్ఎస్ నుంచి 152 మంది, బీజేపీ నుంచి 131 మంది,సీపీఎం నుంచి 10 మంది, సీపీఐ నుంచి ఒకరు,జనసేన నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.అదనంగా స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు.ఇదిలా ఉండగా హాలియా మున్సిపాలిటీలో పద వ వార్డు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషంగా మారింది.161 వార్డులకు సంబంధించి 473 పోలింగ్ కేంద్రాలలో 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొనున్నారు.ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు, ఇప్పటికే ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు చీటీలను పంపిణీ చేశారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడంతోపాటు,ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగింది.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను మొత్తం 475 పోలింగ్ కేంద్రాలలో 20 రిజర్వ్ కలుపుకొని పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేయడం జరిగింది. 571 మంది పీవోలు, 571 మంది ఏపీవోలు,1713 మంది ఓపిఓలు మొత్తం 2855 మంది సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ లో పోలింగ్ విధులను కేటాయించారు.గత మున్సిపల్ ఎన్నికల్లో 79.5 ఓట్లు పోల్ కాగా,ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో 89 ఓట్ల పోలయ్యాయని, పోలింగ్ ను పెంచేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు.




**పోలింగ్ సామగ్రి పంపిణీ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఏర్పాటుచేసిన మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్ తో పాటు,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సును, ఇతర పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 60 పోలింగ్ కేంద్రాలను సమస్యత్మకు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను దృష్టిలో ఉంచుకొని 400 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ,ప్రస్తుతం పరిస్థితి తమ కంట్రోల్ లో ఉన్నట్లు తెలిపారు.ఎన్నికల సందర్భంగా జిల్లాలో సోమవారం నాలుగన్నర కేజీల సిల్వర్ ను, 120 లీటర్ల ఆల్కహాల్ ను సీజ్ చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు.స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఇతర అధికారులు ఉన్నారు .

# అధికార, విపక్షాల మధ్య తొలగిన ప్రతిష్టంభన

### లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభం



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు మంగళవారం మధ్యాహ్నం తెరపడింది. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని వివిధ అంశాలపై మాట్లాడేందుకు అనుమతించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో గత నాలుగైదు రోజులుగా సభ కార్యకలాపాలు కొనసాగలేదు. కాగా, మంగళవారం మధ్యాహ్నానికి రెండుమార్లు సభ వాయిదా పడిన తరువాత తిరిగి 2 గంటలకు ప్రారంభం కాగానే స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ టెన్నేటి కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్‌ను చర్చను ప్రారంభించమని కోరారు. తిరువనంతపురం ఎంపి చర్చ ప్రారంభించారు. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్‌గా తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు ఒక తీర్మానాన్ని తీసుకురావాలని నోటీసు సమర్పించిన వెంటనే ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈనెల 2వ తేదీ నుంచి లోక్‌సభలో అల్లకల్లోల దృశ్యాలు, పదేపదే అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక సిపిఐ(ఎం) సభ్యుడు మిగిలిన బడ్జెట్ సమావేశాల వరకు సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే అసహ్యకరమైన దృశ్యాలు తలెత్తాయని భావించిన బిర్లా, గత వారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానం ఇవ్వాల్సి ఉండగా ప్రధాని నరేంద్ర మోదీ సభకు హాజరు కావద్దని అభ్యర్థించారు. కాంగ్రెస్ సభ్యులు అసహ్యకరమైన దృశ్యాలను సృష్టించగలరని బిర్లా చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన మరింత తీవ్రతరం అయింది. ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం సభ సమావేశం కాగానే ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ తమను మాట్లాడనీయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)కి చెందిన ఇక్రా చౌదరి ప్రశ్న అడిగారు, కానీ సంబంధిత మంత్రి సమాధానం గందరగోళంలో కొట్టుకుపోయింది. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. ఎస్‌పి, తృణమూల్ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష ఎంపిలు తమ సీట్ల వద్ద నిలబడి నిరసన తెలిపారు. స్పీకర్ స్థానంలో ఉన్న మోహన్ మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. అయితే సాధారణంగా, ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తారు. మొదటి వాయిదా తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే, ప్రతిపక్షాల నినాదాల మధ్య మంత్రులు, సభ్యులు పత్రాలు మరియు స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రవేశపెట్టారు. కార్యక్రమాలకు అధ్యక్షత వహిస్తున్న పి.సి. మోహన్, ప్రతిపక్ష సభ్యులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు, కానీ ఫలించలేదు. ఇతర ప్రతిపక్ష ఎంపిలు మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, బడ్జెట్ పై చర్చను ప్రారంభించడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజియు అన్నారు. కేంద్ర బడ్జెట్ పై చర్చ ప్రారంభమయ్యే ముందు కొన్ని అంశాలను లేవనెత్తాలని కోరుతూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలు తీవ్రతరం చేయడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

# ఆ పుస్తకం అందుబాటులోనే ఉంది

- నరవణే డిసెంబర్ 2023 సోషల్ మీడియా పోస్ట్‌ను ఉటంకిస్తూ
- రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- మీడియా ముందు చదివి వినిపించిన ప్రతిపక్షనేత

**న్యూఢిల్లీ :** ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే 'జ్ఞాపకాల పుస్తకం' అందుబాటులో ఉందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. నరవణే డిసెంబర్ 2023 సోషల్ మీడియా పోస్ట్‌ను ఉటంకిస్తూ ఈ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని ప్రచురణకర్త పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చేసిన ప్రకటనను ఖండించారు. పెంగ్విన్ గురించి మాజీ ఆర్మీ చీఫ్ మాటను తాను నమ్ముతున్నానన్నారు. మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'హలో ఫ్రెండ్స్. నా పుస్తకం ఇప్పుడు అందుబాటులో ఉంది. లింక్‌ను అనుసరించండి. సంతోషంగా చదవండి. జై హింద్' అని నరవణే సోషల్ మీడియా పోస్ట్‌ను చదివారు. 'ఇప్పుడు ఇద్దరూ నిజం చెబుతున్నారని అనుకోవడం సాధ్యం కాదు. నరవణె కానీ, పెంగ్విన్ ఇండియా కానీ ఇద్దరిలో ఒకరు అబద్ధం చెప్పి ఉండాలి. పెంగ్విన్ సంస్థ పుస్తకం ప్రచురించలేదంటోంది. కానీ ఆ పుస్తకం అమెజాన్‌లో అందుబాటులో ఉంది. 2023లో




నరవణే నా పుస్తకం కొనండి అని ట్వీట్ చేశారు. నేను పెంగ్విన్ కంటే నరవణె మాటలనే నమ్ముతా. ఆయన పుస్తకంలో ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి అసౌకర్యంగా ఉండే అంశాలు ఉండవచ్చని అనుకుంటున్నా. పెంగ్విన్ కానీ, మాజీ ఆర్మీ చీఫ్ కానీ ఇద్దరి ఎవరు నిజం చెబుతున్నారనే విషయాన్ని ప్రజలే నిర్ణయించుకోవాలి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసన సందర్భంగా పార్లమెంటు మకర్ ద్వారం వద్ద 'నరేంద్ర లొంగుబాటు' అని రాసి ఉన్న పోస్టర్‌ను చూపిస్తూ, ఇది జరిగిందని, దీని కారణంగా ఇండో–యుఎస్ వాణిజ్య ఒప్పందం జరిగిందని గాంధీ అన్నారు. పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా (పిఆర్‌హెచ్‌ఐ) మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే జ్ఞాపకాల పుస్తకం ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీకి ప్రత్యేక ప్రచురణ హక్కులను కలిగి ఉందని పేర్కొంది. అనధికార కాపీలు చెలామణిలో ఉన్నాయనే నివేదికల నేపథ్యంలో ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని స్పష్టం చేసింది. డిజిటల్, ఇతర ఫార్మాట్లలో మాన్యుస్క్రిప్ట్ అక్రమ ప్రసరణపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఈ స్పష్టత వచ్చింది. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, పుస్తకం ఏ కాపీలు ప్రింట్ లేదా డిజిటల్ రూపంలో ప్రజలకు విడుదల చేయలేదని ప్రచురణ సంస్థ స్పష్టం చేసింది.

# జాతీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు

- ఇండో-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ధ్వజం




**న్యూఢిల్లీ :** ఇండోఅమెరికా మధ్యంతర జాతీయ వాణిజ్య ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక వాణిజ్య ప్రయోజనాలను త్యాగం చేస్తున్నదని, మోదీ ప్రభుత్వ ద్రోహాన్ని అది బట్టబయలు చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని కాంగ్రెస్ చీఫ్ 'ట్రాప్డ్ సరెండర్' గా ఆరోపిస్తూ మంగళవారం తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందం ఫైన్ ప్రింట్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ జాతీయ ప్రయోజనాలను ఏవిధంగా తాకట్టు పెడుతున్నారనే విషయాన్ని బహిర్గతం చేస్తున్నదని ఆయన విమర్శించారు. ట్రాప్ డీల్ నిజం ఇప్పుడిప్పుడే బయటపడుతున్నదని, ఈ ఒప్పందానికి నాలుగు కీలక అభ్యంతరాలను మోదీ జత చేశారు. రష్యా చమురు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అంశాన్ని ఉటంకిస్తూ మోదీ మాట్లాడారు. ఇండోయుఎస్ ఉమ్మడి ప్రకటన రష్యన్ చమురుపై ఏమీ చెప్పలేదని మాకు చెప్పారు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ చేశారు. ఇప్పుడు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా 'రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలు చేయడానికి భారతదేశం నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసింది'. భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించింది. ఎందుకు? అని ఖర్గే ప్రశ్నించారు. ప్రత్యక్ష లేదా పరోక్ష చమురు దిగుమతి కోసం భారతదేశాన్ని అమెరికా పర్యవేక్షణలో ఉంచే కార్యనిర్వాహక ఆదేశాన్ని కాంగ్రెస్ ఇప్పటికే బయటపెట్టిందని చెప్పారు. 'భారతదేశ రైతులను వెన్నుపోటు పొడవడమే ఈ చర్య' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా ఒక ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా విదేశీ వస్తువులకు పూర్తిగా తెరిచిఉంచిందని ఆయన ధ్వజమెత్తారు. 'భారతదేశానికి ఎర్ర జొన్నల దిగుమతుల ప్రయోజనం గురించి ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావించబడింది. కానీ పశుగ్రాసానికి సంబంధించిన ఆ ప్రయోజనం ఇప్పుడు 2026 ఫిబ్రవరి 9నాటి వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో చాలా రహస్యంగా అదృశ్యం అయ్యింది' అని ఖర్గే తెలిపారు. కేంద్రప్రభుత్వం గోమాత, పాడి ఆవులను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. భారతీయ పశువులు జన్యుపరంగా మార్పుచేయబడిన అమెరికన్ ఫీడ్‌ను తీసుకుంటే , అది మన పశువుల జాతిని, పాలను మారుస్తుందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, బిజెపి చేస్తున్న ఈ కుతంత్రాల మూలంగా 2 కోట్ల మంది పాడి రైతులు దాని పర్యవసానాలను అనుభవిస్తారని మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇండో అమెరికా మధ్యంతర జాతీయ ఒప్పందం దుస్తుల రంగాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. తిరుపూర్, సూరత్ వంటి వస్త్ర కేంద్రాలు 18శాతం పన్నులతో సంకెళ్లతో బందీ చేయగా, బంగ్లాదేశ్ సున్నాశాతం వేగంతో పెరుగుతోందన్నారు. భారతీయ పత్తి, గార్మెంట్స్ రంగాలకు రెండింతల నిరాశను ఈ ఒప్పందం మిగులుస్తోందన్నారు.




### రాబోయే వారాల్లో భారత్–అమెరికా

# మధ్యంతర ఒప్పందం ఖరారు

**న్యూయార్క్/వాషింగ్టన్:** రాబోయే వారాల్లో భారత్–అమెరికా దేశాలు తాత్కాలిక (మధ్యంతర) వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేస్తాయని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. ఇరు దేశాలకూ పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేసే ఉద్దేశంతో త్వరలో ఈ మధ్యంతర ఒప్పందాన్ని ఖరారు చేస్తారు. సేవలు, పెట్టుబడి, శ్రమ, ప్రభుత్వ సేకరణలు వంటివి సహా ఇంకా మిగిలి ఉన్న సమస్యలను కూడా పరిష్కరించుకునేందుకు రెండు దేశాలు సంప్రదింపులను కొనసాగిస్తాయి. తాత్కాలిక ఒప్పందంపై ఒక సంయుక్త ప్రకటన చేసిన కొద్దిరోజులకు భారత్–అమెరికా మధ్య చరిత్రాత్మకమైన మధ్యంతర ఒప్పంద ప్రకటన గురించి వైట్‌హౌస్ ఒక వాస్తవ పత్రాన్ని విడుదల చేసింది. ఈ పత్రంలో ఇటీవలి ఒప్పందానికి సంబంధించిన కీలకమైన నిబంధనలను వెల్లడించింది. అమెరికాకు చెందిన అన్ని పారిశ్రామిక వస్తువులతోపాటు ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై విస్తారమైన స్థాయిలో టారిఫ్‌లను తొలగించడం లేదా తగ్గించేందుకు భారత్ చర్యలు తీసుకుంటుందని ఈ పత్రం వెల్లడించింది. అమెరికాలో ఉత్పత్తయిన డ్రై ఫ్రూట్స్, శుద్ధిచేసిన పండ్లు, కొన్ని ధాన్యాలు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్, ఇతర అదనపు ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని వైట్‌హౌస్ పత్రం తెలియజేసింది. అదే విధంగా 500 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులను కూడా భారత్ కొనుగోలు చేస్తుందని, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు, ఇతర ఉత్పత్తులు ఈ జాబితాలో ఉంటాయని తెలిపింది. అమెరికా ప్రజల ప్రయోజనాలు ముందుకు తీసుకువెళ్ళేందుకు, జాతీయ, ఆర్థిక భద్రత నిమిత్తం ఇతర మార్కెట్‌లను అందుబాటులోకి తెచ్చే చర్యల్లో భాగంగా అమెరికా ఎగుమతులను ట్రంప్ పెంపొందిస్తున్నారని ప్రకటన పేర్కొంది. "ప్రపంచంలో ఏ ఇతర పెద్ద ఆర్థికవ్యవస్థా కూడా విధించనంత ఎక్కువగా భారతదేశం అమెరికాపై అత్యధిక సుంకాలను విధించింది, సగటున ఈ సుంకాలు వ్యవసాయ వస్తువులపై 100 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి, కొన్ని ఆటోలపై కూడా. తన దేశీయ ఉత్పత్తులకు రక్షణ లకోసం ఆటంకాలు లేకుండా అత్యధికమైన సుంకాలు విధించిన చరిత్ర కూడా భారత్‌కు ఉంది, ఈ దిశగా అనేక అమెరికా ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి కాకుండా నిషేధించిన చరిత్ర భారత్‌కు ఉంది" అని ఈ పత్రం తెలియజేసింది. ఇటీవల ఖరారు చేసిన మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన మౌలిక నిబంధల వ్యవస్థను రాబోయే వారాల్లో రెండు దేశాలు నిక్కచ్చిగా అమలు చేస్తాయి. పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేయడంకోసం ఈ ఒప్పందాన్ని ఖరారు చే స్తాయి" అని తెలియజేసింది. భారత్ వంటి కీలకమైన వాణిజ్య భాగస్వామితో పరస్పర ప్రయోజనకరమైన, సమతుల్యమైన వాణిజ్యాన్ని కొనసాగించేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నారని ఈ ప్రకటన తెలియజేస్తోంది. బిటిఎకు ఆటంకంగా ఉన్న ఇతర సుంకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్చలు కొనసాగుతాయని తెలిపింది. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన ద్వైపాక్షిక వాణిజ్యంలో టారిఫ్‌లు లేని ఆటంకాలను భారత్ పరిష్కరిస్తుందని కూడా పత్రం తెలిపింది. రష్యా నుండి తదుపరి చమురు కొనుగోళ్ళను గణనీయంగా తగ్గించుకున్నందువల్ల భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను కూడా ట్రంప్ రద్దుచేసేందుకు ట్రంప్ అంగీకరించారని పత్రం పేర్కొంది. గడచిన శుక్రవారం ట్రంప్ భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. 140 కోట్లమంది జనాభాగల భారతదేశంలో అమెరికా ఉత్పత్తులకు మార్కెట్ ద్వారా తెరచుకున్నాయని ఆనాడు చెప్పారు. మోదీ–ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు.

# మణిపూర్‌లో మళ్లీ హింస

### ఇంఫాల్‌లో ఐదు రోజులు ఇంటర్నెట్ సేవలు బంద్



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్‌లో టంగుఖుల్ నాగా కమ్యూనిటీ సభ్యుడిపై దాడి జరిగిందనే ఆరోపణలపై మంగళవారం ఉదయం మరోసారి హింసాత్మక ఘటనలు జరిగాయి. ఈ ఘటనతో జిల్లాలో ఐదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. ఉఖ్రుల్, కామ్‌జోంగ్ జిల్లాల్లో రెండు టంగుఖుల్ నాగా సంస్థలు కుకీల కదలికను పరిమితం చేసిన మరుసటి రోజున లిటన్ సరీఖోంగ్ ప్రాంతంలో తాజా కాల్పులు, దహనం వంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. సాయుధులైన కొందరు దుండగులు పాడుబడిన ఇళ్లకు నిప్పంటించి లిటన్ సరీఖోంగ్‌పై అనేక రౌండ్ల కాల్పులు జరిగాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో భద్రతా దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయని పోలీసు అధికారి తెలిపారు. నివారణ, ముందు జాగ్రత్త చర్యగా ఉఖ్రుల్ జిల్లా రెవెన్యూ పరిధిలో బ్రాడ్‌బ్యాండ్ విపిఎన్, వ్యాస్ట్ ద్వారా సేవలు సహా ఇంటర్నెట్‌ను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని మణిపూర్ ప్రభుత్వం మంగళవారం ఆదేశించిందని ఆయన చెప్పారు. తమ నివాసాలను వదిలి పారిపోయిన స్థానికులు, ఈ ప్రాంతంలో కాల్పులు ఆపడంలో విఫలమైనందుకు భద్రతా దళాలను ఎదుర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌లో కొండ ప్రాంతాన్ని దట్టమైన పొగ చుట్టుముట్టినట్లు కనిపిస్తోంది. వందలాది మంది కుకి, టంగుఖుల్ నాగా గ్రామస్తులు, ఎక్కువగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, గత రెండు రోజులుగా లిటన్ సరీఖోంగ్, పొరుగున ఉన్న కుకి గ్రామాల నుండి కాంగ్‌పోక్పి, ఉఖ్రుల్ జిల్లాల్లోని సురక్షిత ప్రదేశాలకు పారిపోతున్నారని మరొక అధికారి తెలిపారు. 'కుకి మెజారిటీ కాంగ్‌పోక్పి జిల్లాలోని మోట్‌బంగ్, సైకుల్‌లోని కొన్ని ప్రాంతాలలో అనేక మంది గ్రామస్తులు ఆశ్రయం పొందారు అని ఆయన చెప్పారు. మణిపూర్ మంత్రి గోవిందాస్ కొంథౌజామ్ సోమవారం కనీసం 21 ఇళ్ళు కాలిపోయాయని, పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని చెప్పారు. పరిస్థితిని నియంత్రించడానికి ఆ ప్రాంతంలో అదనపు భద్రతా దళాలను మోహరించామని కూడా ఆయన చెప్పారు. కాగా, లిటన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లామ్లై చింగ్‌ఫై కుకి గ్రామంలో తమ ట్రక్కులు చెడిపోవడంతో చిక్కుకుపోయిన ఇద్దరు డ్రైవర్లను సోమవారం రక్షించినట్లు మరొక పోలీసు అధికారి తెలిపారు.

### నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ

# పూర్వ వైభవం కోల్పోయింది

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శ



**న్యూఢిల్లీ:** నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని కోల్పోయి, వెలవెలబోతోందని కాంగ్రెస్ విమర్శించింది. 1954లో అప్పటి స్పీకర్ తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా, ప్రతిపక్షాలకు ఎక్కువ సమయం కేటాయించాలని ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన ఉదంతాన్ని కాంగ్రెస్ గుర్తు చేసింది. చర్చలు చేయడం, ప్రతిపక్షాలు చెప్పింది వినడం, సయోధ్య కుదర్చడం మొదలైన వాటి ద్వారా నెహ్రూ నిర్మించిన పార్లమెంట్ వ్యవస్థ, ప్రస్తుతం తన పూర్వ వైభవాన్ని కోల్పోయిందని, మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. గత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ పెట్టారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని, ఇతర ప్రతిపక్ష నేతలను కానీ మాట్లాడనివ్వకుండా స్పీకర్ అడ్డుకున్నారని విపక్షాలు ఆరోపించాయి. అలాగే స్పీకర్ ఓం బిర్లా, మాజీ ప్రధానులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపిలను విడిచిపెట్టి, 8 మంది ఇండియా కూటమి ఎంపిలను సస్పెండ చేశారని నిరసన వ్యక్తం చేశాయి. ఇప్పుడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 1954 డిసెంబర్ 18 నాటి లోక్‌సభ చర్చల వివరాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ఆనాటి స్పీకర్ జివి మౌలాంకర్ తొలగింపు తీర్మానంపై ఎలా చర్చ జరిగిందో ఆయన వివరించారు. ఆనాటి చర్చలకు సంబంధించిన ఓ స్క్రీన్‌షాట్‌లను కూడా ఆయన జతచేశారు. '1954లో ఆనాటి లోక్‌సభ స్పీకర్ జివి మౌలాంకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీనిపై చర్చ కోసం డిప్యూటీ స్పీకర్ 2 గంటల సమయం కేటాయించారు. అప్పుడు ఆనాడి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జోక్యం చేసుకుని, 'అధ్యక్షా, ఈ ప్రత్యేక సమయంలో ప్రభుత్వం కంటే ప్రతిపక్షానికే ఎక్కువ సమయం ఇవ్వాలని నేను కోరుతున్నాను. మావైపు ఉన్న గౌరవ సభ్యులు చర్చల కోసం ఎక్కువ సమయం తీసుకోకూడదని నేను ఆశిస్తున్నాను. మేము చెప్పాల్సింది చెబుతాం కానీ, ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం దక్కాలి' అని సభను కోరారు. అప్పట్లో లోక్‌సభలో మొత్తం 489 స్థానాలు ఉండగా, అందులో కాంగ్రెస్ పార్టీకి 364 సీట్లు ఉండేవి. ఆనాడు కనీసం గుర్తించబడిన ప్రతిపక్ష నాయకుడు కూడా లేరు. కానీ నాటి ప్రధాని నెహ్రూ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించే, ప్రజాస్వామ్య దృక్పథం ఉండేది. నెహ్రూ స్వయంగా సభలో కూర్చొని, ప్రసంగిస్తూ, ఇతరులు చెప్పేది వింటూ, అందరినీ కలుపుకునిపోతూ నిర్మించిన ఆ పార్లమెంట్, నేడు తన అసలు స్వరూపాన్ని కోల్పోయి, వెలవెలబోతోంది' అని జైరామ్ రమేశ్ పోస్టు చేశారు.

# ఆలయ ఉత్సవంలో తొక్కిసలాట..



### మహిళ మృతి, పలువురికి గాయాలు

**గ్వాలియర్:** మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా దాబ్రా పట్టణంలో మంగళవారంనాడు విషాద ఘటన చోటుచేసుకుంది. నవగ్రహా ఆలయం ప్రారంభోత్సవానికి బయలుదేరిన కలశ యాత్రలో ఒక్కసారిగా తొక్కిసలాట చోటుచేసుకుని 70 ఏళ్ల మహిళ ప్రాణాలు కోల్పోయింది. మరో ఏడుగురు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఒక మైనర్ బాలిక ఉంది. గాయపడిన నలుగురిని చికిత్స కొసం గ్వాలియర్‌కు తరలించగా, మరో ముగ్గురికి దాబ్రాలో చికిత్స అందిస్తున్నారు. కలశ యాత్రలో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం దాబ్రా స్టేడియం వద్దకు పెద్దఎత్తున మహిళలు చేరుకున్నారని, కలశాల పంపిణీ జరుగుతుండగా తోపులాట చోటుచేసుకుందని గ్వాలియర్ కలెక్టర్ రుచిక చౌహాన్ తెలిపారు. ఈ ఘటనలో 70 ఏళ్ల మహిళ మృతిచెందినట్టు చెప్పారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తెచ్చామని, కలశ యాత్ర ముందుగు సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. పెద్దఎత్తున మహిళలు తోసుకురావడంతో పరిస్థితి అదుపుతప్పినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన అనంతరం కలశయాత్ర ముందుగా నిర్దేశించిన మార్గాల్లో బయలుదేరి నవగ్రహ ఆలాయనికి చేరుకున్నట్టు జిల్లా యంత్రాంగం తెలిపింది.

# కశ్మీర్‌లో రాగల 24 గంటల్లో వర్షం

### వాతావరణ శాఖ అంచనా

**శ్రీనగర్:** లోయలో మేఘావృతమైన పరిస్థితుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతో మంగళవారం కశ్మీర్‌లో ఎత్తైన ప్రాంతాలలో తాజాగా హిమపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్ రిసార్ట్‌లో వందలాది మంది పర్యాటకులు తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో ఆనందంగా ఆశ్చర్యపోయారు. రాబోయే 24 గంటల్లో తేలికపాటి నుండి మితమైన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడంతో లోయలోని మిగిలిన ప్రాంతాలలో మేఘావృతమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, సోమవారం రాత్రి శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.3 డిగ్రీల సెల్సియస్ నమోదైందని, ఇది కాలానుగుణ సగటు కంటే 3.1 డిగ్రీలు ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. ప్రసిద్ధ స్కీ రిసార్ట్ అయిన గుల్మార్గ్ కశ్మీర్లో అత్యంత శీతలమైన ప్రదేశంగా ఉందని, కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 3.4 డిగ్రీల సెల్సియస్ అని వారు తెలిపారు. ఇతర ప్రదేశాలలో, ఖాజిగుండ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 2.6 డిగ్రీలు, కోకెర్నాగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 1.3 డిగ్రీల సెల్సియస్‌గా, కుప్వారాలో కనిష్ట ఉష్ణోగ్రత సున్నా డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఎన్‌సిపి అధినేత పవార్‌కు అస్వస్థత



**పుణె:** ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత 'శరద్ పవార్' ఛాతి ఇన్ఫెక్షన్ సమస్యతో పుణే లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు, తను కోలుకుంటున్నట్లు మంగళవారం ఆస్పత్రి వైద్యులు తెలిపారు.రాజ్యసభ సభ్యుడు 'శరద్ పవార్' పుణే జిల్లా బారామతి పట్టణంలోని తన నివాసంలో సోమవారం దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతూ రూబీహాల్ క్లినిక్ ఆస్పత్రిలో చేరారు. ఫిజిషియన్, ఆస్పత్రి ట్రస్టీ డాక్టర్ సిమన్ గ్రాంట్ మాట్లాడుతూ..శరద్ పవార్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారని..ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని తెలిపారు. తను స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని..ముందు జాగ్రత్తగా పరిశీలనలో ఉంచామమని, చికిత్స కొనసాగుతుందన్నారు. శరద్ పవార్ ఆస్పత్రిలో చేరారన్న విషయం తెలియగానే పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆస్పత్రి దగ్గరకు భారీగా తరలివచ్చారు.అజిత్ పవార్ భార్య, డిప్యూటీ సిఎం సునేత్ర పవార్ తన కొడుకు పార్థ్ తో కలిసి సోమవారం ఆస్పత్రిని సందర్శించి, శరద్ పవార్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. తను త్వరగా కోలుకోవాలని కోరారు.

# మథురలో ఒకే కుటుంబంలో ఐదుగురు ఆత్మహత్య



**మథుర :** మథుర జిల్లా ఖప్పర్పూర్ గ్రామంలో ఒక దంపతులు, వారి మైనర్ పిల్లలు ఇంటి లోపల చనిపోయారని పోలీసులు తెలిపారు, ఇది సామూహిక ఆత్మహత్య అని అనుమానిస్తున్నారు. మృతుల వద్ద నుంచి ఒక ఆత్మహత్య లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కుటుంబ పెద్ద తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన వీడియోతో పాటు గోడపై రాసిన సందేశం కూడా లభ్యమైందని అధికారులు చెప్పారు. మథుర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్లోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మృతులను మనీష్ కుమార్ (35) వృత్తిరీత్యా రైతు, అతని భార్య (సుమారు 32 సంవత్సరాలు), వారి ఇద్దరు కుమార్తెలు హనీ (8), ప్రియాంశి (5), కుమారుడు ప్రతీక్ (3)గా గుర్తించారు.వారంతా తమ ఇంటిలోని ఒక గదిలో మృతులుగా లభ్యమయ్యారు, అని ఆయన తెలిపారు. ఈ ఘటన గురించి మనీష్ కుమార్ సోదరుడి ద్వారా సమాచారం అందింది. ఉదయం పిల్లలు బయటికి రావడం గమనించని సోదరుడు గోడ దాటి ఇంట్లోకి వెళ్లి తలుపు విరగదీసి చూడగా, కుటుంబ సభ్యులందరూ మృతులుగా కనిపించారని చెప్పారు. అతనితో పాటు కొంతమంది గ్రామస్తులు కూడా ఉన్నారు. మనీష్ కుమార్ రాసిన ఆత్మహత్య లేఖలో, తాను , తన భార్య స్వంతదంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, తమ మరణాలకు ఎవ్వరూ బాధ్యులు కాదని పేర్కొన్నట్లు తెలిపారు. తనను వేధిస్తున్న కొన్ని సమస్యల గురించి ఇతరులతో పంచుకోలేకపోయానని ఆ లేఖలో ఉంది.ఈ ఘటనను దురదృష్టకరమని పేర్కొన్న మథుర జిల్లా కలెక్టర్ చంద్ర ప్రకాశ్ సింగ్, సంఘటనకు ముందు మనీష్ తన మొబైల్లో వీడియో రికార్డు చేశాడని చెప్పారు. ఆ వీడియోలో తాను స్వంతంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నానని మనీష్ చెప్పినట్లు వెల్లడించారు. ఇటీవల తాను ఒక స్థలాన్ని రూ.12 లక్షలకు విక్రయించి, ఆ మొత్తాన్ని కొనుగోలుదారుడి నుంచి స్వీకరించానని కూడా వీడియోలో పేర్కొన్నరు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించాలని, ఘటనను అన్ని కోణాల్లో విచారించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

# వెనిజులా ప్రతిపక్షనేత కిడ్నాప్

**కారకస్:**వెనిజులాలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ గవర్నర్ జుయాన్ పాబ్లో గ్వానియా రాజకీయ ఖైదీగా జైలు నుండి విడుదలైన తర్వాత ఆకస్మికంగా కిడ్నాప్‌కు గురయ్యారు. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ బహుమతి గ్రహీత–2025 మచాడో దీనిపై ఎక్స్ వేదికగా స్పందిస్తూ, సివిల్ దుస్తులలో నాలుగు వాహనాలలో వచ్చిన వ్యక్తులు భారీగా ఆయుధాలు ధరించి హింసాత్మక పద్ధతిలో కిడ్నాప్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. తనకు అత్యంత సన్నిహితులలో ఒకరైన గ్వానియా జైలు నుండి విడుదలైన కొద్ది గంటలకే కిడ్నాప్‌కు గురయ్యారని, తక్షణం ఆయన ఆచూకీ కనిపెట్టాలని కోరారు. తనపై నిర్బంధాలు అమలులో ఉన్నాగానీ, దేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు. వెనిజులాలో పరిస్థితులు మారిపోయాయని, దేశాన్ని మార్చుకుందామని గ్వానియా చెప్పిన తర్వాత ఆయన కిడ్నాప్‌కు గురయ్యారు.ఆయనకోసం తీవ్ర గాలింపు కొనసాగుతోంది. గడచిన ఆదివారం వెనిజులా తాత్కాలిక ప్రభుత్వం జైలు నుండి 18 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. తర్వాత కొద్ది గంటలకే గ్వానియా కిడ్నాప్ జరిగింది. ప్రతిపక్ష నాయకురాలు మచాడో అటార్నీ పెర్కిన్ రోచా, ఇతర స్థానిక రాజకీయ నాయకులు విడుదలైనవారిలో ఉన్నారు. దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అధికారంలోకి వచ్చాక 383 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేశారు.

# స్పీకర్ పాత్ర ఏమిటి?

పార్లమెంటు దిగువ సభలో స్పీకర్ పాత్ర ఏమిటో రాజ్యాంగం సూచించింది. కానీ, ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో స్పీకర్ ప్రాధాన్యత మరోసారి తెరపైకి వచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సమష్టిగా నోటీసు ఇవ్వడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. భారత ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలకే పరిమితం కాని వ్యవస్థ. అది సంస్థలు, సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలు, వాటిని ఆచరించే వ్యక్తుల నైతిక బాధ్యతలపై ఆధారపడి ఉంటుంది. ఉభయ సభల్లో అత్యంత కీలకమైన లోక్‌సభలో, అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ మధ్య సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుంది. అయితే, స్పీకర్ ఆ బాధ్యతను విస్మరించి, ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించినప్పుడు, సభలో ఘర్షణలు అనివార్యమవుతాయి. ఇప్పుడీ లోక్‌సభ సమావేశాల్లో దృశ్యాలు ఈ వాస్తవాన్ని కళ్లకు కడుతున్నవి. ప్రతిపక్ష నేతలకు మాట్లాడే అవకాశం నిరాకరించడం, సభా నియమాలను ఎంచుకున్నవారికి మాత్రమే వర్తింపజేయడం, విపక్ష సభ్యులను తరచుగా సస్పెండ్ చేయడం వంటి ఆరోపణలు స్పీకర్‌పై ఉన్నాయి. అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో, స్పీకర్ నైతిక, రాజకీయ బాధ్యతలపై మరోసారి చర్చ మొదలైంది.

భారత రాజ్యాంగం స్పీకర్ ను ఒక 'తటస్థ అధికారి' అని స్పష్టంగా పేర్కొనకపోయినా, ఆ పదవికి సంబంధించిన సంప్రదాయాలు, పార్లమెంటరీ ఆచారాలు, బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ నుంచి మనం వారసత్వంగా పొందిన విలువలన్నీ, ఆ పదవిలోని వ్యక్తిని పక్షపాతంలేని న్యాయాధిపతిగానే ఆవిష్కరిస్తాయి. సభలో ఎవరు మాట్లాడాలి? ఎంతసేపు మాట్లాడాలి? ఏ అంశం చర్చకు రావాలి? వేటిని తిరస్కరించాలి? వంటివి స్పీకర్ నిర్ణయాలే. అందువల్ల స్పీకర్ నిర్ణయాలు న్యాయంగా, సమతుల్యంగా, పారదర్శకంగా ఉండాలి. రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చిన అధికారాలు విస్తృతమైనవే. కానీ, ఆ అధికారాలకు 'స్వీయ నియంత్రణ' కీలకం. ఇక్కడే సమస్య మొదలైంది. స్పీకర్ స్వీయ నియంత్రణ, విచక్షణ కోల్పోయారన్నది ప్రతిపక్ష పార్టీల ఆరోపణ. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్రను తగ్గించి చూపడం, లేదా అణిచివేయడం అంటే ప్రజల గొంతును నొక్కివేయడమే. ప్రతిపక్షం ఎప్పుడూ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది. తప్పులను ఎత్తిచూపుతుంది. ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదిస్తుంది. ఈ ప్రక్రియకు వేదిక కల్పించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుంది. కానీ, ఒకవేళ స్పీకర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తే, ప్రతిపక్షం నిరాశకు గురవుతుంది, సభ సజావుగా సాగదు. లోక్‌సభ ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ఓం బిర్లాపై ఉన్న ప్రధాన ఆరోపణ. దీనిని ఆషామాషీగా తీసుకోవడానికి వీల్లేదు. ఇది రాజకీయ అసంతృప్తితోపాటు రాజ్యాంగ సమస్యను ప్రస్తావిస్తుంది. ప్రతిపక్ష నేతకు సభలో ప్రత్యేక స్థానం ఉంది. ఆయనను మాట్లాడనివ్వకపోవడం అంటే, ప్రజల ఒక పెద్ద వర్గానికి ప్రాతినిధ్యం లేకుండా చేయడమే. సభలో క్రమశిక్షణను కాపాడటం స్పీకర్ బాధ్యతే. కానీ, అదే క్రమశిక్షణ పేరుతో విపక్ష సభ్యులను వరుసగా సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి హానికరం.

ఇటీవలి బడ్జెట్ సమావేశాల్లో పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష ఎంపిలు సస్పెన్షన్‌కు గురైన తీరు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. విపక్ష గొంతును మూసివేయడానికి సస్పెన్షన్ల అస్త్రాన్ని ప్రయోగించడం ప్రమాదకరం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 (సి) కింద స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు. ఇందుకు అవసరమైన 14 రోజుల గడువును, కనీసం 100 మంది సభ్యుల మద్దతు వంటి లాంఛనాలను ప్రతిపక్ష పార్టీలు పూర్తి చేశాయి. ఈ తీర్మానాన్ని లోక్‌సభలో చర్చకు, ఓటింగ్‌కు అనుమతిస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతున్నది. ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలు చిన్నవి కావు. స్పీకర్ తటస్థత కోల్పోయారా? సభలో సమాన న్యాయం జరుగుతోందా? ప్రతిపక్షానికి తగిన గౌరవం దక్కుతోందా? ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని కలవరపరుస్తున్న ప్రశ్నలు. స్పీకర్ పదవిని చేపట్టిన క్షణం నుంచి, తన పార్టీ అనుబంధాన్ని నైతికంగా పక్కన పెట్టాలి. పార్టీ సభ్యత్వం వదిలేయమని రాజ్యాంగం చెప్పకపోయినా, పార్లమెంటరీ సంప్రదాయం తటస్థుడిగా ఉండమని ఆశిస్తుంది. సభలో ప్రతి సభ్యుడు సమానమనే భావనను స్పీకర్ ఆచరణలో చూపించాలి. అలాంటి స్పీకర్ ప్రభుత్వానికి ప్రతినిధిగా మారి, అనుకూలంగా మాత్రమే నిర్ణయాలు తీసుకుంటే, సభపై నమ్మకం క్షీణిస్తుంది. ప్రజలు పార్లమెంటును ఒక అర్థరహిత వేదికగా చూస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. భారత ప్రజాస్వామ్యం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సంస్థల స్వతంత్రత, మీడియా స్వేచ్ఛ, న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్లు వంటి అంశాలు చర్చలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో, ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్లమెంటు చివరి ఆశాకిరణంగా ఉండాలి. ఆ పార్లమెంటును సజావుగా, న్యాయంగా నడిపించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంది. మరోలా చెప్పాలంటే, స్పీకర్ పదవి వ్యక్తికి మించినది. అది ఒక సంస్థ. ఆ సంస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటే, ప్రజాస్వామ్య పునాది కదిలిపోతుంది. అందువల్ల స్పీకర్ తన ప్రవర్తనను పునఃసమీక్షించుకోవాలి. ప్రభుత్వానికి న్యాయంగా ఉండటం ఒక విషయం... ప్రతిపక్షాన్ని అణచివేయడం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం స్పీకర్ ముందున్న రాజ్యాంగ కర్తవ్యం. ఓం బిర్లాపై ప్రతిపక్షం తీసుకొస్తున్న తొలగింపు తీర్మానం ఆమోదం పొందుతుందా? లేదా? అనేది లోక్‌సభలో బలాబలాలకు సంబంధించిన విషయం. కానీ, ప్రజాస్వామ్యంలో స్పీకర్ పాత్ర, అనుసరించాల్సిన తటస్థ విధానం, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు వంటి పలు అంశాలపై కీలక చర్చకు దారితీసింది.

స్పీకర్ తాను రాజ్యాంగానికి విధేయుడిగా, ప్రజాస్వామ్యానికి కాపలాదారుడిగా వ్యవహరిస్తే, సభలో ఘర్షణలు తగ్గుతాయి. లేకపోతే, ఈ వివాదం కేవలం ఒక వ్యక్తిపై కాదు, ఒక వ్యవస్థపై నిందగా మిగిలిపోతుంది. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం కీలక ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టాల్సిన అవసరం ఉంది.



## విమాన ప్రమాదం వెనుక విద్రోహం

**అజిత్ పవార్ విమాన దుర్ఘటన కేవలం ప్రమాదం అని మేము నమ్మడం లేదు. విద్రోహానికి పాల్పడినట్లు అనుమానించేందుకు అవకాశం ఉంది. అసలు పైలట్లు - సాహిల్ మదన్, యష్ - ట్రాఫిక్ కారణంగా ఆలస్యం అయ్యారని తెలిసింది. అప్పుడు సుమిత్ కపూర్, శాంభవి పాఠక్ విమానాశ్రయానికి ఎలా చేరుకున్నారు? కపూర్ కంటే పాఠక్‌కు లియర్ జెట్‌లో విమానాన్ని నడిపే అనుభవం ఎక్కువగా ఉంది. క్లిష్టమైన రన్‌వే 11ని ఆయన ఎందుకు డిమాండ్ చేశారు. ఎదురుగా ఏముందో కనిపించనప్పుడు ఆయన ఎందుకు ల్యాండ్ చేయడానికి ప్రయత్నించారు? విమానంలో అక్రమ అదనపు ఇంధన ట్యాంకులు ఉన్నాయో లేదో ధృవీకరించడానికి మునుపటి లియర్ జెట్ ల్యాండింగ్‌ల సిసిటివి ఫుటేజ్‌లను చూడాలి. విఎస్ఆర్ కంపెనీ (విమానయాన కంపెనీ) అధికారులపై నేరపూరిత హత్య కేసు నమోదు చేయాలి**

–ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంఎల్‌ఏ రోహిత్ పవార్



# బాల్యంపై సోషల్ మీడియా సర్జికల్ స్ట్రైక్!

నేటి ఆధునిక యుగంలో సాంకేతికత మానవ జీవన గమనాన్ని మార్చేసింది. కానీ, అదే సాంకేతికత నేడు మన భావి భారత పౌరులైన పిల్లల పాలిట యముడిగా మారుతోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన గుండెలను పిండేసే సంఘటనే దీనికి నిదర్శనం. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా సీరియల్స్‌కు బానిసలైన ముగ్గురు మైనర్ సోదరీమణులు, తల్లిదండ్రులతో ఏర్పడిన చిన్నపాటి ఘర్షణకే తమ నివాస భవనం తొమ్మిదో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడం సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇది కేవలం ఒక విషాద వార్త మాత్రమే కాదు; సోషల్ మీడియా కంపెనీలు తమ బ్యాంక్ బ్యాలెన్స్‌లను పెంచుకోవడానికి అమాయక పిల్లల ప్రాణాలను ఏ విధంగా బలిపీఠం ఎక్కిస్తున్నాయో చెప్పడానికి ఒక భయానక హెచ్చరిక.

**అల్గారిథమ్స్ కుట్ర.. వ్యసనంలో చిక్కుకున్న మెదడు**

సోషల్ మీడియా దిగ్గజాలు పిల్లల భద్రత కంటే వారిని నిరంతరం తమ ప్లాట్‌ఫారమ్‌లకు అతుక్కుపోయేలా చేసే 'అడిక్టివ్ అల్గారిథమ్స్' (Addictive Algorithms)కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ అల్గారిథమ్స్ పిల్లల్లో విపరీతమైన ఆందోళన (Anxiety), తమ శరీరాకృతిపై అసంతృప్తి, సామాజిక జీవితం పట్ల అసహ్యం మరియు ఆత్మహత్య ఆలోచనలను పెంపొందిస్తున్నాయి. కౌమార దశలో మెదడు నిర్మాణం, విధుల్లో వేగంగా మార్పులు వచ్చే క్రమంలో, ఈ డిజిటల్ వ్యసనం మద్యం, పొగాకు కంటే ప్రమాదకరమైన రీతిలో వారిని బానిసలుగా మార్చుకుంటోంది.

పిల్లల ఆట, చదువు, నిద్ర వంటి కనీస అవసరాలను కూడా ఈ డిజిటల్ మహమ్మారి ఆక్రమిస్తోంది. దీనివల్ల పిల్లలు వాస్తవిక ప్రపంచానికి దూరమై, డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోతున్నారు. మెదడులోని 'రివార్డ్ పాత్‌వేలను' ప్రేరేపించే ఈ అల్గారిథమ్స్ పిల్లలను మానసిక రోగులుగా మారుస్తున్నాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**టెక్ కంపెనీల కపట బుద్ధి**

గతంలో పొగాకు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను దాచిపెట్టి ఎలాగైతే కబడ్డు ఆడాయో, నేటి టెక్ కంపెనీలు కూడా అదే దారిలో నడుస్తున్నాయి. పిల్లలకు సోషల్ మీడియాను నిరాకరించడం వారి సమాచార హక్కును కాలరాయడమేనని, హానిపై ఆధారాలు బలహీనంగా ఉన్నాయని వాదించడం ఈ కంపెనీల కపటత్వానికి నిదర్శనం. బాధ్యతను పూర్తిగా తల్లిదండ్రులపైకి నెట్టేస్తూ లాభాల వేటలో పడ్డాయి.

అమెరికా కోర్టుల్లో బయటపడిన ఆధారాల ప్రకారం, తమ ప్లాట్‌ఫారమ్‌ల వల్ల బాలికలు లైంగిక హింసకు, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిసి కూడా 'మెటా' వంటి సంస్థలు మౌనంగా ఉన్నాయి. వయస్సు నిర్ధారణ (Age Verification) విషయంలో ఈ సంస్థల నిర్లక్ష్యం ఎంతలా ఉందంటే, అమెరికాలో 8–12 ఏళ్ల వయస్సున్న పిల్లల్లో 40 శాతం మంది నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వాడుతున్నారు. అంటే 13 ఏళ్ల వయో పరిమితి అనేది కేవలం కాగితాలకే పరిమితమైందని స్పష్టమవుతోంది.

ఈ ముప్పును గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం, 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. వయస్సు నిర్ధారణ బాధ్యతను పూర్తిగా కంపెనీలపైనే ఉంచింది. అమెరికా, యుకె, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా కఠిన చట్టాల దిశగా అడుగులు వేస్తున్నాయి, ఎందుకంటే గత దశాబ్దకాలంలో ఈ దేశాల్లో యువత మానసిక ఆరోగ్యం దారుణంగా క్షీణించింది.

భారతదేశంలో పరిస్థితి మరింత విషమంగా ఉంది. స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తి వేగంగా పెరుగుతోంది. ASER–2024 నివేదిక ప్రకారం, గ్రామీణ భారతంలో సైతం 16 ఏళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. మన దేశ పాలకులు యువత గురించి, 'డెమోగ్రాఫిక్ డివిడెండ్ (Youth dividend) గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, ఆ యువ సంపదను టెక్ కంపెనీల లాభాల కోసం బలి ఇవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నారు.

**కఠిన చర్యలే శరణ్యం**

టెక్ కంపెనీల తిజోరీలు నింపడానికి మన పిల్లల ప్రాణాలను బలి ఇవ్వలేం. మన విధానకర్తలు వెంటనే నిద్ర మేల్కొని ఆస్ట్రేలియా తరహాలో కఠినమైన నిషేధ చట్టాలను అమలు చేయాలి. కేవలం చట్టాలే కాకుండా, సమాజంలో కూడా అవగాహన పెరగాలి. పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియజెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విషవలయం నుండి బాల్యాన్ని రక్షించకపోతే, రేపటితరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం. మన పిల్లల ప్రాణాలు టెక్ కంపెనీల లాభాల కంటే మిన్న అని చాటిచెప్పే సమయం ఆసన్నమైంది.



**వెంకగారి భూమయ్య,**
9848559863

### వెనిజులా, క్యూబాలో

# మన్రో సిద్ధాంతంతో ట్రంప్ నూతన వలసవాదం



**బుడ్డిగ జమీందార్**
ఆల్ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యవర్గ సభ్యుడు
9849491969

1823లో అమెరికా 5వ అధ్యక్షుడు మన్రో సిద్ధాంతం ప్రకారం లాటిన్ అమెరికాకు చెందుతుంది, పశ్చిమ భూగోళంలోకి యూరపు దేశాలు వలసలకు రాకూడదు, తూర్పు భూగోళంలో అమెరికా జోక్యం చేసుకోదు. దక్షిణ అమెరికా దేశాలు అమెరికాకు చెందినవని (బ్యాక్ యార్డ్) అర్థం. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సిద్ధాంతాన్ని నిస్సిగ్గుగా అమలు చేస్తున్నాడు. ఇందులో భాగంగానే ఒక సార్వభౌమాధికార వెనిజులా దేశ అధ్యక్షుడు మదురోను నిర్దాక్షిణ్యంగా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి కిడ్నాప్ చేసి వాషింగ్టన్‌కు ఎత్తుకుపోయి జైల్లో బంధించాడు. దీని నిమిత్తం అంతకు ముందు పెద్ద డ్రామా నడిపాడు ట్రంప్. వెనిజులా మాదకద్రవ్యాల సరఫరా చేస్తుందని, మాదకద్రవ్యాల ఉగ్రవాదంపై దాడి చేస్తున్నామని అమెరికా ప్రపంచాన్ని నమ్మ ప్రయత్నం చేసింది. ఒక దేశాన్ని ఉగ్రవాద దేశంగా ముద్ర వేయటం వల్ల అమెరికా సైన్యం జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని కూల్చటానికి కాంగ్రెస్ నుంచి విస్తృత అధికారాలు లభిస్తాయి. మాదకద్రవ్యాల ఉగ్రవాద ముద్రతో ఇప్పుడు వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూల్చిన తర్వాత, తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించే దిశగా అమెరికా ఉంది. దీనికిగల సన్నాహాలను గడిచిన కొన్ని నెలల నుంచి గ్రహిస్తే అమెరికా చరిత్రలో అతిపెద్ద మిలిటరీ ఖర్చు బిల్లును 2026 సంవత్సరానికి 90,100 కోట్ల డాలర్ల బడ్జెట్టుతో ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఆమోదించింది.

లాటిన్ అమెరికాలో సరికొత్త యుద్ధాలకు ట్రంప్ కాలు దువ్వుతున్న సమయాన ఈ వ్యయ బిల్లు ఆమోదం కోసం డెమోక్రాట్లు కూడా రిపబ్లికన్లతో కల్సి ఓటు వేశారు. 2025 జులై నెలలో కేటాయించిన 15,600 కోట్ల డాలర్ల అనుబంధ సైనిక వ్యయ బిల్లును కల్పితే 2026 సంవత్సరానికి మొత్తం లక్ష 5,700 కోట్ల డాలర్లను ప్రపంచంలో యుద్ధాల్ని ప్రోత్సహించటానికి అమెరికా కేటాయించింది. 2020–2024 మధ్య అమెరికా మిలిటరీ ఆయుధ పరిశ్రమలకు 2లక్షల 40వేల కోట్ల డాలర్లు ఇచ్చింది. అందులో మొదటి 5 కంపెనీలకు 77,100 కోట్ల డాలర్లు అందించింది. (ఈ 5 కంపెనీలు లోక్‌హీడ్ మార్టిన్ 31300 కోట్ల డాలర్లు, రేత్‌రోన్ (ఆర్‌టివై) 14,500 కోట్ల డాలర్లు, బోయింగ్ 11,500 కోట్ల డాలర్లు, జనరల్ మోటార్స్ 11,600 కోట్ల డాలర్లు, నార్త్‌రోప్ గ్రూమన్ 8100 కోట్ల డాలర్లు అందుకొని ఆయుధాలు సరఫరా చేశాయి.

గత మూడునెలల నుంచి వెనుజులాపై సైనిక చర్యకు 15 వేలకు పైగా సైనికులను, డజను యుద్ధ నౌకలను, డజన్ల కొద్దీ యుద్ధ విమానాలను కరేబిక్, తూర్పు అట్లాంటిక్‌లో ట్రంప్ మోహరించాడు. ఇందుకు అవసరమగు భారీ వ్యయం ఈ డ్జెట్టు సమకూర్చుతుంది. 'ఆపరేషన్ దక్షిణ గోళం'(మనోసిద్ధాంతం) పేరిట ఎఫ్35 స్టెల్త్ ఫైటర్లను కరేబియన్ ప్రాంతానికి ట్రంప్ తరలించారు. శత్రు వైమానిక రక్షణ వ్యవస్థలను అణచివేసే ఇఎ18జి వార్‌జెట్‌లు అమెరికా దీవి పోర్టోరీకోకి చేరుకున్నాయి. 1962 క్యూబన్ క్షిపణి సంక్షోభం తర్వాత ఈ కరేబియన్ సైనిక మోహరింపు అతి పెద్దది.

ప్రారంభంలో 'వెనిజులా అధ్యక్షుడు మదురో రోజులు దగ్గర పడ్డున్నాయి' అంటూ వెనిజులా భూభాగంలోకి అమెరికా సైనిక దళాలు కాలుపెట్టకుండానే క్షిపణులు, యుద్ధవిమానాలు డ్రోన్ల సహాయంతో యుద్ధం వ్యూహం ట్రంప్ చేశాడు. ముందుగా డ్రోన్ల దాడితో 87 మంది మత్స్యకారులను చంపాడు. రెండు పెద్ద ఆయిల్ ట్యాంకర్లను వశపర్చుకొని వెనిజులాను దిగ్బంధనం చేశాడు. ప్రభుత్వ మార్పిడి తప్పదని, ప్రపంచ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా శాంతి నోబెల్‌ప్రైజ్‌ను సిఫార్సులతో వశపర్చుకున్న వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మరియా కోరీనా మచాడో ముందుగానే చెప్పిం ది. వెనిజులాలో జోక్యం కేవలం అక్కడి ప్రపంచ 20% ముడి చమురు నిల్వలపై కన్నేసి ఉంచటమే. సౌదీ అరేబియా కంటే అగ్రస్థానంలో చమురు నిల్వలు ఈ చిన్న దక్షిణ అమెరికా దేశంలో ఉండడం, ఈ దేశం అమెరికా ఆయిల్ కంపెనీల జోక్యాన్ని తగ్గించుట కారణంగా వెనిజులాపై అమెరికా చట్టవిరుద్ధ జోక్యం చేసుకొంది.

1970 దశకంలో చమురు ధరలు విపరీతంగా పెరగడంతో దానిపై వచ్చిన విదేశీ ఆదాయం దేశంలోని సంపన్నులకు మాత్రమే అనుకూలమై ధనిక, పేదల మధ్య అంతరం పెరిగింది. అటువంటి ప్రైవేటురంగ చమురు పరిశ్రమలను విప్లవ అధ్యక్షుడు ఛావెజ్ జాతీయం చేశారు. జనవరి 2005లో భూ సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా పెద్ద భూస్వాములు, ఎస్టేట్‌దారుల నుంచి సామాన్య రైతాంగం విముక్తి పొందింది. ఇదే సంవత్సరంలో 13 లాటిన్ అమెరికా దేశాలు కలిసి వాణిజ్య సమాఖ్యగా ఏర్పడి స్వల్ప ధరలకే ముడిచమురును అమ్ముకునేలా అవగాహనకు వచ్చాయి. ఆగస్టు 2008లో బ్యాంకుల జాతీయకరణ చేయడంతోపాటు రష్యాతో ఆయిల్, గ్యాస్, నేవీ, ఆర్మీ ఒడంబడికలు చేసుకున్నారు. నవంబరు 2009లో అమెరికా తన మిత్రదేశమైన కొలంబియాను వెనిజులాపై ఉసికొల్పి పరాభవం పొందింది అమెరికా. ఇవన్నీ అమెరికాకు నచ్చని అంశాలు.

వెనిజులా రాజధాని కారకాస్‌కు నార్కో కార్టెల్స్‌తో సంబంధాలున్నాయనే వాదనను వెనుజులా అధ్యక్షుడు మదురో ఎప్పటికప్పుడు తిరస్కరించుతూనే ఉన్నాడు. వాషింగ్టన్ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార ముసుగులో తన ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెనిజులాకు పొరుగున ఉన్న కొలంబియా వామపక్ష అధ్యక్షుడు గుస్తావోపెట్రో ఈ కార్టెర్ ఉనికిని తిరస్కరించారు. వెనుజులాలో చాలాకాలంగా సన్నిహితంగా ఉన్న రష్యా మాత్రం వెనుజులాకు బహిరంగంగా మద్దతునిచ్చింది. పుతిన్ వెనిజులా ప్రజలతో సంఘీభావం వ్యక్తపరిచారు. విదేశీ వత్తిడికి వ్యతిరేకంగా జాతీయ ప్రయోజనాలను, సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవటంలో వెనిజులాకు మద్దతుగా ఉంటానని ప్రకటించాడు. చైనా కూడా ప్రకటనలకే పరిమితంగా ఉంది.



'వెనిజులా చమురుపైనున్న ఇంధనహక్కులను అమెరికా తిరిగి పొందుతుంది' అని డిసెంబరు 17నాడు ట్రంప్ అన్నాడు. చట్టవిరుద్ధంగా అమెరికా చమురు హక్కులను వెనిజులా స్వాధీనం చేసుకొందని ట్రంప్ ఆరోపించాడు. వెనిజులాలోని మా చమురును స్వాధీనం చేసుకొన్నారు అంటూ, కారకాస్ (రాజధాని) దొంగలించిన చమురును తిరిగి ఇవ్వాలని, వెనిజులాను ఉగ్రవాద సంస్థగా గుర్తించినట్లు ప్రకటించాడు. అంతర్జాతీయ చట్టం ప్రకారం దేశ సహజ సంపదపై సార్వభౌమత్వాన్ని, నౌకా రవాణా స్వేచ్ఛ, స్వేచ్ఛా వాణిజ్య హక్కును వెనిజులా కల్గి ఉంటుంది. కానీ, చమురుపై అమెరికాకు నిజంగా ఆ హక్కు ఉందా? 1970 దశకంలో చమురు నిల్వలను వెనిజులా జాతీయం చేసే వరకూ, చమురు క్షేత్రాలను అమెరికా అభివృద్ధి చేసి ఆ చమురును కారుచౌకగా దోచుకొన్నాయి. ఇప్పుడు వెనిజులానే అమెరికా చమురును దోచుకొని దేశంలో టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుందని, దీనితో మాదకద్రవ్యాల్ని సరఫరా చేస్తుందని అమెరికా అబద్దాలు చెబుతుంది.

**వెనిజులా ముడిచమురు వివరాలు**

దేశ తూర్పు భాగంలో 55,000 చ॥కిలోమీటర్ల వైశాల్యంలో చమురు నిల్వలు విస్తరించి ఉన్నాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో అమెరికా కంపెనీలు వెనిజులాలో తవ్వకాలు ప్రారంభించాయి. డచ్ షెల్ సంస్థ వాయువ్య ప్రాంతంలోని జూలియా రాష్ట్రంలోని మరాకైబో సరస్సులో భారీ పెట్రోలియం నిల్వలను తొలిసారిగా కనుగొంది. చమురు వెలికితీతలో అమెరికా తన పెట్టుబడులను పెంచింది. స్టాండర్డ్ ఆయిల్ వంటి కంపెనీలు రాయితీ ఒప్పందాల కింద అభివృద్ధి చేశాయి. ఆ సమయంలో వెనిజులా ప్రపంచంలో ముఖ్యంగా అమెరికాకు ఒక కీలక చమురు సరఫరాదారునిగా నిలబెట్టింది. 1960లో ఓపెన్ దేశాలలో సభ్యత్వం తీసుకొన్న వెనిజులా చమురు వనరులను నియంత్రించటానికి ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్రోలియోస్ డి వెనుజులా సంస్థను స్థాపించింది. కొన్ని సంవత్సరాల పాటు అమెరికాకు ప్రధాన చమురు ఎగుమతిదారునిగా నిలిచింది. 1990 నుంచి 2000 ప్రారంభం వరకు రోజుకు 15 నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేసింది. 1998లో హ్యూగో ఛావెజ్ అధికారం చేపట్టిన తరువాత చమురు ఆస్తులను, విదేశీ యాజమాన్య ఆస్తులను జాతీయం చేశాడు. పిడివిఎస్ఏను పునరుద్ధరించి రాజకీయంగా చమురు దోపిడీదారుడైన అమెరికాపై దృష్టి కేంద్రీకరించాడు. దీనితో ఎగుమతులతోపాటు, పెట్టుబడులూ తగ్గాయి, ఉత్పత్తి క్షీణించింది. ఆర్థికవ్యవస్థ మాత్రం మందగించింది, కానీ అప్పనంగా దోచుకునే అమెరికా దోపిడీకి అడ్డుకట్ట వేయగల్గాడు.

**అమెరికా ఆంక్షలు :** 2005లో చమురు ఆస్తులను జాతీయం చేసినందుకు ప్రతీకారంగా తొలిసారిగా వెనిజులా చమురుపై అమెరికా ఆంక్షలు విధించింది. దీని ప్రకారం అమెరికాలోని వెనిజులా ఆస్తులు నిర్బంధానికి గురయ్యాయి. వెనిజులా వ్యక్తులుగానీ, కంపెనీలుగానీ అమెరికా బ్యాంకులతో లావాదేవీలు నడప వీలుకాలేదు. వారి ఆస్తిని అమ్మలేరు, తరలించలేరు. వెనిజులాలో వ్యాపారాలు నిర్వహించే అమెరికా కంపెనీలు, వ్యక్తులు జరిమానాకు లోనయ్యారు. నికోలస్ మదురో హయాంలో మరిన్ని ఆంక్షలు విధించింది అమెరికా. 2019 నాటికి ఆంక్షల్ని మళ్లీ కఠినతరం చేసింది. ఫలితంగా అమెరికాకు చమురు ఎగుమతులు దాదాపు ఆగిపోయాయి. వెనిజులా తన వాణిజ్యాన్ని చైనాకు మార్చింది. కొంతవరకూ మన దేశంతోనూ, క్యూబాతోనూ చేసింది. ముడిచమురు ఎగుమతుల ద్వారా ఒకప్పుడు సంపాదించిన ఆదాయంతో పోలిస్తే, కేవలం కొంతభాగాన్ని మాత్రమే వెనిజులా పొందింది. అబ్జర్వేటరీ ఆఫ్ ఎకనామిక్స్ కాంప్లెక్సిటీ (ఒఇసి) ప్రకారం, 2023 లో కేవలం 405 కోట్ల డాలర్ల విలువైన ముడిచమురును మాత్రమే ఎగుమతి చేసింది. ఇదే సంవత్సరంలో సౌది అరేబియా 18100 కోట్ల డాలర్లు, అమెరికా 12500 కోట్ల డాలర్లు, రష్యా 122 కోట్ల డాలర్లు విలువగల చమురును ఎగుమతి చేశాయి. ప్రపంచంలో అగ్రగామి నిల్వలున్న వెనిజులా ఎగుమతులు మాత్రం బహుస్వల్పం. హ్యూస్టన్‌కు చెందిన చెవ్రాన్ ఇప్పటికీ వెనిజులా తో పనిచేస్తున్న ఏకైక సంస్థగా మిగిలింది. యు.ఎస్. చమురు సంస్థ చెవ్రాన్ ఉమ్మడి ఉత్పత్తి కింద పిడివిఎస్ఎ కి ఉత్పత్తిలో కొంత శాతాన్ని వెనిజులాకు చెల్లిస్తుంది. వెనిజులా అధికారిక చమురు ఉత్పత్తిలో 5 వ శాతం ఉత్పత్తి చేస్తుంది. అమెరికాకు మధ్యవర్తి కంపెనీల ద్వారా చమురు ను చెవ్రాన్ అమ్ముతున్నది. 2022లో జో బైడెన్ ప్రత్యేక హక్కులు ఈ కంపెనీకి కల్పించాడు.చావెజ్, మదురో జాతీయం చేసిన కంపెనీల్లో ఎక్సాన్, కార్గిల్, హిల్టన్ వంటి విదేశీ కంపెనీలున్నాయి. ప్రస్తుతం వెనిజులా చమురుపై అమెరికా పట్టు సాధించటానికి తమ ఆయిల్ కంపెనీలు చమురును తోడాలని ట్రంప్ ఆదేశించాడు. 'సహజవనరులపై శాశ్వత సార్వభౌమాధికార సూత్రం (పిఎస్ఎన్ఆర్) ప్రకారం సార్వభౌమరాజ్యాలు తమ భూభాగాల్లో తమ స్వంత అభివృద్ధి కోసం సహజవనరులను కల్గి ఉంటాయని' అంతర్జాతీయ చట్టం స్పష్టంగా చెబుతుంది. 1945 తర్వాత పూర్వ యూరోపియన్ వలస రాజ్యాల నిర్మూలన సమయంలో పిఎస్ఆర్ఎన్ భావన ఉద్ఘాటించింది. 1962 లో ఐరాస దీన్ని పటిష్టపర్చింది. ఈ చట్టం ప్రకారం వెనిజులా దాని చమురును కల్గి ఉంది.

ప్రపంచ ఆధిపత్యం కోసం యుద్ధాలను ప్రోత్సహించే అమెరికా తన కార్పోరేట్ ఆయుధ కంపెనీలను కాపాడుకొంటూ, అత్యధిక లాభాలను ఆర్జించుటకోసం, సహజసంపదపై ఆజమాయిషీకై ఎక్కడోచోట ఏదో సాకుతో యుద్ధాన్ని చేస్తూనే, చేయిస్తూనే ఉంటుంది. 4 సంవత్సరాలకాలంలో ఉక్రెయిన్‌కు సుమారు 17000 కోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేయటమేగాక, గాజాపై యుద్ధాన్ని ప్రోత్సహించిన అమెరికా ఇజ్రాయిల్‌కు 2 సంవత్సరాల కాలంలో 16 బిలియన్ల డాలర్ల విలువచేసే ఆయుధసామాగ్రిని సరఫరా చేసింది. గాజాపై యుద్ధం కోసం 70శాతం ఖర్చు భరాయించిన అమెరికా పశ్చిమాసియాలో తన చమురు ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌ను తన అంగరక్షకునిగా ఉంచుకొని, ఇజ్రాయిల్‌కు 1946 నుంచి ఇప్పటివరకూ సుమారు 35,000కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించింది.

ఇలాఉండగా మదురో అపహరణ తర్వాత, మన్రో సిద్ధాంతంలో భాగంగా తాజాగా ట్రంప్ దృష్టి సోషలిస్టు క్యూబాపై పడింది. క్యూబాకు ఏ దేశమైనా చమురును సరఫరా చేస్తే, ఆ దేశంపై వాణిజ్య ఆంక్షలతో పాటు సుంకాలు పెంచుతానని ఇటీవల ట్రంప్ ప్రకటించాడు. ప్రస్తుతం క్యూబా తీవ్ర ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. రాజధాని హవానాలో రోజుకు10 నుంచి 5 గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

క్యూబా ఇంధన మనుగడకు రోజూ లక్షబ్యారెల్ల చమురు కావాలి. తను స్వంతగా 40శాతం మాత్రమే ఉత్పత్తి చేసుకోగలదు. మెక్సికో రోజుకూ 6 వేల నుంచి 12వేల బ్యారెల్లు మాత్రమే అతి కష్టం మీద పంపిస్తుంది. రష్యా, అల్జీరియాలు నామమాత్రంగా సరఫరా చేస్తున్నాయి. మరొక 10 రోజుల్లో తన దగ్గరి ఇంధన నిల్వలు అయిపోతాయని అంటున్నారు. క్యూబా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కొంది. ఇక ట్రంప్ దృష్టి వెనిజులా, క్యూబా తర్వాత నికరాగువా వైపు మళ్లుతుందంటున్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాపోరాటాలు, లాటిన్ అమెరికా సంఘీభావ ఉద్యమాలతో కొంతవరకూ ట్రంప్ ఆపరేషన్ మన్రోన్ సిద్ధాంత దూకుడుకును ఎదుర్కోగలం. నేటి ప్రగతిశీలుర తక్షణ కర్తవ్యం మన్రో సిద్ధాంతాన్ని కూకటి వేళ్లతో లాగి, ప్రపంచ వలసవాద చరిత్రను పునరావృతం గాకుండా రక్షించు కోవటమే.

## ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి: ఎస్పి



ప్రజాపక్షం/జగిత్యాల :మున్సిపల్ ఎన్నికల నిర్వాహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా కేంద్రంలోని బివిఎస్ గార్డెన్లో మంగళవారం ఎస్పి ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల పరిధిలోని 136 వార్డులకు ఎన్నికలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. 379 పోలింగ్ కేంద్రాలకు 900 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు వివరించారు. పోలింగ్ సామాగ్రిని పటిష్ట ఎస్కార్ట్తో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 45 రూట్లలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తురన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా నలుగురు డిఎస్పి లతో స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, 11 మంది సిఐ లతో కూడిన స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, ఎస్ఐలతో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు వవరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎస్పిలు రఘు చందర్, రాములు,సిఐలు కరుణాకర్, సుధాకర్, రవి, రాంనర్సింహా రెడ్డి ఉన్నారు.

## 'ఎఐ' పట్ల అప్రమత్తంగా ఉండాలి:ఎస్ఐ



ప్రజాపక్షం / చందుర్తి : విద్యార్థులు ఎఐ టెక్నాలజీ వినియోగం పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని చందుర్తి ఎస్ఐ జిల్లెల్ల రమేష్ సూచించారు.అంతర్జాతీయ సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవ కార్యక్రమం లో భాగంగా మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహణ కల్పించారు.విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సోషల్ మీడియా , ఇంటర్నెట్ కు దూరంగా ఉంటూ శ్రద్ధతో చదివి పరీక్షలలో మంచి మార్కులు సాధించాలన్నారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్ కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సతీష్,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్.. తప్పిన పెను ప్రమాదం




ప్రజాపక్షం/మల్లాపూర్ : మెట్పల్లి పట్టణంలోని విజయసాయి ప్రైవేట్ హై స్కూల్ నుండి విద్యార్థులతో బయలుదేరిన స్కూల్ బస్సు మండలంలోని ఓబులాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో మంగళవారం ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతోనే పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టగా పెను ప్రమాదమే తప్పింది. ఈ ప్రమాదంలో ముందరే కూర్చున్న కొత్త దామరాజు పల్లి గ్రామానికి చెందిన గడ్డల హనీష్ రెండో తరగతి విద్యార్థికి గాయాలు కాగా వెనువెంటనే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 36 మంది విద్యార్థులు ఉండగా ఒకే విద్యార్థికి గాయాలు కాగా ప్రమాదంలో మిగతా విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో విద్యార్థుల తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## అడ్రియాల లాంగ్ వాల్ గని సందర్శన

ప్రజాపక్షం/రామగిరి: మంగళవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని డైరెక్టర్ ఇ అండ్ ఎం యం.తిరుమలరావు సందర్శించారు.అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పుష్ప గుచ్ఛన్ని అందజేసి స్వాగతం పలికారు.అనంతరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించడానికి తీసుకొంటున్న చర్యలను వివరించారు.తదుపరి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి లాంగ్వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, 4వ ప్యానెల్ తయారీ పనుల పై చర్చించారు. వారు మట్లాడుతూ లాంగ్వాల్ సాల్వేజింగ్ పనులు త్వరగా పూర్తిచేసి, లాంగ్ వాల్ నుండి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఫ్లషింగ్ ప్లాంట్స్ లను సందర్శించి పరిశీలించారు.కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్దన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురాం, మేనేజర్ పెంచలయ్య, సర్వే అధికారి హన్మండ్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాలకుర్తి మండల అభివృద్ధిపై సమీక్ష



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో పొల్సాని శశికళ అధ్యక్షతన మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పాల్గొని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో వంద శాతం పన్ను వసూళ్లు చేపట్టాలని, ట్రేడ్ లైసెన్స్‌ల రిన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు వినియోగం, పరిశుభ్రత, పర్యావరణం, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ, సెగ్రిగేషన్ షెడ్ల సమర్థవంతమైన నిర్వహణ, మొక్కలకు తప్పకుండా నీరు పోయడం, నర్సరీల నిర్వహణ, పాలన, సాంకేతికత, గ్రామాల వారీగా పర్యవేక్షణ పనులను పిఎస్ యాప్ ద్వారా సత్వర పరిష్కరం, రికార్డుల అప్‌డేట్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి, వేసవి దృష్ట్యా తాగునీరు, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం, వ్యక్తిగత మరుగుగదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయడం, ప్రభుత్వ పథకాలు, ఇతర అభివృద్ధి పనులపై గ్రామాల వారీగా సమావేశంలో చర్చించారు.

# బరిలో 389 మంది అభ్యర్థులు

కరీంనగర్ కార్పొరేషన్ లో 66 డివిజన్ లకు ఎన్నికలు
మొత్తం ఓటర్లు 3,40,580,
పోలింగ్ స్టేషన్లు 477



ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికలు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ లకు నేడు ఎన్నికలు నిర్వహించనున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ బరిలో 389 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ఇందులో ప్రధాన పార్టీలు బీఆర్ ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు అన్ని డివిజన్ లలో పోటీ చేస్తుండగా సిపిఐ ఒక డివిజన్ లో పోటీ చేస్తుంది. అలాగే ఏఐఎఫ్ బీ, ఎంఐఎం, బీఎస్పీ తో పాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు పురపోరులో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి**

నేడు జరుగనున్న ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ లలో మొత్తం 3,40,580 ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 170858, పురుష ఓటర్లు 169679. ఇతరులు 43 ఉన్నారు. మొత్తం పోలింగ్ స్టేషన్లు 477 ఏర్పాటు చేశారు. బుధవారం (నేడు) ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. 13 వ తేదీన నగరంలోని ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.66 డివిజన్ల బ్యాలెట్ బాక్సుల భద్రపరిచేందుకు 2 స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్**

కార్పొరేషన్ సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని ఆదేశించారు.

**జమ్మికుంట డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్**

మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

**1300 మంది పోలీసులతో పటిష్ట భద్రత**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల నిర్వహణకు పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మొత్తం 1300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 109 పోలింగ్ లొకేషన్లలో 28 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వాటిలో సిసికెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. అంతేకాకుండా 66 వార్డులను 33 రూట్లుగా విభజించి, ప్రతి రూట్‌కు ఒక ఎస్ఐ, ప్రతి రెండు రూట్లకు ఒక ఇన్స్‌పెక్టర్ (క్లస్టర్ ఇన్‌చార్జ్) పర్యవేక్షిస్తారు. ప్రతీ నాలుగు క్లస్టర్లకు ఒక ఎసిపి స్థాయి అధికారిని నియమించమన్నారు. ఎన్నికల నేపథ్యంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 (పాత సెక్షన్ 144) అమలులో ఉంటుందని తెలిపారు.ఇప్పటికే 189 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేయగా, 49 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు సిపి తెలిపారు. ఇప్పటివరకు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 13 కేసులు నమోదయ్యాయి. నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు 23 ప్రత్యేక బృందాలు నిరంతరం పెట్రోలింగ్ తోపాటు వాహన తనిఖీలు చేస్తున్నాయన్నారు. 11వ తేదీన పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను ఎస్ఆర్ఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామని, 13వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## అధికారంతో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదు


రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి
అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి:బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా తమ రెండేళ్ల పాలనలో అధికారం అడ్డంపెట్టుకుని ధర్మపురిలో ఏ ఒక్కరినీ ఇబ్బందులు పెట్టలేద ని,గత ప్రభుత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని,కక్ష సాధింపు రాజకీయాలు తమ పార్టీ నైజం కాదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు.ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో మంగళవారం ప్రెస్ మీట్ లో మంత్రి అ డ్లూరి మాట్లాడారు.రాజ్యాంగ నిర్మాత డా.బాబా సా హెబ్ అంబేద్కర్ రచించిన ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ చాలా గొప్పదిగా ఆయన పేర్కొన్నారు. నాడు పోలీసులను అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ కా ర్యకర్తలపై అనేక కేసులు పెట్టించి భయభ్రాంతులకు గు రిచేసిన విషయం యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసని చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏరోజూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిపెట్టలేదన్నారు.కనీసం ముఖ్యమంత్రి కెసిఆర్ ముంది పెదవివి ప్పి మాట్లాడే ధైర్యం కూడా చేయలేదని ఎద్దేవాచేశారు. యదాద్రిని అభివృద్ధి చేసిన కెసిఆర్ ధర్మపురిపై శీతకన్ను వేశారని దాన్ని ఈశ్వర్ ప్రశ్నించలేదని పేర్కొన్నారు. తా ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ధైర్యంగా మాట్లాడి నై ట్ డిగ్రీ కళాశాల ను పునఃప్రారంభం చేశానని అడ్లూరి చె ప్పారు. రెండేళ్ళ కాంగ్రెస్ పాలనలో ధర్మపురిలో 700 మంది కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. పట్టణంలో 154 ఇందిరమ్మ ఇళ్ళు నిర్మింపజేసామని,డిగ్రీ కళాశాలకుశంకుస్థాపన చేయించామ ని,200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఉప ముఖ్యమంత్రితో శంకుస్థాపన జరిపించానని అన్నారు . గోదావరి నదిలో కలుషిత నీరు చేరకు ండా రూ .24 కోట్లతో సీవరేజి ప్లాంటును ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం తాను సిరిసిల్లకు వస్తానని కెటిఆర్‌తో ఏ చర్చకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. ధర్మపురి మున్సిపల్ లోని 1 5 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అభివ ృద్ధి బాధ్యత తనిదని మంత్రి హామీఇచ్చారు. రాబోయే 2 027 గోదావ రి నది పుష్కరాలతో ధర్మపురి రూపురేఖలు పూర్తిగా మా రనుందని జోస్యంచెప్పారు.ఈ సమావేశం లో మున్సిపల్ లో కాంగ్రెస్ బలపరుస్తున్న 15 మంది అ భ్యర్థులు,వివిధమండలాలపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి :జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం సుల్తానాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ , మంథని లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రామగుండం లోని సరస్వతి శిశు మందిర్ లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్బన్ లోకల్ బాడీస్‌కు రెండవ సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరుగుతున్నాయని, మన జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సంబంధిత మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశామని, ప్రతిచోట పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ సామాగ్రిని ప్రశాంతంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. రామగుండంలో ఏకగ్రీవమైన ఒక డివిజన్ మినహాయించి జిల్లాలోని మిగిలిన 123 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయని, దాదాపు 470 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రం నందు వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నామన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల బయట కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)అరుణశ్రీ, ఆర్‌డిఒలు గంగయ్య, సురేష్,మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్ ,మనోహర్,సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాబాట'

ప్రజాపక్షం/గొల్లపల్లి : రానున్న వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల సబ్ డివిజన్ గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని రాఘవపట్నం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఎడిఇ వరుణ్ కుమార్,ఎఇ రాకేష్ కుమార్ తో పాటు విద్యుత్ సిబ్బంది గ్రామంలోని డిటిఆర్‌లు పరీలించారు .దెబ్బతిన్న హెచ్‌జీ, ఎల్‌టి ఫ్యూజ్‌లను మార్పిడి చేసి వాటికి తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు.అనంతరం గ్రామంలో రెండు 25 కెవిఎ నియంత్రికలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసారపు భవాని అరవింద్, ఉప సర్పంచ్ శిరవేణి రవి, వార్డు సభ్యులు, విద్యుత్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబ్ ఇంజనీర్ రాజేందర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాబాట కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసం రాజశేఖర్ ,ఉప సర్పంచ్ సంగేమ్ రజిత తిరుపతి ,సబ్ ఇంజనీర్ ఏ రాజేందర్ నాయక్ ,లైన్ ఇన్స్‌పెక్టర్ పూదరి రెడ్డి,అసిస్టెంట్ లైన్మెన్ కాసా రమేష్ ,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఏడీఈ వరుణ్ కుమార్,ఏఈ రాకేష్ కుమార్‌తో పాటు విద్యుత్ సిబ్బంది గ్రామంలోని డిటిఆర్‌లు పరీలించారు దెబ్బతిన్న హెచ్‌జీ, ఎల్‌టి ఫ్యూజ్‌లను మార్పిడి చేసి, వాటికి తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు.అనంతరం గ్రామంలో రెండు 25 కెవిఎ నియంత్రికలను ఏర్పాటు చేశారు.పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని వినియోగదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసారపు భవాని అరవింద్, ఉపసర్పంచ్ శిరవేణి రవి, వార్డు సభ్యులు, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ

జగిత్యాల జిల్లా కలెక్టర్ అశోక్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల :మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని మెట్‌పెల్లి,కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో ఏర్పాటు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేసి మాట్లాడారు. ఎన్నికల పక్రియ సజావుగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 136 వార్డులు ఉండగా 2,31,627 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 379 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇందుకోసం 455 మంది పోలింగ్ అధికారులు, 455 మంది సహాయ అధికారులు, 1637 మంది సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేబడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ అధికారులు శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, మదన్ మోహన్ ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి

విలేకరుల సమావేశంలో
మంత్రి పొన్నం పిలుపు

ప్రజాపక్షం/హుస్నాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పెద్ద ఆయుధం ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అందరు కా ంగ్రె స్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని అధికారపార్టీకి ఓటు వేస్తే ప ట్టణం అభివృద్ధి చెందుతుందని తెలంగా ణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు అన్నారు. మంగళవారం అయన మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక శాతం ఓటు హక్కు ను వినియోగించుకొంటున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో జీవన స్థితిగతులు ,త్రాగునీటి సరఫరా,డ్రేనేజీ వ్యవస్థ, స్ట్రీట్‌లైట్స్, శానిటేషన్, వెస్టు మేనేజ్‌మెంటులాంటి తదితర ఆంశాలపై తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం సమగ్ర అలోచనతో మందన్నారు.రెండు ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. గెలుపు మీది అభివృద్ధి నాది హుస్నాబాద్‌ను అన్ని విధాలఅభివృద్ధిచేసే బాధ్యత నాదేన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక కేంద్రంలో ఈ నెల 11 న జరిగే మున్సిపల్ ఎన్నికల కోసం మంగళవారం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలో గల 15 వార్డుల్లో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని, కోడ్ ఉల్లంఘించరాదని, అధిక శాతం పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు పోలింగ్ ఎన్నికల సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందించారు.ధర్మపురి మున్సిపల్ పరిధిలో గల 15 వార్డులకు 4 రూట్లలో నలుగురు జోనల్ అధికారులను నియమించారు. మొత్తం 29 పోలింగ్ కేంద్రాలకు ఆరుగురు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు 6 మంది ఎన్నికల సహాయ అధికారులు, 175 మంది పోలింగ్ సిబ్బంది. ఇద్దరు టీవోటీలు, మరి కొంత మంది సిబ్బందిని నియమించారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే పోలింగ్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా రూట్లకు కేటాయించిన పలు వాహనాల ద్వారా ఎన్నికల కోసం వాడే బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రితో తరలి వెళ్లారు. ఎన్నికల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటు వేసేందుకు జారీ చేసిన ఓటరు ఫోటోతో కూడిన స్లిప్పు లేనియెడల ఓటర్లకు 14 రకాల గుర్తింపు కార్డులు ఉపయోగించుకునేలా అవకాశం కల్పించారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజాగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల ఆర్డీవో మదుసూదన్, ధర్మపురి మున్సిపల్ కమీషనర్ ,తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,ఎంఇఓ సీతాలక్ష్మి పాల్గొన్నారు.

# సిద్దిపేటలోని 4 మున్సిపాల్టీలు 72వార్డులు

నేడు
ఎన్నికలు






ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాల్టీలకు 72 వార్డులకు బుధవారం పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ ప్రక్రియకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి అయా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అవసరమగు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయా మున్సిపల్ పరిధిలో మంగళవారం ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లకు ఇతర సామాగ్రికి పంపిణి చేశారు. నాలుగు మున్సిపాల్టీల్లో 72 వార్డులు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. 72 వార్డుల్లో 176 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అయా మున్సిపాల్టీలో నిర్వహించే పోలింగ్‌లో 1లక్ష 1 వేయి 85 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 18 రూట్లకు 22 మంది జోనల్ అధికారులను నియమించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 31 మంది మైక్రో పరిశీలకులు.క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసిడింగ్ అధికారి. అసిస్టెంట్ ప్రిసిడింగ్ అధికారి, ఒక ఎపిని నియమించారు, బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 72 వార్డులకు 323 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. 1069 మంది సిబ్బందిని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల విధులను నిర్వహించనున్నారు.

**పోలింగ్ సామాగ్రి పంపిణీని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి హైమావతి**

జిల్లాలోని అయా మున్సిపల్ పరిధిలోని పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హైమావతి పరిశీలించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట తెలంగాణ మోడల్ స్కూల్. జూనియర్ కళాశాలల్లో పోలింగ్ సామాగ్రీ పంపిణీ తీరును జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మాస్రత్‌ఖాన్‌తో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను నిఘా నీడలో నిర్వహించటానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో అయా మున్సిపాల్టీలో 31 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ అమలు చేస్తున్నారు. బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత ఉదయం 7గంటలకు పోలింగ్‌ను ప్రారంభించాలని పోలింగ్ అధికారులు,సిబ్బందిని ఆదేశించారు.

# మెదక్‌లో 74 వార్డులు,148 పోలింగ్ కేంద్రాలు

## ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ సాధారణ 2వ విడత ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు భీమ్‌గల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పొన్నం సత్యనారాయణగౌడ్ తెలిపారు. నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేందుకు పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఇద్దరు ఏసీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ ఆధ్వర్యంలో 8 ఎస్సైలు, 10 ఏఎస్సైలు, 79 మంది కానిస్టేబుళ్లు ఎన్నికల బందోబస్తులో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలుతీసుకోవటం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందనితెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, నాయకులు సహకరించాలని సిఐ సత్యనారాయణగౌడ్ కోరారు.

### మున్సిపాలిటీలో 87,615 మంది ఓటర్లు
### పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు

**ప్రజాపక్షం మెదక్ :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. జిల్లాలోని మెదక్, రామాయంపేట్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల్లో 75 వార్డులు ఉన్నాయి. అందులో 01 వార్డును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెదక్ మున్సిపల్ లో 32 వార్డు అభ్యర్థి గోదల మానస సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగితా 74 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 287 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మెదక్ మున్సిపాలిటీలో 31 వార్డులు, నర్సాపూర్ లో 15 వార్డులు, తూప్రాన్ లో 16 వార్డులు రామాయంపేటలో 12 వార్డులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 87,615 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలో పురుషుల ఓటర్లు మొత్తం 42306 మంది, మహిళలు 45307 మంది ఉండగా ఇతరులు 02 ఉన్నారు. మెదక్ మున్సిపాలిటీలో 31 వార్డులకు, 62 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 37016 ఓటర్లు ఉండగా అందులో 17580 మంది పురుషులు, 19435 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రామాయంపేటలో 12 వార్డులకు, 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 13106 ఓటర్లు ఉండగా అందులో 6298 మంది పురుషులు, 6808 మహిళలు ఉన్నారు. నార్సాపూర్‌లో 15 వార్డులకు, 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 17066 ఓటర్లు ఉండగా అందులో 8328 మంది పురుషులు, 8737 మహిళలు ఉన్నారు. తూప్రాన్‌లో 16 వార్డులకు, 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 20427 ఓటర్లు ఉండగా అందులో 10100 మంది పురుషులు, 10320 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు 884 మంది పోలింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 13 న కౌంటింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు.






## పకడ్బందీగా పోలింగ్ ప్రక్రియ

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం జరుగనున్న పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి నీడ, కుర్చీలు, తాగునీరు, భోజన వసతి కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ హాలులో లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణ కోసం పూర్తి ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మం డల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ విజయ్‌కుమార్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో కమీషనర్ అన్వేష్‌తో కలిసి ఎన్నికల సామాగ్రి పం పిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి సామాగ్రి పంపిణి ప్రక్రియను పరిశీలించారు. ఈ స ందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ము న్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధిఆరుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పోరేషన్, నాలుగు ము న్సిపాలిటీలలో ఈ నెల 11వ తేదీన ఎన్నికల నిర్వహించడంజరుగుతుందని తెలిపా రు.13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని , క్యాతనపెల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్‌కెసిఓఎ క్లబ్‌లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడంజరిగిందని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణి, ప్రక్రియ పకడ్బంధీ గా చేపట్టి, సామాగ్రిని సిబ్బందిని సురక్షితంగా కే టాయించిన ప్రకారం పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు.

## వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి

వైద్య ఆరోగ్యశాఖ

అధికారి డాక్టర్ అనిత

**ప్రజాపక్షం / జన్నారం :** ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్ కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత సూచించారు. మంగళవారం జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె వైద్య సేవలు, టీకాల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలపై అవగాహన కల్పించాలని, కీటక జనిత వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. 30 ఏళ్లు పైబడిన వారికి మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో మొబైల్ ఎక్స్‌రే ద్వారా క్షయ పరీక్షలు చేస్తూ ఆరోగ్య అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

## మున్సిపల్ ఓటర్లంతా..
## ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం మెదక్ :** మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలో ఉన్న ప్రజలందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగి ంచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పో లింగ్ కు ఏర్పాట్లు చేశామని, ప్రజలందరూ పెద్ద ఎత్తున ఓటింగ్ లో పాల్గొని వంద శాతం ఓటింగ్ ను నమోదు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి భయం గాని, పక్షపాతం గాని, రాగద్వేషాలు గాని, ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ నమోదయిందని, మున్సిపాలిటీలలో వంద శాతం ఓటింగ్ నమోదు కావాలని కలెక్టర్ కోరారు.

## నర్సింగరావు ఆశయాలు సాధిస్తాం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.నర్సింగరావు ఇటీవల జరిగిన యాక్సిడెంట్ వల్ల ఆస్పత్రిలో 20 రోజులు ట్రీట్‌మెంట్ పొంది మంగళవారం ఉదయం మృతి చెందారని సిపిఐ ఓమయ్య, సుధాకర్ తెలిపారు. ఆయన మృతదేహం వద్ద మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, రవి చందర్, శ్రీను, జిల్లా ఎఐటియుసి సిపిఐ నాయకులు ఓమయ్య, సుధాకర్, భూమయ్య, ఇతర నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. నర్సింగ్‌రావు కార్పోరేషన్ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించారన్నారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర బాధ్యతలలో ఉంటూ ఇతర ప్రాంతాలలోని మున్సిపాలిటీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల కోసం అనునిత్యం పోరాటాలు నిర్వహించిన నర్సింగ్‌రావుకు ఘననివాళులర్పించారు. సిపిఐ జిల్లా నాయకులు కె.రాజన్న, రాజిరెడ్డి, అలీ ఇమ్రాన్, హన్మాండ్లు, గంగారాం, ముత్యాలు పాల్గొన్నారు.



## బైంసాలో పోలింగ్ కేంద్రాల సామగ్రి పంపిణీ,తనిఖీ..

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/బైంసా :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే అధికారులు,సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం బైంసాలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్)రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు.ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు.పోలింగ్ సా మగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు,పేపర్ సీల్స్,స్టేషనరీ కిట్‌లను క్షుణంగా పరిశీలించాలని సూచించారు.ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుఉసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమ ని పేర్కొన్నారు.ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్,రెవెన్యూ య ంత్రాంగం సమన్వయం తో పనిచేయాలని సూచించారు.పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు,సీల్ చేసిన బ్యాలెట్ బాక్కులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు.స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏ ర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా రూరల్ మండలంలోని రానాపూర్ గ్రామంలో నాబార్డ్ ఆర్థిక అక్షరాస్యత నిధుల సహకారంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్థిక,డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.బ్యాంకు మేనేజర్ శశికాంత్ మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు,మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు,వ్యాపారవేత్తలు,సీనియర్ సిటిజన్లకు వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ,బ్యాంకింగ్ సేవలు, రుణాల విషయాలు,ప్రభుత్వ పథకాలు తదితర అంశాలు గురించి వివరించారు.ప్రధానమంత్రిబీమా యోజన,ముద్ర రుణాలు, గృహ, విద్య,వ్యవసాయ రుణాల వివరాలు,అలాగే సైబర్ క్రైమ్ పై ప్రత్యేక అవగాహన నిర్వహించారు.కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శశికాంత్ ఫీల్డ్ ఆఫీసర్ ఎం.సి నా యుడు,మహిపాల్,రవికుమార్,గ్రామ సర్పంచ్ పవర్ బాయ్, సీఏ దేవిదాస్,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రమాబాయి అంబేద్కర్ మహిళలకు ఆదర్శప్రాయురాలు

ముధోల్ సర్పంచ్

షబానా బేగం ఎజాజ్ ఉద్దీన్



**ప్రజాపక్షం/ముధోల్ :** మహిళలకు రమాబాయి అంబేద్కర్ ఆదర్శప్రాయురాలని ముధోల్ స ర్పంచ్ షబానా బేగం ఎజాజోద్దీన్ అన్నారు. మండల కేంద్రమైన ముధోల్ లోని నాగ్సన్ నగర్లో గల షీల్ శాంతి బుద్ధ విహార ఆవరణలో సోమవారం రాత్రి భీమ్ సేన యూత్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయ్ అంబేద్కర్ 128వ జయంతిని ఘనంగా,నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని గౌతమ బుద్ధుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,మాత రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ షబానా ఎజాజ్‌ఉద్దీన్ నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనలో వారి సతీమణి రమాబాయ్ కృషి మరువలేనిదని కొనియాడారు.రమాబాయ్ ప్రతి మహిళకు ఆదర్శమూర్తి అని తెలిపారు.సమాజంలోని ప్రతి ఒక్కరు రమాబాయ్ చరిత్రను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎంతో కఠినమైన పరిస్థితుల్లో సైతం ధైర్యాన్ని విడవకుండా బాబా సాహెబ్ కు సహకరించిన తీరు మరువలేనిదన్నారు.దేశవ్యాప్తంగా మహనీయుల జయంతి ఉత్సవాలను జరుపుకోవడం జరుగుతుందన్నారు.మొదటిసారిగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతిని జరుపుకోవడం అభినందనీయమన్నారు.మహనీయుల ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.అదేవిధంగా రమాబాయ్ జయంతిని పురస్కరించుకుని నాక్షన్ నగర్‌లో సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం తిలకించడానికి వచ్చిన ప్రేక్షకులకు గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలలో రమాబాయి జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు,సమత సైనిక్ దళ్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాగ్మారే నారాయణ ,ఉత్సవ కమిటీ సభ్యులు సాయన్న, మంత్రి, విశ్వంబర్,విట్టోలి సర్పంచ్ రుచింత దిగంబర్,ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్, ఈఓ అన్వర్ అలీ,మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, మాజీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు శంకర్ చంద్రే,తాటేవర్ రమేష్ బౌద్ధ మహాసభ పదాధికారులు,సమత సైనిక్ దళ్ పదాధికారులు,స్థానిక సభ్యు లు, ప్రజలుపాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు ఎలక్ట్రానిక్..
## వస్తువులకు అనుమతి లేదు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/బోధన్:** మున్సిపల్ ఎ న్నికల సందర్భంగా పోలింగ్ కేం ద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడువని పోలింగ్ నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం బోధన్ పట్టణంలోని విజయ మేరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.బోధన్ పట్టణంలో మొత్తం 38వార్డులకు గాను 111 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో జోనల్ ఆఫీసర్స్ 8మంది కాగా, ఇద్దరు రిజర్వ్‌లో ఉంటారని, 13+3 ఆర్‌వోలు, 13+3మంది ఏఆర్‌ఓలు, పీ ఓలు 111+44 ఏపీఓ లు, 111+44ఓ పి ఓస్, 310 మంది రిజర్వులో అధికా ర బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.పకడ్బందిగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు సహకరించేలా బిఎల్ఓ లతో కూడిన హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు.

## హనుమాన్ మందిరాన్ని
## ప్రారంభించిన : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వాంకిడి మండలం సరండి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం, శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.వాంకిడి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజయ్ కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జా బరి పేంటు, సరండి సర్పంచ్ మోర్లే బాపూజీ, గ్రామ పటేల్ కొట్రంగే మెం గాజీ, మాలి సంఘం జిల్లా అధ్యక్షులు శిండే వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, గౌరయ్య పటేల్, మాజీ సర్పంచ్ దుర్గం కమలాకర్, భక్తులు పాల్గొన్నారు.



## నిబద్ధతతో అధికారులు, సిబ్బంది విధులు

జిల్లా ఎస్‌పి నితిక పంత్





**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల విధులను నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి నితిక పంత్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని లారీ చౌక్ సమీపంలో ఉన్న బిఎంఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్‌పి పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధమైన విధుల నిర్వహణపై స్పష్టమైన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అనుచిత కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. గుంపులుగా తిరగడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం లేదా బెదిరించే చర్యలకు తావు లేకుండా నిరంతర పహారా నిర్వహించాలని ఆదేశించారు. అతి సున్నిత పోలింగ్ కేంద్రాలలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ వంద మీటర్ల పరిధిలో బిఎంఎస్ఎస్ అమలులో ఉన్నందున నలుగురికి మించి వ్యక్తులు గుమికూడకుండా కఠినంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడకూడదని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలింగ్ అనంతరం ఈవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని, ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ అధికారులు,పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలి

**ప్రజాపక్షం/ముధోల్ :** గ్రామ అభివృద్ధికి అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పాటుపడాలని ముధోల్ మేజర్ గ్రామ సర్పంచ్ షబానా బేగం ఎజాజుద్దీన్ కోరారు.గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామ సర్పంచ్ గానూతనంగా ఎన్నికైన సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్ అధ్యక్షతనలో గ్రామ సభ నిర్వహించారు.ముందుగా గ్రామపంచాయతీ ఈవో అన్వర్ అలీ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాల కాలంలో చేపట్టే అభివృద్ధి ఎజెండా పనులపైన చదివి వినిపించారు.గ్రామంలోని వారసంతలో వాటర్ వద్ద విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి.ముధోల్ స్మశాన వాటిక నుండి బేకరీ,బట్టిగల్లి,పండర్‌పూరి హోటల్ వ రకు నూతన కల్వర్టును ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నా రు.ముఖ్యంగా వేసవి కాలం దృశ్య ఆయా కాలనీలో తాగునీటి సమస్య లేకు ండా బోరు మోటార్లను వేయించాలన్నారు.ఇతరత్రా సమస్యలను పంచాయతీకి సమకూరేఆదాయాన్ని బట్టి పనులను సాగించాలని నిర్ణయించారు.మండల కేంద్రానికి 97 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.వాటిలో 38 ఇందిరమ్మ ఇండ్లు ఇంకా ప్రారంభం కాలేదని తెలియజేశారు.ఇండ్లను నిర్మించుకోలేని లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఆయా వార్డుల సభ్యులు గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునేలా చూడాలని కోరారు. రైతులకు ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్ పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# వరల్డ్ కప్ హీరోకు సచిన్ కానుక



అండర్ –19 వరల్డ్ కప్ హీరోలపై ప్రశంసల జల్లు కురుస్తోంది. జగజ్జేతలుగా స్వదేశం తిరిగొచ్చిన భారత బృందాన్ని దిగ్గజ ఆటగాళ్లు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తాజాగా కెప్టెన్ ఆయుశ్ మాత్రేకు అపురూపమైన కానుక అందించాడు. భారత్ను అజేయంగా నడిపించి విశ్వ విజేతగా నిలిపినందుకు అతడికి తన టెస్టు జెర్సీని బహూకరించాడు. లెజెండరీ ఆటగాడి నుంచి విలువైన బహుమతి అందుకున్న మాత్రే సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టాడు. ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ముందుండే సచిన్ టెండూల్కర్ ఈసారి అండర్ 19 వరల్డ్కప్ కెప్టెన్ ఆయుశ్ మాత్రేను ఆకాశానికెత్తేశాడు. భారత జట్టుకు ఆరో కప్పు సాధించిన అతడిని ప్రశంసించిన సచిన్.. అతడికి మర్చిపోలేని బహూకరించాడు. మంగళవారం ముంబైలోని తన నివాసంలో మాత్రేను అభినందించిన క్రికెట్ దిగ్గజం.. డియర్ ఆయుశ్.. నీ కెరీర్ విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నా అని రాసున్న టెస్టు జెర్సీని కానుకగా ఇచ్చాడు. ఇలానే కష్టపడుతూ ఉండు. జనాల కామెంట్లను పట్టించుకోకు. ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రాక్టీస్ మానేయకు. ఆట మీద శ్రద్ధతో ఉండాలి అని యువ క్రికెటర్కు సచిన్ విలువైన సూచనలను చేశాడు.

## ఇండో–పాక్ మ్యాచ్ జోష్..

### ఒక్కసారిగా పెరిగిన విమాన టికెట్ ఛార్జీలు



**కొలంబో:** టి–20 వరల్డ్ కప్లో ఆదివారం భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఆ మ్యాచ్పై ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే.. కొలంబోకు వెళ్లే విమానాలకు టికెట్ ధరలను అమాంతం పెంచేశారు. ముంబై–కొలంబో మధ్య ఒక్కసారిగా టికెట్ ధరపై పది వేలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన ఈ మ్యాచ్ జరగనున్నది. అయితే తాజా రిపోర్టు ప్రకారం ముంబై–కొలంబో ముంబై మధ్య విమాన టికెట్ ఛార్జీ రూ.60 వేలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇండో–పాక్ సమరానికి తగ్గ రీతిలో విమాన ఛార్జీలు కూడా పెరిగినట్లు కొన్ని రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. ఆన్లైన్ బుకింగ్ వివరాల ప్రకారం.. చండీఘడ్ నుంచి కొలంబోకు ఎయిర్ ఇండియా రౌండ్ ట్రిప్ సుమారు రూ.63 వేలు ఉన్నది. ఇక ఇండిగో విమాన ఛార్జీలు సుమారు రూ.70 నుంచి రూ.74 వేలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ–కొలంబో మధ్య ఈ తేదీల్లో విమాన ఛార్జీలు రూ.45 వేలుగా ఉన్నట్లు బుకింగ్ డిటేల్స్ ద్వారా స్పష్టమవుతోంది.

# పది వికెట్లతో యుఎఇని ఓడించిన న్యూజిలాండ్!



వరల్డ్ కప్ సన్నాహక సిరీస్లో భారత జట్టు చేతిలో చావుదెబ్బ తిన్న న్యూజిలాండ్ మెగా టోర్నీలో జూలు విదుల్చుతోంది. తొలిపోరులో అఫ్గనిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన కివీస్.. ఈసారి యుఎఇ భరతం పట్టింది. 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) మంచుముక్కలా కరిగించారు. హైలెట్స్ చూస్తున్నామా? అన్నట్టుగా రెండో ఓవర్ నుంచి దూకుడే మంత్రగా యుఎఇ బౌలర్లపై ఈ ద్వయం విరుచుకుపడింది. అర్ధ శతకాల అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై జాలి, దయ లేకుండా ఆడడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే మట్టికరిపించింది.

టి–20 వరల్డ్ కప్లో సంచలనం సృష్టించాలనుకున్న యుఎఇ కలలు కల్లలయ్యాయి. పటిష్టమైన న్యూజిలాండ్పై భారీ స్కోర్తో విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ జట్టుపై ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) పిడుగల్లే విరుచుకుపడ్డారు. 174 పరుగుల ఛేదనలో నువ్వా నేనా అనట్టు ఇద్దరూ పోటీపడి బౌండరీల పండుగ చేసుకున్నారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ 3 ఫోర్లు, ఒక సిక్సర్తో 20 రన్స్ రాబట్టగా.. పవర్ ప్లేలోనే 80కి చేరువైంది కివీస్.

ఈ జోడీని విడదీసేందుకు యుఎఇ సారథి వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. దాంతో.. చూస్తుండగానే లక్ష్యం చిన్నదైపోయింది. రోహిద్ వేసిన 16 వ ఓవర్ రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్గా మలవగా బ్లాక్ క్యాప్స్ 10 వికెట్లతో జయభేరి మోగించింది. వరుసగా రెండో విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్ డీలో అగ్రస్థానానికి ఎగబాకింది.

**వసీం, షరాఫు దంచేయగా...**

చెన్నైలో పటిష్టమైన న్యూజిలాండ్లో మొదట యుఎఇ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్ ముహమ్మద్ వసీం(64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్తో అదరగొట్టగా.. అలీషన్ షరాఫు(55) హాఫ్ సెంచరీతోచెలరేగాడు. కివీస్ పేస్, స్పిన్ దళాన్ని ఉతికారేసిన ఈ ద్వయం విధ్వంసంతో 15 ఓవర్లకే స్కోర్ 120 దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్(21) దంచేశాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనుకున్న ప్రత్యర్థికి షాకిస్తూ మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో యూఏఈ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.

## మహిళ

# 'సైన్స్ అండ్ టెక్నాలజీ'లో వెనుకంజ!

### (నేడు సైన్స్లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం)


నేటి అత్యాధునిక డిజిటల్ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్త పుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చివేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు, బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగవలసిన ప్రగతి నమోదు కావడం లేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేరీ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి బాలికలు, యువతులను సైన్స్ వైపు ఆకర్శించడానికి ఐరాసయూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట సైన్స్లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు, తల్లితండ్రులు, పౌర సమాజం, శాస్త్రసాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు, యువతుల దృష్టిని స్టెమ్ ఎస్టిఇఎం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. సైన్స్టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన సైన్స్లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం నిర్వహిస్తున్నారు. 2026 నిర్వహిస్తున్న 'సైన్స్లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా 'సైన్స్టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి ప్రణాళికలు ప్రభావం చూపడం : స్టెమ్ విద్యలో లింగ అసమానతల తగ్గింపు' అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు.



మేరీ క్యూరీ

1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి. నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం. సైన్స్టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం.

## గుర్తింపు లేని ఆవిష్కరణ





అమెరికాకు చెందిన ఐనైస్ న్యూటన్ ఫుటె 1856లో చేసిన ప్రయోగం, తద్వారా జరిగిన ఆవిష్కరణ చాలాకాలం గుర్తింపునకు నోచుకోలేదు. తర్వాతి కాలంలో ప్రాధాన్యతను సంతరించుకున్నప్పటికీ, ఆవిష్కర్తగా న్యూటన్ ఫుటెకు దక్కాల్సిన గౌరవం లభించలేదు. వివరాల్లోకి వెళితే, వివిధ రకాల ప్రయోగాలు చేయడంలో ఆసక్తి ఉన్న ఫుటె ఒకసారి సాదాసీదా ప్రయోగం చేసింది. ఆమె గాజు గొట్టాల్లో వేరువేరు వాయువులను ఉంచి, సూర్యకాంతిలో వాటి వేడి పెరుగుదలని కొలిచింది. సాధారణ గాలి కంటే, కార్బర్ డైయాక్సైడ్ ($CO_2$), నీటి ఆవిరి ఎక్కువ వేడిని నిల్వ చేయగలగడాన్ని ఆమె గుర్తించింది. ఇవే గ్రీన్హౌస్ ఎఫెక్ట్కి కారణమని, ఇది వాతావరణ మార్పులకు దారి తీస్తుందని ఆమె ఆ రోజుల్లోనే వివరించింది. కానీ, 'అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్మెంట్ ఆఫ్ సైన్స్' సమావేశంలో, ఆమె స్వయంగా తన పరిశోధనను ప్రదర్శించలేకపోయింది. ఆ కాలంలో మహిళలకు అలాంటి అవకాశం లేదు. అందుకే, ఆమె పత్రాన్ని ఒక పురుష శాస్త్రవేత్త చదివాడు, అతను ఫుట్ ప్రస్తావించలేదు. ఫలితంగా పేరు రికార్డుల్లో నమోదు కాలేదు. ఆమె ఈ ప్రయోగం చేసిన మూడు సంవత్సరాల తర్వాత, జాన్ టిండాల్ కూడా అలాంటి ప్రయోగమే చేశాడు. అప్పటి నుంచి అతని పేరు గ్రీన్హౌస్ ఎఫెక్ట్తో జత కలిసింది. ఫుటె పేరు మాత్రం అనామకంగా ఉండియపోయింది. పురుషాధిక్యతకు ఇదొక నిదర్శనం. చాలా సంవత్సరాలు ఫుట్ పేరును అంతా మరచిపోయినా, ఇటీవలి కాలంలో ఆమె పరిశోధనలు బయటపడ్డాయి. దీనితో ఆమెకు గ్రీన్హౌస్ ఎఫెక్ట్ను మొదటిసారి గుర్తించిన శాస్త్రవేత్తగా గుర్తింపు లభించింది. 1819 జులై 17న జన్మించిన ఫుట్ 1888లో తుదిశ్వాస విడిచింది. సెప్టెంబర్ 29 లేదా 30వ తేదీ ఆమె మరణించి ఉంటుందని అంటున్నారు. తేదీ ఖచ్చితంగా నమోదు కాలేదు. చివరికి మరణం తేదీని ఖరారు చేసే విషయంలోనూ ఆమెకు అన్యాయమే జరిగింది.

## కార్మిక సమ్మెకు మంత్రి మద్దతు



**ప్రజాపక్షం/ధర్మపురి :** కార్మిక సంఘాలు ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి.ముక్రమ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ కూడలిలో మంగళవారం వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లు కార్మికుల హక్కులు హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. విద్యుత్ సవరణ చట్టం 2025, విబి జి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం ఉపసంహరించాలని పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు 12న ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ హమాలీ కార్మిక సంఘాల నాయకులు ముడుగం రాజలింగం, బడుగు లచ్చయ్య, దూడ గంగయ్య, ముడుసుల సత్తయ్య, రవి, రాజు, మొయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల రవాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొన్నాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ బాలాజీనగర్ ఎస్డబ్ల్యుసి గోదాములలో పనిచేస్తున్న హమాలీలతో కలిసి గోదాం మేనేజర్ సంపత్కుమార్కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని తిరోగమన వైపు తీసుకువెళ్తుందని, కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కొత్త లేబర్ చట్టాలతో హరిస్తూ, పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నాడని ఆరోపించారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయని, ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు విధిగా సమ్మెలో పాల్గొన్నాలని, ఆటో, ఆర్టీసీ, బ్యాంకింగ్, ఎల్ఐసి, ఇండ్రస్టియల్, ఆశా, అంగన్వాడీ, ఎఎన్ఎంలు పాల్గొంటారని, గ్రామీణ రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కంపాటి నాగయ్య, సైదా, టి.శ్రీను, పాలిక మహేష్, జగ్గాని వెంకన్న, సైదులు, ఉప్పల రమేష్, ఈదుల వెంకన్న పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సన్నద్ధంకండి

## విజయవంతానికి కార్మిక సంఘాల పిలుపు

**ప్రజాపక్షం/హయత్నగర్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవతం చేయాలని సిపిఐ ఎల్బీనగర్ సమితి పిలుపునిచ్చింది. ఎల్బీనగర్లో సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్రచారి పాల్గొని పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాములు గౌడ్, మనసురాబాద్ డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్, మున్సిపల్ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి మద్దిలేటి, నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, మద్రి శోభన్, శీను, సామెల్, వీరస్వామి, బాలరాజు, వెంకట్, చంటి, రమేష్, బొడ్డుపల్లి అశోక్, గూని శోభ, చాందిని, కె.శీను తదితరులు పాల్గొన్నారు.




జడ్చర్ల

**జడ్చర్ల :**12న జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జడ్చర్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికులకు దేశవ్యాప్త సమ్మె కరపత్రం ఆవిష్కరించి, సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భాగి కృష్ణయ్య సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, తెలుగు సత్తయ్య, మున్సిపల్ సంఘం జడ్చర్ల పట్టణ నాయకులు, కృష్ణ, మహేష్, అరుణ్ కుమార్, ప్రవీణ్, ఇందిరా, అంజమ్మ, దేవయ్య పాల్గొన్నారు.



నెక్కొండ

**నెక్కొండ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల నిర్వీర్యత, పెరుగుతున్న ధరలు నిరుద్యోగానికి వ్యతిరేకంగా 12న జరగనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు పిలుపునిచ్చారు. మంగళవారం నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు తోట వెంకన్న, మనుబోతుల యాకాంబరం, తోట రవి, కూస వెంకన్న, తోట మహేందర్, కొమ్ముల చిన్నారి, ఉసిల్ల నర్సయ్య, దాసరి సురేందర్, గోసుల భద్రయ్య, తోట దుర్గయ్య, సంతోష్, మనుబోతుల శ్రీను, సదిరం స్వామి పాల్గొన్నారు.



పెద్దపల్లి

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జెఎసి నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 11 వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్లో మడ్డి ఎల్లాగౌడ్, టి.రాజిరెడ్డి, కచ్చకాయల సదానందం, మాదాసు రాంమూర్తి, ఈదు నూరి నరేశ్, ఆరెల్లి పోషం, నాయిని శంకర్, గొడిశల నరేష్,నూనె కొంరయ్య, వడ్డెపల్లి శంకర్ పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి;** ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హమాలీలతో కలిసి సమ్మె పోస్టర్ను ఆవిష్కరించాకార్యక్రమంలో అలమోని మల్లయ్య, వెంకటయ్య, బాలు, రామస్వామి, సోమ్లా, నాను, శంకర్, శ్రీను, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ మండల పరిధిలో భవాని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎఐటియుసి మేడ్చల్ జిల్ల కార్యదర్శి వి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవాని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బాలాజీ, సంఘం నాయకులు ముసలయ్య, సామేల్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి..హయత్నగర్



కొండమల్లేపల్లి..




కుత్బుల్లాపూర్..

# పాండరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

### నివాళులర్పించిన పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** కనగల్ మండలం కురంపల్లి గ్రామానికి చెందిన సిపిఐ కనగల్ మండల సహాయ కార్యదర్శి దోటి పాండరి(74) మంగళవారం నల్లగొండలో తుదిశ్వాస విడిచారు. పాండరీ తండ్రి దోటి అక్కలయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాంకు వ్యతిరేక ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో దున్నేవారికే భూమి నినాదంతో భూస్వామ్య దోపిడీ, రజాకార్ల దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. తల్లి దోటి మల్లమ్మ కూడా భర్తకు తోడుగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ పాండరీ గత ఐదు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో, ప్రజా సంఘాల ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. సిపిఐ కనగల్ మండల సహాయ కార్యదర్శిగా, గీత పనివారల మండల సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. గ్రామంలో జరిగిన సంఘ వ్యతిరేక ఘర్షణల కేసుల్లో అక్రమంగా ఇరికించిన కేసుల కారణంగా రెండు సంవత్సరాలు జైలుజీవితం గడిపిన పాండరీ, కేసుల నుంచి విముక్తి పొందారు. సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉంటూ, గీత వృత్తి, కొద్దిపాటి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించిన పాండరీకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.



### నిబద్ధత కలిగిన నాయకుడు

ఉద్యమ వారసత్వంగా వచ్చిన అమరజీవి దోటి పాండరి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి నిబద్ధతతో సిపిఐ బలోపేతానికి పని చేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పాండరి స్వగ్రామమైన కురంపల్లిలో పాండరి మృతదేహానికి ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పాండరి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం, సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కనగల్ మండల ప్రాంతంలో సిపిఐ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నిరంతరం పాటుపడేవాడని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, పబ్బు వీరస్వామి, జిల్లా సహాయకార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, మండల కార్యదర్శి సత్యనారాయణ, శాంతిసంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, న్యాయవాది గుర్రం వెంకట్రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, గాదెపాక రమేష్, కస్తాల సర్పంచ్ ఎల్ సత్యనారాయణ, కర్నాటి వెంకటేష్, దశరథతో పార్టీ శ్రేణులు ఉన్నారు.

### బొమ్మగాని ప్రభాకర్ సంతాపం

**హైదరాబాద్ :** కనగల్ మండల సిపిఐ సహాయకార్యదర్శి దోటి పాండరి మృతికి రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాండరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## షార్ట్ సర్క్యూట్‌తో పూజా స్టోర్ దగ్ధం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలోని కాళేశ్వరం రోడ్డులో మహేశ్వర పూజా స్టోర్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అవ్వడం దురదృష్టకరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. షార్ట్ సర్క్యూట్‌తో బుక్క దుకాణం పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత వ్యాపారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ ప్రమాదం దురదృష్టకరమన్న ఎమ్మెల్యే, ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అగ్నిప్రమాదాల పట్ల వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ మండలంలో పేదల ఆకలిపై లాభాలు ఆర్జిస్తున్న అక్రమ వ్యాపారికి పోలీసుల టాస్క్‌ఫోర్స్ గట్టి షాక్ ఇచ్చింది. పేదలకు ఉచితంగా అందాల్సిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(పిడిఎస్) బియ్యాన్ని తక్కు వ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్ముకుంటూ అక్రమ లాభాలు పొందుతున్న వ్యాపారం బయటపడింది. వరంగల్ టాస్క్‌ఫోర్స్, నెక్కొండ సివిల్ పోలీసుల సంయుక్త చర్యల్లో గర్నేపల్లి జితేందర్ రెడ్డి(44), తండ్రి రాజిరెడ్డి, వృత్తి వ్యాపారం, నివాసం పనికర గ్రామం, నెక్కొండ మండలం అనే వ్యక్తిని పట్టుకున్నారు. నెక్కొండ గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా వెంకటేశ్వర ట్రేడర్స్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్న అతడు, చుట్టుప్రక్కల గ్రామాల్లోని రేషన్ కార్డుదారుల వద్ద నుండి పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం మేరకు షాపులో తనిఖీలు నిర్వహించగా 140 తెల్ల బ్యాగుల్లో నిల్వ ఉంచిన సుమారు 70 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం బయటపడ్డాయి. బియ్యం విలువ సుమారు రూ.1లక్ష 82వేలుగా అంచనా వేశారు. పేదలకు చేరాల్సిన ప్రభుత్వ సహాయాన్ని దారి మళ్ళించి లాభాలు దోచుకున్న ఈ వ్యవహారంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. నేరస్తుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు నెక్కొండ ఎస్ఐ ఎం.మహేందర్ తెలిపారు. ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తప్పవని, పేదల హక్కులను కాపాడేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు దాడులు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## పురపాలక ఎన్నికల్లో ఏర్పాట్లు పూర్తి




జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పురపాలక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, మున్సిపల్ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి అంబేద్కర్ స్టేడియంలోని బ్యాలెట్ బాక్స్‌లు నిల్వచేయడానికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఓట్లు లెక్కింపు కొరకు ఏర్పాటు చేయనున్న సింగరేణి మినీ ఫంక్షన్స్ హాల్‌ను పరిశీలించి కౌంటర్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఓటర్లు నిర్భయంగా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రులు రాజకీయంగా ఎదగాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** గంగపుత్రులు సామాజికంగా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని అప్పుడే హక్కులు సాధించుకుంటారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నగరంలోని ములుగు రోడ్డులోని గంగా గార్డెన్‌లో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర(బెస్త) సంఘం వరంగల్ జిల్లా 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పాక ఓం ప్రకాష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఏ ముఠా గోపాల్ మాట్లాడుతూ గంగపుత్రులు తమ వృత్తిని(చేపలు పట్టడం, అమ్మడం) కాపాడుకుంటూ ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను గంగపుత్రులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి మాట్లాడుతూ ముదిరాజులకు మంద బలం ఉండవచ్చు కానీ, గంగపుత్రులకు బుద్ధిబలం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ సనత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాక వెంకటేశ్వర్లు, డైరీ కన్వీనర్ పద్మ మహిపాల్, రాష్ట్ర యువజన అధ్యక్షులు అంబటి మల్లయ్య సుధాకర్, గోపు సుధాకర్, తత్తరి లక్ష్మణ్, గుంటి కొమురెల్లి, దగ్గుల శంకర్, చెరుకు సత్యనారాయణ, కమిటీ నాయకులు, గంగపుత్ర సంఘీయులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర

ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కమిటీ సభ్యుడు పనస ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కమిటీ సభ్యుడు పనస ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్‌లు అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 26వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కమిటీ సభ్యుడు పనస ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయన్నారు. కనీసం సంక్షేమ హాస్టల్లో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీలో రాబోయే బడ్జెట్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అంకెలు పెరిగినప్పటికీ బడ్జెట్ మాత్రం విద్యారంగానికి నిరాశ కలిగించిందన్నారు. ప్రభుత్వ రంగంలో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, వరంగల్ లో ప్రభుత్వ హోమియోపతి దంత వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు ఉత్త భవనాలు నిర్మించాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని తీర్మాణించారు. వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం 8 మందితో, జిల్లా కౌన్సిల్ 21 మందితో ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా దిడ్డి పార్థసారథి, ఉపాధ్యక్షులుగా సిహెచ్ హరీష్, భరత్, జిల్లా కార్యదర్శిగా ల్యాదళ్ల శరత్, సహాయ కార్యదర్శిగా శివ, పాలక పవన్, కోశాధికారి మేకల అభిరామ్, జిల్లా కమిటీ సభ్యులు నిఖిల్, రమేష్, సంతోష్, ప్రభాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో నిర్వహించనున్న వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆలయ పరిసరాలను సందర్శించి, భక్తులకు అందించే సౌకర్యాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకల మార్గాలు వంటి విషయాలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రుద్రేశ్వర స్వామి వారిని దర్శించుకుని వేదమంత్రాల సాక్షిగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. తదనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేయి స్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, ఆలయ ఈఓ అనిల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నేడు జరిగే మున్సిపల్ నేపథ్యంలో స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సామాగ్రి పంపిణీ జరుగుతున్న తీరుపై పోలీస్ సంబంధిత అధికారులను వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఇదే కళాశాలలో ఏర్పాటు ఎన్నిక లెక్కింపు కేంద్రాలతో పాటు, బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పోలీస్ కమిషనర్ అడిషినల్ కలెక్టర్ పింకేష్ కుమార్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలసి పరిశీలించారు. ముఖ్యంగా ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లపై పోలీస్ సంబంధిత రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేయగా, లెక్కింపు సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై పోలీస్ కమిషనర్ ఘన్పూర్ ఏసిపి భీం శర్మకు అదేశాలు జారీచేసారు. ఎవరూ కూడా ఎన్నికల నియమాలను అతిక్రమించకుండా జాగ్రత్త పడాలని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను అదేశించారు. పోలీస్ కమిషనర్ వెంట స్థానిక ఏసిపి అనంతయ్య, ఇన్స్‌స్పెక్టర్లు వేణు, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమోహన్‌తోపాటు ఎస్.ఐలు ఇతర పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన




జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ములుగు :** బుధవారం జరగనున్న ములుగు మున్సిపాలిటీ ఒకటవ పోలింగ్ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు విలువైన తమ ఓటును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్ళనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే రూట్, మానటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని వివరించారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడానికి ఓటర్లు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఎంఎస్‌వై నిధుల విడుదలలో జాప్యం

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎం ఎస్‌వై) కింద తెలంగాణకు మంజూరైన నిధులను విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఇది మత్స్యకారుల సంక్షేమంపై కేంద్రానికి ఉన్న నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. మంగళవారం వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డైరీ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఇచ్చిన సమాధానమే కేంద్రం వైఖరిని బయటపెట్టిందని డాక్టర్ కావ్య పేర్కొన్నారు. 2020–21 నుంచి తెలంగాణకు రూ.196.80 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినా, కేంద్ర వాటా రూ.68.14 కోట్లలో గత మూడు సంవత్సరాల్లో కేవలం రూ.13.34 కోట్లు మాత్రమే విడుదల చేశారని పేర్కొన్నారు. 2022–23లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. హ్యాచరీలు,ఆర్ఏఎస్ యూనిట్స్, కేజ్ కల్చర్, మినీ ఫీడ్ మిల్స్, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లకు కాగితాలపై ఆమోదాలు ఇస్తూ, క్షేత్రస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల వరంగల్, హనుమకొండ పరిసర జిల్లాల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీ కావ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,54,432 మంది లబ్ధిదారులు ఉన్నారని చెబుతున్న కేంద్రం, నిజంగా మత్స్యకారులకు మేలు చేయాలనుకుంటే వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేయాలన్నారు. హైదరాబాద్‌లో ఆధునిక చేపల మార్కెట్, ఫిష్ కియాస్కులు, వాహనాలు వంటి కార్యక్రమాలను గొప్పగా ప్రచారం చేసుకుంటున్న కేంద్రం, వరంగల్ వంటి ప్రాంతాలను విస్మరించారని పేర్కొన్నారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు వదిలిపెట్టేది లేదని వరంగల్ ఎంపీ కావ్య స్పష్టం చేశారు.

## జనగామలో పోటాపోటీగా నగదు పంపిణీ?



**ప్రజాపక్షం/జనగామ :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జనగామలో డబ్బుల వరద పారింది. ఓటుకు రెండు నుండి ఆరు వేల వరకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల డబ్బులతో పాటు చీరలు, స్వీట్ బాక్స్‌లు ఇచ్చినట్లు సమాచారం. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూర్ లాంటి మున్సిపాల్టీలో ఓటుకు ఇరవై వేలకుపైగా పంపిణీ చేసిన పరిస్థితి. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేసి కట్టడి చేసే ప్రయత్నం చేసినప్పటికి వారి కళ్లు గప్పి అభ్యర్థులు డబ్బు పంపిణీ చేశారు.

జనగామ జిల్లాలో రెండు మున్సిపాల్టీలో ఉన్నాయి. జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఈ జిల్లాలోనే ఉండగా జనగామ నియోజకవర్గ పరిధిలో చేర్యాల, పాలకుర్తి మున్సిపాల్టీ పరిధిలో తొర్రూర్ మున్సిపాల్టీ ఉంది. జనగామ మున్సిపాల్టీలో 44వేల 45 మంది ఓటర్లు ఉండగా 30 వార్డులు, స్టేషన్‌ఘనపూర్‌లో 18వేల 550 మంది ఓటర్లు ఉండా 18 వార్డులు ఉన్నాయి. ఇందు కోసం 80 మంది ప్రిసైడింగ్ అధికారులతో పాటు 240 మంది ఇతర పోలింగ్ అధికారులను, స్టేషన్‌ఘనపూర్‌లో 44 మంది ప్రిసైడింగ్ అధికారులతో పాటు 132 మంది పోలింగ్ సబ్బందిని నియమించారు. జనగామ మున్సిపాల్టీలో 28 మంద, స్టేషన్‌ఘనపూర్‌లో 9 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

**పోలింగ్‌కు కట్టుదిష్టమైన ఏర్పాట్లు**

ఇక పోలింగ్‌కు అధికారులు కట్టుదిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జనగామలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్య గొడవలు జరిగాయి. పోలీసులు కేసులు నమోదు చేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లోనూ గొడవలు జరిగే అవకాశాలు ఉంటాయని ముందే భావించిన పోలీసులు కట్టుదిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. నలుగురు, నలుగురు ఎసిపిలు, 8 మంది సిఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు రెండు వందల మందికి పైగా పోలీసులను భద్రత కోసం దింపారు. స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టిని పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సందర్శించి భద్రత ఏర్పాట్లు, పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.



## శాయంపేట పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఓ తనిఖీ

**ప్రజాపక్షం/శాయంపేట :** హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య మంగళవారం శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. 8 అంశములలో మహిళలకు పరీక్షలు, అలాగే మహిళలకు సంబంధించిన అంశాలపై వారికి అవగాహన కలిగించాలని, రెఫర్ చేసినటువంటి మహిళలను ఫాలో అప్ చేస్తూ వారికి తగిన సేవలు అందించాలన్నారు. అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతిని ఆయన సమీక్షించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన అవసరమైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన పాటించాలని, తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలి అని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, వారికి 4 చెకప్‌లు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి ప్రోత్సహించడం ప్రసవానంతరం వారికి తగిన ఫాలో అప్ సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మౌనిక కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతిని వివరించారు.

## ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి



జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రాముఖ్యత, విధుల నిర్వహణలో పాటించాల్సిన నియమాలు, సిబ్బంది చేయవలసిన, చేయకూడని అంశాలపై అడిషనల్ ఎస్పీ సమగ్రంగా వివరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ,సిఐలు ఆర్ఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు. పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సామగ్రి పంపిణీ కేంద్రాలు పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 5మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్, వ్యయ పరిశీలకులు జి. శ్రీనివాస్, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు స్వయంగా పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డోర్నకల్ నిర్మల హై స్కూల్ రైల్వే హాస్పిటల్, కేసముద్రం ఏఎంసీ మార్కెట్, తొర్రూరు ఆర్యభట్ట హై స్కూల్,మరిపెడ సెంట్ అగస్టీన్ హై స్కూల్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి ఎన్నికల సామాగ్రి తీసుకొని బయలుదేరుతున్న పోలింగ్ సిబ్బంది వారు పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో వయోవృద్ధులకు, దివ్యాంగులకు వీల్ చైర్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిధిలలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించారు.

## చట్టాలు యథావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సిపిఐ మండల సమావేశం నాయకులు వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా రమేష్ హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు యాకూబ్ పాషా, వేల్పుల పెద రాములు, విష్ణు,అజయ్,రాజు, సత్తయ్య పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలశ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగిస్తుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇండస్ట్రీయల్ పార్కుల్లో స్థలాల కేటాయింపు, ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు, యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు, అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. అభివృద్ధిని కొనసాగించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పోలింగ్ సరళి పరిశీలనకు కలెక్టరేట్‌లో ఐదు స్క్రీన్లు

జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు మున్సిపాలిటీకి ఒకటి చొప్పున కలెక్టరేట్‌లో ఐదు స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనిచేస్తున్నాయో లేవో చివరిగా క్రాస్ చెకింగ్ చేసుకోవాలని డిఆర్‌వో సంబంధిత అధికారులకు సూచించారు.

## నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నేడు జరగనున్న ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికలకై ఎన్నికలసంఘం సర్వం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో 6వ వార్డులోని మేధ కళాశాల కేంద్రంగా మంగళవారం ఎన్నికల సామగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. 32వార్డులకు గాను ఒకవార్డు ఏకగ్రీవం కాగా 31వార్డుల్లో పోలింగ్ జరగనుంది. 69పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా..12మంది జోనల్ ఆఫీసర్లతో పాటు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఆర్ఒ, ఎఆర్ఒ కలిపి ఏడుగురు అధికారులు పోలింగ్ బాధ్యత నిర్వహించనున్నారు.కాగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, కమిషనర్ మున్వర్‌అలీ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సంఘాల నేతలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేసే పనిలో ఉన్న ఉద్యోగ సంఘాల నేతలపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి బిఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని మంత్రి పొంగులేటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలను విధుల నుంచి తప్పించాలని వారు కోరారు. ఇందుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలని కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు తాతా మధు, మాజీ ఎంఎల్ఎ బానోత్ చంద్రావతి, బిఆర్‌ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## వంచన చేసిన కాంగ్రెస్‌ను ఓడించండి

బిఆర్‌ఎస్ నేతలు వద్దిరాజు, తాతా మధు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజలను వంచించిన కాంగ్రెస్‌ను మున్సిపల్ ఎన్నికలలో ఓడించాలని బిఆర్‌ఎస్ నేతలు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణాలను అభివృద్ధి పరిచిన బిఆర్‌ఎస్‌ను గెలిపించి మరోసారి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మంగళవారం బిఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం గడ్డపై కాంగ్రెస్ రాక్షస రాజకీయం తప్ప అభివృద్ధి శూన్యమని ఆరాచకం పెరిగిపోతుందని ఆరోపించారు. కేసిఆర్ పదేళ్ల అభివృద్ధికి, రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ వంచనకు మధ్య ఉన్న తేడాలు గమనించాలని ఆయన కోరారు. తాతా మధు మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి ప్రస్తుత కాంగ్రెస్ పాలన ఆరాచక పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. ముగ్గురు మంత్రులు ఉండి కూడా అభివృద్ధి చెప్పకోలేక ప్రలోభాలకు తెర లేపారన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. మీడియా సమావేశంలో మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, రూరల్ మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ పాల్గొన్నారు.

# నేడే మున్సిపోల్స్.. పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఏడు మున్సిపాలిటీలు..

కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఎన్నికలు

బరిలో 943 మంది



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు ఒక కార్పొరేషన్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు, కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఏదులాపురంలో 32 వార్డులకు గాను 45,256 మంది ఓటర్లు ఉండగా వైరాలో 20 వార్డులలో 24,689 మంది, మధిరలో 22 వార్డులకు గాను 25,679 మంది ఓటర్లు ఉన్నారు. సత్తుపల్లిలో 23 వార్డులకు గాను 28,830 మంది, కల్లూరులో 20 వార్డులకు గాను 18,866 మంది ఓటర్లు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 వార్డులకు గాను 1,34744 మంది ఓటర్లు ఉండగా ఇల్లందులో 24 వార్డులకు గాను 33,723 మంది ఓటర్లు, అశ్వారావుపేటలో 22 వార్డులకు గాను 36,850 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 943 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 117 వార్డులకు గాను 414 మంది బరిలో ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉండగా ఇల్లందులో 24 వార్డులకు 107 మంది, అశ్వారావుపేటలో 22 వార్డులకు 68 మంది రంగంలో ఉన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 109 మంది, వైరాలో 80 మంది, సత్తుపల్లిలో 84 మంది, కల్లూరులో 71 మంది, మధిరలో 70 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల అధికారులు సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఎక్కడా ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఓటర్లకు కూడా ఇబ్బందులు కలగని రీతిలో ప్రశాంతంగా ఓటు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రెండు మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పోలింగ్ నిర్వహణకు 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిలో 94 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు గాను మొత్తం 241 మంది ప్రిసైడింగ్ అధికారులు, 723 మం ది ఒపిఒలను కేటాయించారు. ఇల్లందు మున్సిపాలిటీలో 62 మంది ఎన్నికల అధికారులు 241 మంది సిబ్బందిని నియమించారు.

అశ్వారావుపేటలో 42 మంది ఎన్నికల అధికారులు, 126 మంది సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఖమ్మంజిల్లాలో 117 వార్డులకు గాను 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఇందు కొరకు 295 మంది ఎన్నికల అధికారులు, 900 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పోలింగ్ అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు, కల్లూరు మున్సిపల్ బ్యాలెట్ బాక్స్‌లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, మధిర మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను పాలిటెక్నిక్ కళాశాల ఖాజీపురం, సత్తుపల్లి మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను జ్యోతి నిలయం పాఠశాలకు, వైరా మున్సిపల్ బ్యాలెట్ బాక్స్‌లను వెటర్నరీ ఆసుపత్రికి తరలించనున్నారు. స్ట్రాంగ్ రూములను, లెక్కింపు కేంద్రాలను పైన పేర్కొన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు.

## ఆ ఆడియో ఎలా లీకైంది ?

అంతర్మథనంలో ఉద్యోగ సంఘాల నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గతంలో ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితమై పనిచేసేవి. ఇటీవల కాలంలో ఉద్యోగ సంఘాల నేతలు పదవీ విరమణ అనంతరం ప్రజాప్రతి నిధులుగా ఎన్నిక అవుతుండటం లేదా వివిధ రాజకీయ హోదాలలో పనిచేస్తుండడంతో చాలా మంది నేతలకు రాజకీయ పీఠాలపై ఆశలు మొలకెత్తాయి. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలకు మద్దతుగా తమ వెనక ఉన్న ఉద్యోగులను నడిపించడం జరుగుతుంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఏదులాపురం మున్సిపాలిటీకి సంబంధించి ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి మాట్లాడిన ఆడియో ఒకటి సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్లు వేయిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు హామీ ఇవ్వడం రాజకీయ చర్చకు దారి తీసింది. ఎక్కడలేనివిధంగా ఏదులాపురం మున్సిపాలిటీలో కొందరు ఉద్యోగులు ఏదో ఆశించి ఉద్యోగులను తమ స్వప్రయోజనం కోసం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ విధుల్లో ఉండి ఇటీవల మంత్రికి అనుకూలంగా నినాదాలు చేసిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఏకంగా పొంగులేటి నాయకత్వం వర్థిల్లాలంటూ ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగి నినదించడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు తాజాగా ఆడియో లీకేజీ వెనక ఉద్యోగుల్లో ఎవరైనా ప్రభుత్వ వ్యతిరేకులు ఉన్నారా అన్న దానిపై ఉద్యోగ సంఘాల నేతలు అంతర్మథనంలో ఉన్నారు. మంత్రితో మాట్లాడిన నేతల్లో ఎవరు ఆ ఆడియోను లీక్ చేశారనే దానిపై ఇప్పుడు చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఏదులాపురం మున్సిపాలిటీ కేంద్రంగా ఉద్యోగ సంఘాల నాయకులు గడిచిన ఆరు నెలలుగా ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి కాంగ్రెస్ సానుకూల కార్యక్రమాలు చేశారని బిఆర్‌ఎస్ ఆరోపిస్తుంది. ఈ విషయమై బిఆర్‌ఎస్ ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. మొత్తంగా ఆడియో ఇప్పుడు రాజకీయ చర్చకు, ఉద్యోగ సంఘాల్లో అంతర్గత చర్చకు దారి తీసింది.

## ప్రజల పక్షాన నిలిచే వారిని.. గెలిపించండి: బాగం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడే వారిని సిపిఐ బరిలో నిలిపిందని ఆయన తెలిపారు.ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల తో పాటు కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేటలో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఎన్నికలంటే డబ్బు పంపిణీగా మారిపోయిందని ప్రస్తుత ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న వారు మళ్లీ పదవుల ద్వారా ఆర్థిక లబ్ది పొందేందెకు ప్రయత్నిస్తారని దీనిని ఓటర్లు గమనించాలన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలిచి పనిచేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన అన్నారు. అందుబాటులో ఉండే వారిని గెలిపించడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని హేమంతరావు కోరారు. విజ్ఞతతో ఆలోచించి కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపిస్తే ఆయా మున్సిపాలిటీల్లో ప్రజా గొంతుకగా పనిచేస్తారని ఆయన తెలిపారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్త-గూడెం :** ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో ని ర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎన్నికల సా మాగ్రి పంపిణీ కేంద్రాలైన పాల్వంచ అనుబోస్ కాలేజీ, ఇల్లెందు సింగరేణి పాఠశాలలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల సామాగ్రి పూర్తిగా అందిందా లేదా అనే విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రధానంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో పోలీస్ బందోబస్తు తప్పనిసరిగా ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే తనకు తెలపాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి పెన్షనర్ల రిలే నిరాహార దీక్షలు

జాతీయ సార్వత్రిక సమ్మెకు మద్దతు

ఎస్‌జిపిఎటి జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి) ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య తెలిపారు. మంగళవారం కృషి భవన్‌లో జరిగిన ఎస్‌జిపిఎటి జిల్లా ఆఫీస్ బేరర్స్, ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ఈనెల 12న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్‌జిపిఎటి మద్దతునిస్తుందని తెలిపారు. పెన్షన్ బకాయిలు తీసుకోకుండానే పలువురు పెన్షనర్లు తనువు చలించారని అయినా ప్రభుత్వం పెన్షనర్ల పట్ల వైఖరి మారలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పెన్షనర్లు ఉద్యమబాట పడుతున్నారని పుల్లయ్య తెలిపారు. రెండేళ్లుగా పెన్షనర్లు హెల్త్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పిఆర్‌సి గడువు తీరిన ప్రభుత్వం స్పందించడం లేదని, డిఏ బకాయిల చెల్లింపుల్లో కూడా అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. ఇప్పటికైనా పెన్షనర్ల డిఏ బకాయిలు నగదు పూర్వకంగా ఒకే విడతలో చెల్లించాలని ఎస్‌జిపిఎటి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, శ్యాంసుందర్, మహిళా కార్యదర్శులు బోజడ్ల కృష్ణకుమారి, అంజలి, రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, కనపర్తి నాగప్రసాద్, వీరభద్రరావు, వెంకటేశ్వర్లు, వై. రామకృష్ణ, వెంకట్రామ నర్సయ్య, రామారావు, సాగర్, ఉషారాణి, హమీద్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఎన్నికల నియమావళి ఉల్లంఘున జరగకుండా

పకడ్బందీ ప్రణాళికతో పోలీసుల విధులు

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పోలీసులు పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకులోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వమించాలని, పోలింగ్ కేంద్రాలను వదివెళ్లవద్దని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందని గ్రహించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్,ఫ్లైయింగ్‌స్క్వార్డ్‌టీమ్స్, చెక్‌పోస్టులు, రూట్ మొబైల్‌పార్టీలు, ఎన్నికలముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదే విధంగా పోలింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదు మున్సిపాలిటీలలో 11వందల మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారని అన్నారు. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(ఎఆర్) కుమారస్వామి, ఎసిపి తిరుపతిరెడ్డి, నర్సయ్య, రూరల్ డివిజన్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## 'అంతర్జాల' వినియోగంపై అవగాహన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సురక్షిత అంతర్జాల వినియోగం, కృత్రిమ మేథస్సు (ఏఐ)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సురక్షిత అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సురక్షిత అంతర్జాల వినియోగం, కృత్రిమ మేథస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురక్షిత అంతర్జాల వినియోగంపై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అవగాహన సదస్సులో జాతీయ సమాచార కేంద్రం జిల్లా అధికారులు డిఐఒ రాంప్రసాద్, ఎడిఐఒ బిక్షు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ భద్రత, ధృడమైన సంకేత పదాలు (పాస్‌వర్డ్) వినియోగం, ద్విపాత్రిక ధృవీకరణ విధానం, సురక్షిత అంతర్జాల విహారం (వెబ్ బ్రౌజింగ్) సైబర్ నేరాల ఫిర్యాదు విధానాలు, ఆన్‌లైన్ మోసాల నివారణ, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం అరికట్టడం, వ్యక్తిగత సమాచార రక్షణ, హ్యాకింగ్, మోసపూరిత సందేశాలు, సురక్షిత డిజిటల్ ఆచరణ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మార్పు తథ్యం!

పాలనలో పారదర్శకత కోసం

కూనంనేని వైపు ప్రజల చూపు

**ప్రజాపక్షం/పాల్వంచ :** 30 ఏండ్లుగా ఎన్నికల మోహం ఎరుగని పాల్వంచ ప్రజలు నేడు నూతనంగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పట్టణానికి ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వైపు ప్రజలు చూస్తున్నారు. ఎన్నికలు తీసుకురావటానికి ఆయన చేసిన త్యాగానికి ప్రజలు జై కొడుతున్నారు. నూతనంగా కొలువుదీరే కార్పొరేషన్‌లో నిధుల సద్వినియోగానికి ఒక్కసారి సిపిఐకి ఛాన్స్ ఇవ్వాలనే మార్పు ప్రజల్లో వచ్చేసిందని తెలుస్తోంది. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలపై ముందుండి పోరాటం చేసే సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా నాయకత్వానికి జేజేలు పలుకుతున్నారు. మూడు దశాబ్దాలుగా పాల్వంచ మున్సిపాలిటికి ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధిలో అనుకున్న మేర వెనుకబడిపోయింది. అధికారుల పాలనలో అస్థవ్యస్థంగా మారింది. పట్టణ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై పారదర్శకత కొరవడింది. కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత మచ్చుకైనా కాన రావటంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి సమస్య రోజు రోజుకు ముదిరిపోతున్నది. డంపింగ్ యార్డ్ సమస్య తీవ్ర తరమవుతున్నది. వీటన్నింటికి చెక్ పడాలంటే సిపిఐ గెలుపు కావాలంటున్నారు ఓటర్లు. కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి కోట్ల నిధులు తెచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. త్వరలో కార్పొరేషన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.150 కోట్ల పనులు చేపట్టనున్నారు. పాల్వంచను పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్యను తీర్చటానికి సుమారు రూ.450 కోట్లతో రెండు బైపాస్ రహదారుల నిర్మాణాలు. అందులో పాల్వంచ కెటిపిఎస్ జెన్‌కో కాలనీ నుండి పాండురంగాపురం గ్రామం మీదుగా బూర్గంపాడు మండల పినపాక వరకు జరిగే పనులు త్వరలో పూర్తి కానున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో రహదారులు, తాగునీటి సమస్య, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం తీవ్రమైన కృషి చేస్తున్నారు. ఎక్కడా లంచాలు, దందాలు, అవినీతి మరకలు లేకుండా తన పాలనలో మార్క్‌ను చూపెడుతున్నారు. అధికారం కోసం పార్టీలు మారేవారి పట్ల ప్రజలు అంతర్గతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారిని పక్కన పెట్టి ఒకే జెండా మోసేవారిని జైకొట్టాలంటున్నారు. దీనితో పాల్వంచ పట్టణం అభివృద్ధి కావటానికి ఆస్కారం ఉంటుందని అనుకోవటం సిపిఐకి కలిసి వచ్చే సానుకూల అంశంగా మారుతోంది.



ఫైల్ ఫోటో

**కూనంనేని నాయకత్వానికి జేజేలు :** అధికార వికేంద్రీకరణ కోసం, పరిపాలనా సౌలభ్యం కోసం, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారు. అధికార పార్టీ ముసుగులో కొందరు చేస్తున్న కారు కూతల వలన ప్రజలు విసిగిపోతున్నారు. ఓటేస్తే గానీ పనులు చేయమంటున్న అధికార పార్టీ నాయకుల తీరు పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది ఓ రకంగా బ్లాక్‌మెయిల్ రాజకీయాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాల్లో బిఆర్‌ఎస్ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలు చేతివాటం ప్రజలు మదిలో పదిలంగా గూడుకట్టుకొని ఉండనే ఉన్నాయి. పదేండ్లుగా అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ పాలనలో ఎన్నో అవమానాలను, కష్టాలను భరిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అధికారం కోల్పోగానే పలువురు నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుకొన్నారు. దీనితో పాత, కొత్త కాంగ్రెస్ వాదుల మధ్యన కోల్డ్ వార్ మొదలైనది. పాత వారిని కాదని కొత్తవారికే పెద్దపీట వేస్తున్నారని అసంతృప్తితో రగిలిపోతున్నారు. వారికి సరైన బుద్ధి చెప్పటానికి పాల్వంచలో జరుగుతున్న ఎన్నికలను పావుగా వాడుకొంటున్నారు. ఎలాగైనా కొత్తగా వచ్చిన వారిని ఓడించటానికి కాంగ్రెస్‌లోని ఓ వర్గం చాపకింద నీరులా పరోక్షంగా బలమైన పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అంతర్గతంగా సహకారం అందిస్తున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. దీనితో పాల్వంచలో సిపిఐ, తెలుగుదేశం, ప్రజా సంఘాలు బలపరిచిన వారి గెలుపు నల్లేరు మీద నడకే అంటున్నారు.

"రాజశ్యామల బ్యానర్‌పై సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో మధు కాలిపు నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం మహేంద్రగిరి వారాహి. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశాన్ని ఆధారంగా చేసుకుని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ఈ సినిమాను రూపొందిస్తున్నారు."

రీల్

# శివ, మిత్రతో యాక్టింగ్ వెరీ ఇంట్రెస్టింగ్

ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో హీరో సంతోష్ శోభన్



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొ మాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటై న్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొ డ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా టై టిల్ మార్చమని సెన్సార్ వారు అడిగారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది. సంతోష్ శోభన్ ఈ మూవీ కో సం పడిన కష్టం మీకు మూవీలో కనిపిస్తుంది. ధీరజ్ గారు మా టీమ్ లోకి వచ్చాక చాలా ఎనర్జీ వచ్చింది. హీరో సం తోష్ శోభన్ మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీకి ప్రతి ఒక్కరూ తమ సపోర్ట్ అ ందిస్తున్నారు. రీసెంట్ గా మేము చేసిన ప్రమోషనల్ టూర్ కు మ ంచి రెస్పాన్స్ వచ్చింది. నాకు సక్సెస్ రావాలని ప్రతి ఒక్కరు కోరు కుంటు న్నారన్నారు.

# అనిల్ రావిపూడి శిష్యుడు డైరెక్టర్‌గా ' హై '

అనిల్ రావిపూడి దగ్గర అసోసియేషన్ గా పని చేసి అతని చిత్రాలకు సహ రచయితగా పని చేసిన ఎస్ కృష్ణ 'హై' అనే సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రచయిత, నటుడు , సహ నిర్మాతగా కూడా పనిచేస్తున్నారు. ఇమేజ్ స్పార్క్స్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ పై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనన్య శర్మ, ఎస్ కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయి కృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) ఈ చిత్రంలో ప్రధాన తారాగణం. ఈ చిత్ర టీజర్‌ను హీరో వెంకటేష్ లాంచ్ చేశారు.టీజర్ లాంచ్ ఈవెంట్ లో అనిల్ రావిపూడి మాట్లాడుతూసాయి ఈ సిని మా కోసం చాలా కష్టపడ్డాడు. నా సినిమాలకు పనిచేస్తూ గ్యాప్ లో ఈ షూటింగ్ చేసేవాడు. ఒక బెస్ట్ ఫ్రెండ్ గా నా విషెస్ ఎప్పుడు తనకు ఉంటాయి. తను మంచి టెక్నీషియన్ గా ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీలో ఉండాలని కోరుకుంటున్నాను. తను యాక్టర్‌గా కూడా సక్సెస్‌ఫుల్ అ య్యా డు. మంచి జడ్జిమెంట్ ఉన్న టె క్నీషియన్. ఒక కొత్త జానర్ లో డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో తీసిన



సినిమా ఇది. సినిమా డబుల్ పాజిటివ్ చూశాను. ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ స్క్రిప్ట్ విషయంలో సినిమా విషయంలో అనిల్ తో ఫైట్ చేసే కెపాసిటీ ఉన్న వ్యక్తి సాయి. ఇంత మందిని ఇంట్రడ్యూస్ చేయడం అనేది రియల్లీ హాట్సాఫ్. ఈ సినిమా అందరికీ హై రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ యాక్టర్ రైటర్ ప్రొడ్యూసర్ నాలుగు పాత్రలతో పరిచయం అవుతున్న సాయికి మరోసారి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రొడ్యూసర్ సురేష్ బాబు మాట్లాడుతూ అనిల్ రియల్ ట్రూ ఫ్రెండ్స్. వెంకటేష్ తో సినిమా చేస్తున్నప్పుడు వాళ్ళ వర్కింగ్ స్టైల్ చూశాను. సాయి చాలా పాషన్ పర్సన్. యాక్టర్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ ఎస్ కృష్ణ మాట్లాడుతూఈ సినిమా చూసే వాళ్ళకి మంచి హై ఇస్తుంది ఇందులో పనిచేసిన ప్రతి ఆర్టిస్ట్ వాళ్ళ కెరీర్‌లో రెండేళ్లు నాకు ఇచ్చారు. ఈ సినిమా తీయడానికి నాకు రెండేళ్లు పట్టింది. వికాస్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. టీజర్ చూస్తున్నప్పుడు చాలా ఆన ందంగా అనిపించింది. ఒక డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో ఇంట్రెస్టింగ్ గా ఉండే మూవీ ఇది. ఈ సినిమాలో పనిచేసిన ఆర్టిస్టులు అందరికీ ఈ సినిమా మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. నిర్మాత హరీష్ పెద్ది కూడా పాల్గొన్నారు.

# 'నువ్వేలే' సాంగ్స్ లాంచ్

అద్వైత పిక్చర్స్ క్రియేషన్స్ సమర్పణలో ప్రముఖ కొరియో గ్రాఫర్ సత్య మాస్టర్ దర్శకత్వంలో అంకిత జాదవ్, రోహిత్ భోగ హీరో హీరోయిన్స్ గా నటించిన నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పేరుతో రెండు సాంగ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ పాటలకు కెకె రెడ్డి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. జయంత్ ఆర్యన్ సంగీతాన్ని సమకూర్చిన 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పాటలకు రాంబాబు గోసాల సాహిత్యాన్ని అందించారు. సింగర్స్ లిప్సిక, అదితి భావరాజు పాడారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సాయి రాజేశ్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, ఆషురెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్, డైరెక్టర్ సత్య మాస్టర్ మాట్లాడుతూ నేను ఒక ఈవెంట్ కోసం యూఎస్‌కు వెళ్లినప్పుడు ప్రొడ్యూసర్ కేకే రెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటికే ఈ సాంగ్స్ హిందీ వెర్షన్ రెడీగా ఉన్నాయి. తెలుగులో చేయాలనే ఆలోచనను వారు నాతో షేర్ చేసుకున్నారు. అలా 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' సాంగ్స్ ను తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం ప్రారంభించాం. నిర్మాత కేకే రెడ్డి మాట్లాడుతూ మా 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' సాంగ్స్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. హీరోయిన్ అంకిత జాదవ్ మాట్లాడుతూ నేను బాలీవుడ్ నుంచి వచ్చాను. అక్కడ మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తుంటాను. నేను చేసిన బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ ఇది. 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పాటలను న్యూయార్క్, షికాగోలో షూటింగ్ చేశాం. సత్య మాస్టర్ డైరెక్షన్ లో ఈ సాంగ్స్ చేయడం సంతోషంగా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ జయంత్ ఆర్యన్ మాట్లాడుతూ ఈ సాంగ్స్ ను మేము హిందీలో చేశాం అన్నారు. నటి ఆ షురెడ్డి లిరిసిస్ట్ రాంబాబు గోసాల, సింగర్ లి ప్సిక, డైరెక్టర్ సాయి రాజేశ్, డైరెక్టర్ శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పాల్గొన్నారు.



# 'శివోహం' పాటలో తనికెళ్ల భరణి



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాశివుడిని పూజిస్తూ రూపొందిన 'శివోహం' పాట ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో ఘనంగా జరిగింది. ఈ పాటను రాధాకేశవ్ సమర్పణలో పొత్తపు కేశవరెడ్డి నిర్మించారు. దాముురెడ్డి దర్శకత్వం వహించారు. యశోకృష్ణ సంగీతాన్ని అందించిన శివోహం పాటను ప్రసిద్ధ మలయాళ గాయకుడు మధు బాలకృష్ణన్ పాడారు. ఈ పాట తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కీర్తన టీవీలో అందుబాటులో ఉండనుంది. శివోహం పాట ఆవిష్కరణ కార్యక్రమానికి శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు, విద్యాశంకర భారతీ మహాస్వామివారు, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, నటుడు గౌతమ్ రాజు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు యశోకృష్ణ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శివోహం పాటను విడుదల చేయడం, ఈ పాటకు సంగీతాన్ని అందించే అదృష్టం నాకు దక్కింది. ప్రముఖ నటులు తనికెళ్ల భరణి మాట్లాడుతూ నేను పాతికేళ్ల క్రితం ఆటగదరా శివ అనే పుస్తకం రాశాను. అప్పటి నుంచి ఎక్కడ మహాశివుడి గురించి కార్యక్రమం జరిగినా నన్ను అతిథిగా పిలుస్తున్నారు. శివోహం పాటలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ పాటను ఈషా ఫౌండేషన్ ప్రాంగణంలో చిత్రీకరించే అవకాశం కలిగింది. ఈషా శైలజతో మాట్లాడి నేనే పర్మిషన్ ఇప్పించాను.. యశోకృష్ణ బాగా కంపోజ్ చేశారు. ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ నాతో తొలి పాట రాయించిన వారు తనికెళ్ల భరణి. ఆయన ప్రోత్సాహం లేకుంటే నేను ఇండస్ట్రీకి రాకపోయేవాడిని. ఆయన సమక్షంలో, శంకరభారతి స్వామివారి సమక్షంలో శివోహం పాట ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. అర్ధనారీశ్వరుడిగా మనకు శివుడు ఎందుకు దర్శనమిస్తాడంటె భార్య భర్త ఎలా కలిసి ఉండాలో చెప్పేందుకు. ఇలాంటి గొప్ప సందేశం శివుడు మనకు అందిస్తాడు. ఈ పాట నేను రాసిన తర్వాత యశోకృష్ణ స్వరపర్చాడు. ఇలాంటి ఒక మంచి భక్తి గీతాన్ని మీరంతా విని ఆనందించాలని కోరుకుంటున్నా. అన్నారు.

# 'గాయపడ్డ సింహం'టైటిల్‌కు ఫిదా



డిఫరెంట్ ఎంటర్టైనర్స్ తో అలరిస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి మరో యూనిక్ మూవీతో రాబోతున్నారు. 'గాయపడ్డ సింహం' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియావర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌తో ఫన్ ఫిల్డ్ టీజర్ విడుదల చేశారు. చిన్నప్పటి నుండి అమెరికాకు వెళ్లాలని కలలు కనే ఒక యువకుడి కథ ఇది. అతని కోరిక చివరికి నెరవేరుతుంది, ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్తాడు. కానీ అతని ఆనందం ఎక్కువ కాలం నిలవదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అకస్మాత్తుగా అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్ ఆపరేషన్‌ను ప్రకటిస్తాడు. ఈ కష్టాన్ని హీరో ఎలా ఎదుర్కొంటాడు, మనుగడ కోసం ఎలా పోరాడతాడు అనేది కథ ప్రధానాంశం. తరుణ్ భాస్కర్ తన కామెడీ టైమింగ్ అలరించారు. ఫరియా అబ్దుల్లా,శుభలేఖ సుధాకర్ కథను కేజీఎఫ్ తరహాలో వివరించ నవ్వులని పంచింది. మానస చౌదరి తరుణ్ లవర్ పాత్రలో నటిస్తుంది. విష్ణు ఓయ్ అతని స్నేహితుడిగా కనిపించారు. విద్యా సాగర్ చింత సినిమాటోగ్రఫీ, స్వీకర్ అగస్తి సంగీతం సినిమా మూడ్‌ను అద్భుతంగా ఎలివేట్ చేశాయి. విప్లవ్ నైషధం ఎడిటర్, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైనర్, కథను సూర్య ప్రకాష్ జోస్యుల రాశారు. ఈ సినిమా వేసవిలో సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ లాంచ్ సందర్భంగా హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. కొంతమందికి అమెరికా వెళ్లాలని లక్ష్యం ఉంటుంది. ఆ యూనిక్ ట్రీట్మెంట్ కి ఫిదా అయిపోయాను. ఆడియన్స్ కూడా ఫిదా అవుతారని నమ్మకం ఉంది.కశ్యప్ చాలా యూనిక్ వాయిస్ ఉన్న డైరెక్టర్. తన సెన్సాఫ్ హ్యూమర్ చాలా యూనిక్‌గా ఉంటుంది. తనకి ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది. స్క్రీన్ లో చూసినప్పుడు నవ్వుతూనే ఉంటారు. హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. సినిమాని ఒక ఆడియన్ గా విన్నాను. చాలా ఫన్నీగా ఉంటుంది. చాలా అద్భుతమైన కథ ఇది. డైరెక్టర్ చాలా చక్కగా తీశారు. తరుణ్ తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీరందరూ ఎంజాయ్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కశ్యప్, నిర్మాత విజయ్ కృష్ణ , సహ నిర్మాత భాను కిరణ్ పాల్గొన్నారు.

# సిఎంకు బండి సంజయ్ బహిరంగ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పదవీ విరమణ చేసినా ప్రయోజనాలు అందక 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని, వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వెంటనే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకపోతే హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేస్తానని బండి సంజయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నెట్‌వర్క్ ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారించుకోవాలని భాటికి సుప్రీంకోర్టు సూచించింది. సీనియర్ న్యాయవాది అపర్ణ భట్ మాట్లాడుతూ కేంద్రం చొరవ తీసుకుని అన్ని రాష్ట్రాలకు డేటాను అందించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అనేక రాష్ట్రాలలో జాడ తెలియకుండా పెరిగిపోతున్న పిల్లల సంఖ్యను ఎత్తిచూపుతూ ఒక ఎన్‌జిఒ 'గురియా స్వయం సేవి సంస్థాన్' దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తప్పిపోయిన పిల్లలకు సంబంధించి ఆరు సంవత్సరాలకు సంబంధిత జాతీయస్థాయి డేటాను సమర్పించాలని డిసెంబరు 9న అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. అలాంటి డేటాను సంకలనం చేయడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సమర్థవంతంగా సమన్వయం చేసుకునేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక అంకితభావంతో కూడిన అధికారిని నియమించాలని కోరింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి అంకితభావంతో కూడిన నోడల్ అధికారులను నియమించడం, దానికి సంబంధించిన వివరాలను మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్‌లో తక్షణమే అప్‌లోడ్ చేయాలని గతంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దేశంలో ప్రతీ 8 నిమిషాల వ్యవధిలో ఒక చిన్నారి అదృశ్యం అవుతుందని గత ఏడాది నవంబరు 18న వచ్చిన వార్తలపై అత్యున్నత న్యాయస్థానం తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసిందని, దానిని తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. దేశంలో ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, దీనిపై ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాలలో తప్పిపోయిన పిల్లలను గుర్తించే పనిని అప్పగించిన అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని ధర్మాసనం ఎత్తి చూపింది. ఈ పోర్టల్‌లో ప్రతీ రాష్ట్రం నుంచి ఒక అధికారిని నియమించి సమాచారాన్ని వ్యాప్తి చేయడంతో పాటు, తప్పిపోయిన పిల్లల కేసుల ఫిర్యాదులను పరిష్కరించగలరని పేర్కొంది. గత ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో మైనర్ బాలురు, బాలికలను కిడ్నాప్ చేసి వారిని మధ్యవర్తుల నెట్‌వర్క్ ద్వారా జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేశారని ఆరోపిస్తూ ఐదు కేసులు నమోదు అయ్యాయని పిటిషన్ వివరించింది.




# బొటానికల్ గార్డెన్‌లో 'ఉచిత లైబ్రరీ', స్టోరీ బోర్డ్ ప్రారంభం

## అటవీ శాఖ సేవలపై అవగాహన పెంపొందించే వినూత్న ప్రయత్నం



ప్రజాపక్షం/హైదరాబాద్: నగరవాసులకు ప్రకృతి ఒడిలో విజ్ఞానాన్ని అందించడంతో పాటు, అటవీ సంరక్షణలో అటవీ శాఖ చేస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మంగళవారం కొండాపూర్‌లోని హైదరాబాద్ బొటానికల్ గార్డెన్‌లో 'ఉచిత లైబ్రరీ'తో పాటు 'ది లెసర్ నోన్ ఖాకీ' పేరుతో ప్రత్యేక స్టోరీ బోర్డ్‌ను తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, వైస్ చైర్మ, మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం.భగవత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ, ప్రజలకు అటవీ శాఖకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అన్నారు. బొటానికల్ గార్డెన్‌ను కేవలం సందర్శక కేంద్రంగా కాకుండా, ఒక విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎకో టూరిజం) ఎల్.రంజిత్ నాయక్, సిజిఎం డి. వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ జి.స్కెలాబ్, సీనియర్ డివిజనల్ మేనేజర్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎకో టూరిజం) శిరీష, ఫైనాన్షియల్ కంట్రోలర్ కిరణ్ కుమార్, పిఎం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# క్యూబాలో చమురు సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

నుండి క్యూబాకు సబ్సిడీ ధరలపై చమురు రవాణా అయ్యేది. కానీ జనవరి మొదటివారంలో వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆయన సతీమణిని కిడ్నాప్‌చేసి న్యూయార్క్ జై లులో బంధించిన ట్రంప్ బెదిరించి వెనిజులాలో తనకు విధేయంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో క్యూబాకు చమురు రవాణా నిలిచిపోయింది. మొన్నటివకూ మెక్సికో కూడా సానుభూతితో చమురు రవాణా చేస్తోంది. మెక్సికో, రష్యా దేశాలు సరఫనా చేస్తున్న చమురు క్యూబా అవసరాలకు సరిపోవడంలేదు. క్యూబాకు రోజుకు 70వేల బ్యారల్స్ చమురు అవసరం అవుతుంది. 'ట్రంప్‌కు ఇష్టం లేకపోతే క్యూబాతో వ్యాపారం చేయడం మానేయాలి, క్యూబాపై ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు లేదు, క్యూబా సార్వభౌమాధికారాన్ని ట్రంప్ ఉల్లంఘిస్తున్నారు, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు, క్యూబాపై అక్రమంగా ఆంక్షలు విధించారు' అని విశ్లేషకులు మండిపడుతున్నారు. క్యూబాను లొంగదీసుకుని అమెరికాను అనుకూలంగా మార్చుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. క్యూబా తమతో చర్చలకు రావాలని ఆయన షరతు విధించారు. దీనికి క్యూబా కూడా సానుకూలంగా స్పందించింది. న్యాయబద్ధమైన, పరస్పర మర్యాదపూర్వకమైన, పరస్పర సమాన గౌరవంతో కూడిన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని కొద్దిరోజుల క్రితం క్యూబాప్రకటించింది.

### సంక్లిష్ట దశలో క్యూబా... కానీ ఒంటరి కాదు : కానెల్

క్యూబా సంక్లిష్ట దశలో ఉందని రిపబ్లిక్ ఆఫ్ క్యూబా అధ్యక్షుడు, కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమి టీ మొదటి ప్రధాన కార్యదర్శి మిగ్యుల్ డియాజ్–కానెల్ బెర్ముడెజ్ అన్నారు. దేశంలో చమురు సంక్షోభం ముదడంతో ఆయన ఈనెల ఆరో తేదీన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వెనిజులా చు ట్టూ అమెరికా నౌకలను మోహరించి రాకపోకలను నిలిపివేసిన తర్వాత నుండి క్యూబాలో చమురు సంక్షోభం ప్రారంభమైందన్నారు. క్యూబాపై అపవాదులు, విద్వేష ప్రచారం, మానసిక యు ద్ధం, తీవ్రమైన మీడియా ప్రచారంతో దేశ ప్రజల్లో ఆందోళనలు నెలకున్నాయన్నారు. ప్రజలు సమైక్యంగా ఉన్నారని, ఇంధన సమస్య పరిష్కారానికి మంత్రిమండలి తీవ్రంగా మార్గాన్వేషణకు ఆలోచిస్తోందన్నారు. 67 సంవత్సరాల క్యూబా విప్లవ జీ వితంలో అనేక తరాలు అమెరికా విధించిన ఆంక్షల మధ్యే జన్మించారని, ఆ ఆంక్షల్లోనే వారి జీవితాలు కొనసాగుతున్నాయని, ఇంత సుదీర్ఘంగా ప్రపంచంలో ఏ దేశంపైనా ఆంక్షలను ఎవరూ అమలు చేయలేదన్నారు. 'మేం కష్ట సమయాన్ని అనుభవించబోతున్నాం, గతంలో కూడా అనుభవించాం, ముఖ్యంగా క్యూబా స్త్రీలు, పురుషులూ సృజనాత్మకమైన ప్రతిఘటనతో ఈ కష్ట సమయాన్ని అధిగమించబోతున్నాం' అన్నారు. ఛావెజ్ బొలివేరియన్ విప్లవానికి నాయకత్వం వహించినప్పటి నుండీ గడచిన పాతిక సంవత్సరాలుగా రెండు దేశాలమధ్యా సహకారం వృద్ధి చెందింది, ఈ సహకాన్ని రెండు దేశాలు సద్వినియోగం చేసుకున్నాయి, వెనిజులాతో సంబంధాన్ని ఆ దేశంపై ఆధారపడటంగా వర్గీకరించలేం, అలా చెబితే ''వారు'' వస్తు సేవల మార్పిడిని మరింత తగ్గించే ప్రయత్నం చేస్తారు, ఆహారం, ఇంధనం, కేడర్ శిక్షణ, సాంస్కృతిక రంగాల మార్పిడి, ఉన్నతవిద్య, మైనింగ్, పరిశ్రమలు వంటి అనేక అంశాల్లో రెండు దేశాలమధ్యా సంబంధాలు కొనసాగుతున్నాయి, కానీ వెనిజులాను చుట్టుముట్టిన తర్వాత క్యూబాపై ఆంక్షలు విధిస్తూ, టారిఫ్ బెదిరింపులు చేస్తూ ఇటీవల ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు జారీ చేసింది, చైనా, రష్యా నాయకులు సహా అనేక దేశాల నాయకులతో టెలిఫోన్ సంభాషణలు చేశాం, క్యూబాకు మార్గాలన్నీ తెరచుకునే ఉన్నాయి, క్యూబా ఒంటరి దేశం కాదు'' అని కానెల్ చెప్పారు.

# ఆశ్రయించిన సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

చర్యలకు బాధ్యుణ్ణి చేసేందుకు, ముఖ్యమంత్రి ప్రవర్తనపై స్వతంత్రంగా, నిష్పాక్షకంగా దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టుకు పార్టీ విజ్ఞప్తి చేసింది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా న్యాయపరంగా ఉన్న నిర్దేశిత చట్టాలకు అనుగుణంగా కేసులు రిజిస్టర్ చేసేందుకు న్యాయస్థానం భరోసా ఇవ్వాలని కోరింది. ఈ కేసుల దర్యాప్తులో ప్రభుత్వం తన ప్రభావం చూపించకుండా, అధికారాన్ని ఉపయోగించకుండా, బహిరంగ వేదికల ద్వారా ప్రజలమధ్య శత్రుత్వం పెంచే ప్రసంగాలు చేయకుండా నివారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరింది. రాష్ట్రంలో ప్రజలందరికీ చట్టబద్ధమైన సమాన రక్షణ కల్పిస్తామని,ప్రజల విశ్వాసాలకు, వారి స్వేచ్ఛకు పూర్తి భరోసా ఇస్తామని, రాజ్యాంగ విలువలను కాపాడతానని ముఖ్యమంత్రిగా చేసిన ప్రమాణాన్ని ఇలాంటి చర్యల ద్వారా ఆయన బాహాటంగా ఉల్లంఘించడమే అవుతుందని కూడా సిపిఐ కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. హిమంత బిశ్వశర్మ చేస్తున్న వ్యాఖ్యలు అసోంలో ప్రజలమధ్య సామరస్య వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని, ఆయన ప్రసంగాలు సైద్ధాంతిక తీవ్రతవైపు నెట్టి సమాజాన్ని రెండు శత్రుశిబిరాలుగా మార్చే ప్రమాదం తీసుకువస్తున్నారని, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం వంటి దేశ రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్నాయని ఈ పిటిషన్‌లో సిపిఐ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా పక్షపాత ధోరణిని, శత్రుత్వాన్ని ఎలాంటి విచారణలూ లేకుండానే ముందస్తు తీర్పుల ద్వారా చట్టబద్ధం చేయడానికి ప్రభుత్వ అధికారాన్ని ప్రమాదకరస్థాయిలో ఆయన దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుకు తెలియజేసింది. ఈ విషయాలను బహిర్గతంచేసే పలు ఉదాహరణలను సిపిఐ ఈ పిటిషన్ ద్వారా న్యాయస్థానం ముందుంచింది. మైనారిటీలు సమాజానికి పెద్ద బెడదగా, అపాయంగా చిత్రీకరిస్తూ వారి బహిష్కరణను సాధారణాంశంగా మార్చి, మైనారిటీ వర్గాలను ఒంటరి చేసేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి అధికారిక రాజకీయ సందేశాలు, బహిరంగ ప్రకటనలను కోర్టు దృష్టికి తీసుకువెళ్ళింది. కాగా అధికారిక రాజకీయ వేదికల నుండి వ్యాప్తిచేసిన, ప్రస్తుతం పూర్తిగా చలామణీలో లేకుండా తొలగించిన వీడియో ప్రమాదకరంగా మారిందని, ఈ వీడియో ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తిచేసి, హింసను పురిగొల్పడానికి, విస్తరింపజేయడానికి ఒక కొత్త సాధనంగా ఇప్పటివరకూ ఉపయోగపడిందని, ఒక రాష్ట్రానికి మొదటి పౌరుడుగా, ఉన్నత కార్యనిర్వాహకస్థానంలో ఉన్న వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం, రాష్ట్రంలో సాంఘిక వాతావరణాన్ని మతోన్మాదానికి నిలయంగా మార్చడానికి దోహదం చేయడం ద్వారా మైనారిటీలకు వ్యతిరేకంగా వివక్షను వ్యవస్థాగతం చేయడాన్ని ప్రోత్సహించడానికి యత్నిస్తున్నారని, దీనివల్ల మైనారిటీ వర్గాలలో అభద్రతాభావం పెరుగుతుందని, సమాన పౌరసత్వ భద్రత క్షీణించిపోతుందని సుప్రీంకోర్టుకు సిపిఐ తెలియజేసింది. అదేవిధంగా రాజ్యాంగం ప్రభుత్వబాధ్యతల్లో ఉన్నవారు విద్వేషాన్ని జాతి ప్రధాన స్రవంతిలో వ్యాప్తిచేయడానికి రాజ్యాంగం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించదని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ బాధ్యతలు నిర్వహించేవారు ఎవరైనాగానీ, ఎంత ఉన్నతస్థానాల్లో ఉన్నాగానీ చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేశారు. లౌకికవాదం అనేది కేవలం రాజకీయ అవసరాల కోసం ఉపయోగించేకునే విషయం కాదని,దేశంలోని పౌరులందరికీ ఉన్న గౌరవ మర్యాదలను, స్వేచ్ఛావిశ్వాసాలను, సమానత్వాన్ని సంరక్షించే రాజ్యాంగ మౌలిక సూత్రమని ఆమె స్పష్టం చేశారు.

దేశ లౌకికతత్వానికి, ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు భారత కమ్యూనిస్టుపార్టీ పునరుద్ఘాటించింది. మతంపేరుతో ప్రజలను విభజించే శక్తులు, ఆ ధోరణులపై రాజకీయ,సామాజిక, న్యాయ వేదికలద్వారా కమ్యూనిస్టుపార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, రాజ్యాంగం ఇచ్చిన న్యాయం,స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వ వాగ్దానాలను పరిరక్షించడంకోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న అన్ని మార్గాలను పార్టీ అనుసరిస్తుందని సిపిఐ తన ప్రకటనలో స్పష్టం చేసింది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com